


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ఉగాది శుభాకాంక్షలు




ఆదివారం | 30-3-2025 | పేజీలు: 16 + ఉగాది పంచాంగం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 361 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి:పాడ్యమి మ.12.50 తదుపరి విదియ; నక్షత్రం: రేవతి సా.4.35 తదుపరి అశ్విని; వర్జ్యం: శే.ఉ.7.25; అమృతఘడియలు: మ.2.28-3.52; దుర్ముహూర్తం: సా.4.47-5.35; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 6.24 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




## 17 మంది మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లో సుకుమా జిల్లాలో ఎన్‌కౌంటర్

మృతుల్లో 11 మంది మహిళలు.. డివిజన్ కార్యదర్శి

గాయపడ్డ నలుగురు డీఆర్‌జీ జవాన్లు

మావోయిస్టులు లొంగిపోవాలి: అమిత్ షా

14

## ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే..

16

డీఎస్పీ ప్రణీత్‌రావుతో టచ్‌లో ఉన్నా.. కొన్ని నంబర్లు ఇచ్చి ట్యాపింగ్ చేయించా

పోలీసుల విచారణలో ఒప్పుకొన్న శ్రవణ్‌రావు.. ట్యాపింగ్ పరికరాలకు డబ్బులు ఎవరిచ్చారు?

రాధాకిషన్, ప్రభాకర్‌రావు ఎలా తెలుసు?.. ప్రణీత్‌రావు మీ ఆఫీసుకు ఎందుకొచ్చేవారు?

ఉప ఎన్నికల వేళ డబ్బు పట్టివేత వెనుక ఉన్నదెవరు?.. ప్రశ్నల వర్షం కురిపించిన పోలీసులు

చాలా ప్రశ్నలకు జవాబులు దాటవేసిన శ్రవణ్‌రావు.. 2న మళ్లీ విచారణకు రావాలని ఆదేశం




## మయన్మార్‌లో హాహాకారాలు

1,664కు చేరిన మృతులు

40కి పైగా వారసత్వ కట్టడాలు నేలమట్టం

కూలిన మండలే జైలు

తెలియని ఖైదీల ఆచూకీ

విద్యుత్తు కట్.. నీటికి కటకట

40 టన్నుల సహాయక సామగ్రిని పంపిన భారత్

14





కొడంగల్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీఎం

## పదేళ్లు కొడంగల్‌కే సీఎం సీటు

దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

భూములు కోల్పోయిన కుటుంబాలకు 2 ఉద్యోగాలు

అంబేడ్కర్‌ను అవమానించిన షా

బీసీలకు బీజేపీ వ్యతిరేకం

15

హిందూ ముస్లింలు ఏకమై దేశాన్ని కాపాడాలి: సీఎం రేవంత్

కొడంగల్‌లో ముఖ్యమంత్రి పర్యటన

# పండగ పూట సన్నబియ్యం


### నేడు హుజూర్‌నగర్‌లో ప్రారంభించనున్న సీఎం

### 50 వేల మందితో సభ.. ఏర్పాట్లను పరిశీలించిన ఉత్తమ్

### ఏప్రిల్ నుంచి 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ

నల్లగొండ/హుజూర్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేషన్‌కార్డులు కలిగిన పేదలకు ఉచితంగా సన్నబియ్యం ఇచ్చే పథకం ఉగాది పండుగ రోజు శ్రీకారం చుట్టుకోనుంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఇందుకు వేదిక కానుంది. ఆదివారం సాయంత్రం ఇక్కడ నిర్వహించే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకోసం పట్టణంలోని వై-జంక్షన్ నుంచి రామస్వామిగుట్టకు వెళ్లే దారిలో సన్నబియ్యం ప్రారంభోత్సవ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సభకు హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుంచి సుమారు 50 వేల మందిని తరలించేలా సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నుంచి మంత్రి ఉత్తమ్‌తో కలిసి హెలికాప్టర్‌లో హుజూర్‌నగర్‌లోని రామస్వామిగుట్ట వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో మంత్రితో కలిసి నిర్మాణంలో ఉన్న మోడల్‌కాలనీలోని 2,150 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను పరిశీలిస్తారు. అనంతరం నేరుగా సభావేదిక వద్దకు చేరుకొని సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తారు. అనంతరం సభను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తదితరులు ప్రసంగిస్తారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిగతా 15వ పేజీలో...






# ఆరోగ్య 'మస్తు'!

## ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య పెంపు

- ప్రస్తుతం 409 ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలు
- వెయ్యికి పెంచాలని సర్కారు నిర్ణయం
- 30-50 పడకల ఆస్పత్రులకూ అవకాశం

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య శ్రీ సేవలు విస్తరించనున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా మరిన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి తేవాలని సంకల్పించింది. ఈ మేరకు ప్రస్తుతం పరిమితంగా ఉన్న ఆరోగ్యశ్రీ ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను భారీగా పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 409 ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీకి అనుసంధానమై ఉన్నాయి. ఈ సంఖ్యను వెయ్యి ఆస్పత్రులకు పెంచాలని నిర్ణయించింది. ఈ లెక్కన దాదాపు 600 ఆస్పత్రుల్లో కొత్తగా ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. 30 నుంచి 50 పడకల ఆస్పత్రులనూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేనున్నారు. ఇటీవల కొత్తగా మరో 164 ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ అనుసంధానం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అయితే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు నిర్దేశించిన సౌకర్యాలు ఈ ఆస్పత్రుల్లో ఉన్నాయా? అన్న అంశాలను సంబంధిత అధికారుల బృందం పరిశీలించి సంతృప్తి చెందాకే అనుమతులు ఇవ్వనున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో జనాభాకు తగ్గట్లుగా ఆరోగ్య అనుసంధాన ఆస్పత్రుల్లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబరు 8న ఆరోగ్యశ్రీని రాజీవ్ ఆరోగ్యశ్రీగా మార్చింది. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. కొత్తగా 163 ప్యాకేజీలను ఆరోగ్యశ్రీ సేవల పరిధిలోకి తెచ్చింది. వాటిని కూడా కలిపితే మొత్తం ప్యాకేజీల సంఖ్య 1835కు పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 1042 ప్రభుత్వ ఆస్పత్రులు, 409 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. వీటిలో ఎక్కువగా గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టు పక్కల జిల్లాలోనే ఉన్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రుల అనుమతులను శాస్త్రీయత లేకుండా ఇష్టారాజ్యంగా ఇచ్చారనే విమర్శలున్నాయి. ప్రతి 50 వేల జనాభాకు నెట్‌వర్క్ ఆస్పత్రులు అందుబాటులో ఉండాలన్న ప్రామాణికతను ఆధారంగా చేసుకుంటే.. మన దగ్గర 29 శాతమే అనుసంధాన ఆస్పత్రులున్నాయి. ఏపీలో 800 వరకు ఆరోగ్యశ్రీ అనుసంధాన ఆస్పత్రులున్నాయి. అక్కడ జనాభాకు తగ్గట్లుగా 50 శాతం వరకు ఎంప్యానెల్ ఆస్పత్రులున్నాయి. మన దగ్గర కూడా నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య వెయ్యికి పెంచితే ప్రతి 50 వేల జనాభాకు ఆరోగ్యశ్రీ అనుసంధాన ఆస్పత్రి అందుబాటులోకి వచ్చినట్లవుతుంది. ప్రస్తుతం ప్రైవేటులో ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల సంఖ్య తక్కువగా ఉండటంతో రోగులు వైద్య శస్త్రచికిత్సల కోసం పెద్ద పట్టణాలకు రావాల్సివస్తోంది. తమకు సమీపంలోనే నెట్‌వర్క్ ఆస్పత్రులుంటే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఎక్కువ సంఖ్యలో నెట్‌వర్క్ ఆస్పత్రులుంటే నచ్చిన ఆస్పత్రికి వెళ్లే అవకాశం రోగులకు లభిస్తుందని అంటున్నారు.

### 13 అంచెల విధానం నుంచి 10కి కుదింపు

ప్రస్తుతం ఏదైనా ప్రైవేటు ఆస్పత్రి ఆరోగ్యశ్రీలో నమోదు కావాలంటే 13 అంచెలను దాటుకొని రావాలి. ఆ 13 అంచెల్లో ఎక్కడైనా చిన్న ప్రతిబంధకం ఏర్పడ్డా కూడా సదరు దరఖాస్తును తిరస్కరిస్తున్నారు. అంతేకాక ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా ఎప్పుడో కొన్ని సంవత్సరాల తర్వాత ఎంప్యానెల్ అయ్యేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దాంతో అనుసంధాన ఆస్పత్రులుగా మారడం చాలా క్లిష్టతరంగా మారింది. ఫలితంగా 13అంచెల నుంచి దాన్ని 10కి కుదించారు. ఆస్పత్రుల అనుమతుల నిర్ణయం తీసుకునే ఈడీసీ (ఎంప్యానెల్ డిసిప్లినరీ కమిటీ)ని పూర్తిగా తొలగించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు, అర్హత గల వైద్యులున్న ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ ఇవ్వనున్నారు. అనుసంధాన అనుమతులను మరింత సులభతరంగా, తక్కువ సమయంలో ఇచ్చేలా కూడా వైద్యఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంది. వీటితో పాటు అనుసంధాన ఆస్పత్రుల్లో ఆర్థోపెడిక్, పాలీట్రామా సేవలు మరింతగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటోంది.

## ఇంట్లో తల్లి మృతదేహం..
# పది పరీక్షకు కుమారుడు

- నల్లగొండలో విషాదం

నల్లగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తల్లి మరణించిన దుఃఖాన్ని దిగమింగుకొని నల్లగొండలో ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలు రాశాడు. నల్లగొండకు చెందిన సాగల లక్ష్మీప్రసన్న శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. నల్లగొండలోని జేబీఎస్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆమె కుమారుడు సాయిచైతన్య శనివారం సైన్స్ పరీక్ష రాయాల్సి ఉంది. అయితే తల్లి మృతితో తీవ్ర వేదనకు గురైన సాయిచైతన్య.. ఆమె మృతదేహం ముందు కన్నీటి పర్యంతమయ్యాడు. బంధుమిత్రులు చైతన్యను ఓదార్చి పరీక్ష రాయడానికి పంపించారు. సాయి చైతన్య తండ్రి నాగరాజు కుటుంబాన్ని పట్టించుకోకుండా వదిలివెళ్లినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయి చైతన్యను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.















ఎండ కారణంగా నిర్మానుష్యంగా మారిన మహబూబ్‌నగర్‌లోని ప్రధాన రహదారి

# సుర్రుమంటున్న సూరీడు..!

- 20 జిల్లాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు

హైదరాబాద్/ మహబూబ్‌నగర్/ కరీంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత బాగా పెరిగింది. శనివారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి, కెరమెరి మండలాల్లో 41.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 41.4 డిగ్రీలు, జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపింది. వనపర్తి జిల్లాలోని కొత్తకోట, అమరచింత మండలాల్లో 41.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా, గద్వాల జిల్లాలోని ఖిల్లా ఘణపూర్‌లో 40.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. మహబూబ్‌నగర్‌లో 39.9, నాగర్‌కర్నూల్ జిల్లాలో 39, నారాయణపేట జిల్లాలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో అత్యల్పంగా 39.6 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయినట్లు తెలిపింది. రాగల రెండు రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా కొనసాగే అవకాశముందని, ఆ తర్వాత క్రమేపి 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. సాధారణంగా మార్చి నెలాఖరు నాటికి 38 నుంచి 39.5 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉండగా.. ఈ ఏడాది ఇప్పటికే సాధారణం కంటే రెండు డిగ్రీలు మేర ఎక్కువ ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. ఎండల కారణంగా పగటిపూట ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

# తొమ్మిదేళ్లుగా బియ్యపు గింజలపై శ్రీరామ నామం



బియ్యపు గింజపై శ్రీరామనామాన్ని రాస్తున్న చలువాది వందన

- మైక్రోఆర్ట్ పెన్స్‌తో రాస్తున్న చలువాది వందన
- 7 రాష్ట్రాల్లోని 60 ఆలయాలకు పంపిణీ

మియాపూర్,మార్చి 29(ఆంధ్రజ్యోతి): రామభక్తితో ఓ భక్తురాలు తొమ్మిదేళ్లుగా బియ్యపు గింజలపై శ్రీరామనామాలను మైక్రోఆర్ట్ పెన్స్‌తో రాస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా 7 రాష్ట్రాల్లోని 60 శ్రీసీతారామచంద్ర ఆలయాలకు 1,75,000 తలంబ్రాలను పంపారు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు చెందిన చలువాది వందన నాలుగేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న భర్త నర్సింహరావు ప్రోత్సహంతో 9 ఏళ్లలో 10,75,000 బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని రాశారు. అనేక రామాలయాలతో పాటు ఒంటిమిట్ట, భద్రాచలం దేవస్థానాలకు శ్రీరామనామం ఉన్న తలంబ్రాలు పంపారు. 2020లో ఆయోధ్య రామమందిరం భూమి పూజకు శ్రీరామ నామం రాసిన 50,116 బియ్యపు గింజలను అందజేశారు. అమర వీరులు, స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రాలను కూడా బియ్యపు గింజలపై చిత్రించారు. దేశంలో ఆధ్యాత్మిక చింతన పెరగాలనేదే తన సంకల్పమని వందన తెలిపారు.



శ్రీరామనామంతో బియ్యపు గింజలు


## భద్రాద్రిలో నేటి నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

భద్రాచలం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ఆదివారం వసంతపక్ష ప్రయుక్త నవహ్నిక శ్రీరామనవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. ఈ నేపథ్యంలో భద్రాచలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాల వెలుగులో రామాలయం దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. ఏప్రిల్ 2న ధ్వజపట లేఖనం, 3న గరుడాదివాసం, 4న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, 5న ఎదుర్కోలు, 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారాముల తిరుకల్యాణం, శ్రీరామ పునర్వసు దీక్ష ప్రారంభం కానుంది. అలాగే ఏప్రిల్ 7న మహాపట్టాభిషేకం, 8న సదస్యం నిర్వహించనుండగా 12న చక్రతీర్థం, శ్రీపుష్పయాగంతో ఉత్సవ సమాప్తి కానుంది. శ్రీరామనవమి, మహాపట్టాభిషేక మహోత్సవాలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను, సీఎం రేవంత్‌ను ఆహ్వానిస్తూ అధికారులు రాజపత్రాలను అందజేయనున్నారు.

### సీఎం, గవర్నర్ ఉగాది శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాజ్‌భవన్‌లో శనివారమే ఉగాది సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# అందాల పోటీలు... అంతకు మించి!



అంతర్జాతీయస్థాయిలో, అన్నిదేశాలలో అందాల పోటీలు ప్రస్తుతం ఒక అవిభాజ్య అంశంగా మారిపోయాయి. ఈ పోటీలు కాలక్రమేణా సౌందర్య ప్రదర్శనకు మాత్రమే పరిమితం కాకుండా మనుషులలోని బహుముఖీన ప్రజ్ఞా విశేషాలకు అద్దంపట్టేలా రూపాంతరం చెందడం విశేషం.

ప్రస్తుత ప్రపంచంలో సౌందర్యానికి సంబంధించి చెప్పుకోదగినవిగా 'బిగ్ ఫోర్' పోటీలను చెబుతారు. అవి మిస్ యూనివర్స్, మిస్ వరల్డ్, మిస్ ఎర్త్, మిస్ ఇంటర్నేషనల్. మిస్ వరల్డ్ పోటీలు గత 73 సంవత్సరాలుగా అంతర్జాతీయంగా ఎంతో ప్రామాణికతను, ప్రాచుర్యాన్ని, ప్రభావాన్ని సాధించాయి. 1951 జూలై 29న మొట్టమొదటిసారిగా లండన్‌లోని లైసియం థియేటర్‌లో ఇవి జరిగాయి. యునైటెడ్ కింగ్డమ్‌కు చెందిన ఎరిక్ మోర్లీ మనసులో పుట్టిన ఆలోచన ఇది. అందాల పోటీలు అప్పటివరకు కేవలం శారీరక కొలతలు, రంగు, వివిధ వస్త్రాలలో వారి ఆకట్టుకునే సౌష్టవం ఇత్యాది అంశాలకు మాత్రమే పరిమితమై ఉండేవి. కానీ మిస్ వరల్డ్ పోటీలు 'బ్యూటీ విత్ పర్పస్' అనే లక్ష్యంతో, ఒక అడుగు ముందుకు వేసి సౌందర్యానికి సామాజిక ప్రయోజనాత్మకతకీ వారధిని నిర్మించాయి. అలా మొదలైన 'మిస్ వరల్డ్' పోటీలు ప్రపంచవ్యాప్తంగా ఏటా ఎంతో సందడిగా, వందకు పైగా దేశాల నుంచి సుందరీమణుల ప్రాతినిధ్యంతో అలరారుతున్నాయి.

తెలంగాణ రాజధానినగరం హైదరాబాద్ ఈ 2025 సంవత్సరపు 73వ మిస్ వరల్డ్ పోటీలకు వేదికగా ఎంపిక కావడం, మే నెలలో వాటి నిర్వహణ దిశగా సన్నాహాలు జరుగుతూండటం ఆహ్వానించదగిన అంశం. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చే దిశగా, తెలంగాణ రాష్ట్రానికి అంతర్ దేశీయ వైభవం సాధించే దిశగా ఈ వేడుకలు ఒక ముందడుగు. 430 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరం 'ముత్యాల నగరం'గా, 'వజ్రాల నగరం'గా, 'ప్రేమ నగరం'గా ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఈ సౌందర్య పోటీల ఆవిష్కరణతో హైదరాబాద్ నగరం 'అందాల నగరం'గా కూడా అంతర్జాతీయంగా మరొక గుర్తింపును పొందే అవకాశం ఏర్పడింది.

మిస్ వరల్డ్ పోటీలకు భారతదేశానికి అనుబంధం 1966లో మొదటిసారిగా ఏర్పడింది. ఆ ఏట 'రీటా ఫారియా' అనే భారతీయవనిత అంతర్జాతీయంగా అందరినీ దాటి ప్రపంచ సుందరిగా ఎంపిక అయ్యింది. ఈ కిరీటాన్ని గెలుచున్న తొలి ఏషియన్ కూడా ఆమె. ఆ తర్వాత దాదాపు 28 ఏళ్ళ పాటు మళ్లీ ఏ భారతీయ సుందరి ఈ కిరీటాన్ని దక్కించుకోలేక పోయింది. భారతదేశంలో 1991 నుంచి నూతన ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ ప్రక్రియ ఆరంభంతో శాటిలైట్ ఛానల్స్, మీడియా, వినోద పరిశ్రమకు సంబంధించి విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. ఈ నేపథ్యంలో 1994లో ఐశ్వర్యరాయ్ ప్రపంచ సుందరిగా ఈ కిరీటాన్ని దక్కించుకుని వంద కోట్ల భారతీయుల దృష్టిని ఆకర్షించింది. దానికి కొనసాగింపుగా, 1997లో డయానా హెడెన్, 1999లో యుక్తాముఖి, 2000 సంవత్సరంలో ప్రియాంక చోప్రా, 2017లో మానుషి చిల్లర్ వంటి భారతీయ సుందరీమణులు ఈ కిరీటాన్ని గెలుచుకున్నారు. ఈ పరిణామాల దృష్ట్యా భారతదేశంలో గతంలో ఎన్నడూ లేనిస్థాయిలో కాస్మెటిక్ ఇండస్ట్రీ ఆధారిత ఆర్థిక పరమైన అంశాలు ప్రభావితం అయ్యాయి.

**అందాల పోటీలను నిర్వహించే ఆతిథ్య దేశానికి, ప్రాంతానికి అంతర్జాతీయ స్థాయిలో 'బ్రాండింగ్' రూపొందుతుంది. స్థానిక వ్యాపారం పెరుగుతుంది. స్థానిక వంటలు, వస్త్రాలు, కళారూపాలు, సాహిత్యం, సంగీతం, లలిత కళలు వంటి సాంస్కృతిక విశేషాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుంది. మే నెలలో జరగనున్న మిస్‌వరల్డ్ పోటీలు హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెస్తాయి.**

అందాల పోటీలను నిర్వహించే ఆతిథ్యదేశానికి, ప్రాంతానికి అంతర్జాతీయ స్థాయిలో, దాదాపు 120కి పైగా దేశాలలో 'బ్రాండింగ్' రూపొందుతుంది. స్థానిక వ్యాపారం కూడా ఎంతో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. చేతివృత్తులు, హస్తకళలు, స్థానిక వంటలు, వస్త్రాలు, కళారూపాలు, సాహిత్యం, సంగీతం, లలిత కళలు వంటి సాంస్కృతిక విశేషాలు ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుంది. ఈ సౌందర్య పోటీల ప్రారంభ, ముగింపు ఉత్సవాలలో ప్రత్యేకంగా ఆయా దేశాలు లేదా ప్రాంతాలు తమదైన స్థానిక, దేశీయ, మూలవాసుల సంస్కృతులను కళా ప్రదర్శనల ద్వారా చూపించడం వల్ల ఆ ప్రాంత ఔన్నత్యం, అస్తిత్వం, సాంస్కృతిక వైవిధ్యం




ప్రపంచమంతా తెలిసే అవకాశం ఉంటుంది.

అందాల పోటీలు అంతర్జాతీయంగా ఒక దేశ బ్రాండ్‌ని మార్కెటింగ్ చేయడంలో దోహదపడుతున్నాయి అనేది నిజమైనప్పటికీ, స్త్రీ హక్కుల పరిరక్షణ సంఘాలు, మానవ హక్కుల సంఘాలు, ఇతర పౌర సంఘాలు దీని పట్ల ప్రతి సందర్భంలోనూ వ్యతిరేకతను, నిరసనను వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఈ అందాల పోటీలు స్త్రీలను విలాస వస్తువుగా, భోగవస్తువుగా, ఆటబొమ్మగా చూసే సంస్కృతిని పెంపొందిస్తున్నాయని వారు విమర్శిస్తున్నారు. అందుకే ప్రతి ఏటా ఈ అందాల పోటీలు జరిగే దేశాలలో, ప్రాంతాలలో మహిళా సంఘాల నిరసన సెగలు సహజంగా పరిణమించాయి. అయితే ఇటీవలి కాలంలో ఈ ధోరణిలో కొత్త ప్రశ్నలు మొదలవడం గమనించదగిన అంశం. అందాల పోటీలో పాల్గొనే వాళ్ళందరూ వివిధ ప్రొఫెషనల్ రంగాలలో నిష్ణాతులు కావడం, కేవలం 'స్కిన్ షో'కు పరిమితమైన వారుగా కాకుండా, డాక్టర్లుగా, కార్పొరేట్ మేనేజర్లుగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, వర్ధమాన పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతూ, వివిధరంగాలలో ప్రతిభను, ప్రగతిని చూపించిన మహిళలే ఇందులో పాల్గొనడానికి సుముఖత చూపడం గమనార్హం. మరొకవైపున ఈ పోటీలలో సాంస్కృతిక విశిష్టతలను చెప్పే అంశాలు, మేధస్సుని పరీక్ష చేసే అంశాలు, సామాజిక సేవ, మానవీయ కోణాలను పరీక్ష చేసే మరెన్నో అంశాలు అంతర్భాగంగా జోడించడం వల్ల ఒక స్త్రీ మూర్తిమత్వాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించగలిగే పోటీలుగా ఇవి రూపాంతరం చెందాయి. "మేధస్సుని కలిగినవారు సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలలో పాల్గొంటారు. ప్రొఫెషనల్ నైపుణ్యం కలిగినవారు వైద్యులుగా, వ్యాపారవేత్తలుగా, న్యాయవాదులుగా, ఇంజనీర్లుగా తమ ప్రతిభని ప్రదర్శిస్తున్నారు. వీటన్నిటితో పాటు సౌందర్యం కూడా అదనంగా కలిగిన మేము, మా సౌందర్యాన్ని ప్రదర్శించి అందులో మిగతావారి కన్నా ఎంతో బాగున్నామని నిరూపించుకోవడంలో తప్పేముంది?" అని అందాల పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు వేస్తున్న ప్రశ్నలు ఇప్పుడు అందర్నీ ఆలోచింపజేస్తున్నాయి.

హైదరాబాద్‌లో జరగబోయే ఈ అందాల పోటీలు మరింత నాణ్యతతో, మరింత సాంస్కృతిక వైవిధ్యతతో, శారీరక సౌందర్యంతో అంతఃసౌందర్యాన్ని కూడా ప్రదర్శించే విధంగా రూపొంది, తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ సౌందర్య చిత్రపటంలో ప్రత్యేకంగా నిలుపుతాయి అని ఆశించవచ్చు.

• డాక్టర్ మామిడి హరికృష్ణ
డైరెక్టర్, తెలంగాణ భాష–సాంస్కృతిక శాఖ


# కృత్రిమ మేధలో 'డ్రాగన్' దూకుడు

కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికత చైనాకు ప్రతీకగా మారింది. ప్రపంచదేశాలు ఇంతవరకు చైనాను చూస్తున్న తీరు తెన్నులను డీప్‌సీక్ ఒక్కసారిగా మార్చివేసింది. చైనా శీఘ్రపురోగతిని నిరోధిస్తున్న ప్రతి ద్రవ్యోల్బణం, రుణభారం, జన సంఖ్యామానం సమస్యలపై కలవరపాటు సమసిపోయేందుకు డీప్‌సీక్ దోహదం చేస్తోంది. ఇప్పుడు మదుపుదారులు అందరూ ఆ సమస్యల గురించి కాకుండా ఆర్థికాభివృద్ధిలో అమెరికాను చైనా ఎలా, ఎంతత్వరగా అధిగమించగలుగుతుంది, సాంకేతికతల సృష్టిలో ప్రస్తుత ప్రపంచ అగ్రరాజ్య ప్రాబల్యాన్ని చైనా ఎలా సవాల్ చేయనున్నదీ అన్న విషయాలపైనే మాటామంతీ జరుపుతున్నారు.

చైనాకు విశేషంగా ఉన్న 'ఇంజినీర్ లబ్ధి' (engineer dividend) సత్ఫలితాలనిస్తోంది. 2000–2020 సంవత్సరాల మధ్య చైనాలో ఇంజినీర్ల సంఖ్య 5.2 మిలియన్ నుంచి 17.7 మిలియన్‌కు పెరిగింది. అపారంగా అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్ ప్రతిభాపాటవాలు 'ఉత్పత్తి అవకాశాల సరిహద్దు' (production possibility frontier)ను మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడంలో చైనాకు తోడ్పడుతుంది. ఒక విధంగా డీప్‌సీక్ సంచలనం ఆశ్చర్యకరమైనదేమీ కాదు. ఇంజినీరింగ్ ప్రతిభావంతులు అత్యధిక సంఖ్యలో ఉండడం వల్లే సాంకేతికతల నవీకరణలో పథనిర్దేశం చేయగల అవకాశం చైనాకు లభించింది. 2022లో ప్రపంచ అగ్రగామి ఎఐ పరిశోధకులలో 47శాతం మంది తమ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను చైనాలోనే పూర్తి చేశారు. ఈ విషయంలో అమెరికా వాటా 18 శాతం మాత్రమే. ప్రపంచ మేధా సంపత్తి సంస్థ గణాంకాల ప్రకారం 2024లో ఇన్నోవేషన్ ఇండికేటర్స్‌లో చైనా మూడవ స్థానంలో ఉంది. ఈ వినూత్న సాంకేతికతల సృష్టి అనామక పరిశోధనా కేంద్రాల నుంచి జరుగుతున్నదనే వాస్తవాన్ని కూడా మనం గుర్తించాలి. ఇందుకొక ఉదాహరణే డీప్‌సీక్. బీజింగ్‌లోని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం 'Tsinghua' నుంచి అది ప్రభవించలేదు. ఒక చిన్ననగరంలోని ఒక అంకుర సంస్థ నుంచి అది వెలుగుచూసింది. డీప్‌సీక్ సృష్టికర్త లియాంగ్ వెన్ ఫెంగ్ ప్రఖ్యాత ఝెజియాంగ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. అయితే, ఆ వర్శిటీ చైనా హార్వర్డ్ విశ్వవిద్యాలయమేమీ కాదు. స్టాక్ ఎనాల్సిస్, రెజ్యూమ్ స్క్రీనింగ్ మొదలైన సంక్లిష్ట పనులను సమర్థంగా నిర్వర్తించగల అధునాతన సాంకేతికతను సృష్టించడం ద్వారా Manus ఎఐ ఇటీవలే మరొకసారి కృత్రిమ మేధరంగంలో అమెరికా అగ్రగామిత్వంపై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ సంస్థ చీఫ్ ఎక్జిక్యూటివ్ జియావోహాంగ్ వూహాన్‌లోని హువాఝోంగ్ విశ్వవిద్యాలయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ చదివాడు. ఈ వర్శిటీ పేరు ప్రఖ్యాతులు ఝెజియాంగ్ విశ్వవిద్యాలయంకు ఉన్న వాటి కంటే కూడా తక్కువే.

'యూనిట్రీ రోబోటిక్స్' అనే అంకుర సంస్థనే తీసుకోండి. దీని 'కుంగ్ ఫు బాట్స్' ప్రతిష్ఠాకరమైనవి. కృత్రిమమేధ ఆధారిత మానవుల లాంటి రోబోల (హ్యూమనాయిడ్) అధికోత్పత్తిలో అమెరికా, చైనాల మధ్య పోటీలో చైనాను అగ్రగామిగా నిలపడంలో ఈ కుంగ్ ఫు రోబోలు విశేష దోహదం చేశాయి. షాంఘైలోని ఒక స్థానిక విశ్వవిద్యాలయంలో ఈ అంకుర సంస్థ వ్యవస్థాపకుడు వాంగ్ చదువుకున్నాడు. ఇంగ్లీష్ పరీక్షలో తగిన మార్కులు సాధించలేకపోవడంతో ఏమంత పేరు లేని విశ్వవిద్యాలయమే అతడికి దిక్కు అయింది. ఒక్కమాటలో చెప్పాలంటే, చైనా ఏమి సాధించగలదన్న విషయాన్ని నిర్ధారించేందుకు అత్యుత్తమ విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులయిన అగ్రగామి ఒకశాతం మంది ప్రతిభావంతులను పరిగణనలోకి తీసుకోవద్దు. దిగువస్థాయి విశ్వవిద్యాలయాలలో చదువుకుని, చిన్ననగరాలలో నివసిస్తున్నవారు దిగ్భ్రమ కలిగించే నవకల్పనలతో ప్రపంచం ముందుకు వస్తున్నారు.

మరో ముఖ్యవిషయమేమిటంటే చైనా 'వ్యయప్రయోజనం' పొందుతోంది. ఒక సంస్థ తన పోటీదారుల కంటే తక్కువ ఖర్చుతో వస్తువులు లేదా సేవలను ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని ఈ వ్యయప్రయోజనం సూచిస్తుంది. ఇది అధిక లాభదాయకతకు, మార్కెట్లో పోటీతత్వానికి అవకాశమిస్తుంది. చైనాలో మొత్తం ఇంజినీరింగ్ పట్టభద్రులలో 30 సంవత్సరాల లోపువారు 44 శాతం. అమెరికాలో ఇది 20 శాతం మాత్రమే. ఒక ప్రతిభావంతుడైన పరిశోధకుడి మీద చైనా పెడుతున్న ఖర్చు అమెరికా చేస్తున్న వ్యయంలో ఎనిమిదో వంతు.




**డీప్‌సీక్ సంచలనం ఆశ్చర్యకరమైనదేమీ కాదు. 2022లో ప్రపంచ అగ్రగామి ఎఐ పరిశోధకులలో దాదాపు సగంమంది తమ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను చైనాలోనే పూర్తిచేశారు. ఈ విషయంలో అమెరికా వాటా 18 శాతం. ప్రపంచ మేధా సంపత్తి సంస్థ గణాంకాల ప్రకారం 2024లో ఇన్నోవేషన్ ఇండికేటర్స్‌లో చైనా మూడవ స్థానంలో ఉంది. ఈ వినూత్న సాంకేతికతల సృష్టి చైనాలోని అనామక విశ్వవిద్యాలయాలనుంచే అధికంగా జరుగుతోంది.**

చైనాలో ఉన్నత విద్యారంగంమీద పాలకుల శ్రద్ధ కారణంగా ఇప్పుడు ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసినవారిలో 40శాతం మంది విశ్వవిద్యాలయాలకు వెళ్లుతున్నారు. పాతికేళ్లక్రితం ఇటువంటి విద్యార్థుల సంఖ్య కేవలం 10 శాతం. చైనాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యలో ఇంజినీరింగ్ కోర్సులో చేరేవారు అత్యధికం. జనాభాసంఖ్య తగ్గుదల సమస్యతో సతమతమవుతున్న చైనా ప్రభుత్వానికి ఇదొక ఉపశమనం. గత ఏడాది చైనాలో 9.5 మిలియన్ పసిపాపలు మాత్రమే పుట్టారు. కోవిడ్ ఉపద్రవానికి ముందుకాలంలో వార్షిక జనాభా పెరుగుదల 15 మిలియన్‌గా ఉండేది. తమ సమాజం అంతకంతకూ వృద్ధాప్య సమాజం అయిపోతుండడంతో పాటు ఎగుమతుల ఆధారిత అభివృద్ధి నమూనా ప్రయోజనాలు తగ్గిపోవడంతో ఒకనాటి జపాన్ వలే చైనా ప్రాధాన్యాన్ని కోల్పోవచ్చనే భయాందోళనలు ఈ దేశ ప్రజలు, పాలకులలో పెరిగిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ ప్రతిభాపాటవాల సమృద్ధి ఒక సరికొత్త అభివృద్ధి నమూనాను సూచిస్తోంది. చైనా కార్మిక శ్రేణులలో వృద్ధులు పెరిగిపోతున్నారు. ఆగ్నేయాసియా దేశాలతో పోలిస్తే చైనాలో సంప్రదాయక ఎగుమతుల రంగాలయిన స్మార్ట్ ఫోన్స్, వస్త్రోత్పత్తులలో కార్మికుల వేతన భత్యాలు అత్యధికం. అయితే, ప్రతిభాసంపన్నులైన యువ ఇంజినీర్లు సమృద్ధిగా అందుబాటులో ఉన్నారు. జీవ సాంకేతికతలు, రోబోలు, కృత్రిమ మేధ అనువర్తనాలలో అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలకు దీటైన పోటీ నివ్వగల శక్తిసామర్థ్యాలను చైనాకు వారు సమకూర్చగలరు.

చైనా పాలకులు ఇప్పటికే సంప్రదాయ ఎగుమతుల రంగాలకు ప్రాధాన్యమివ్వడాన్ని తగ్గించారు. ఆ రంగాలలో తాము కీలక అనుకూలతలను కోల్పోతున్నామన్న వాస్తవాన్ని వారు గుర్తించారు. అందుకు మారుగా ఉత్కృష్ట ఇంజినీరింగ్ ప్రతిభా సామర్థ్యాలను అపారంగా సమకూర్చుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. కనుక అమెరికా టెక్నలాజికల్ శక్తి సామర్థ్యాలు తిరుగులేనివని వాదిస్తున్నవారు వాటికి చైనా నుంచి ఎదురవనున్న వ్యవస్థాగత సవాళ్లను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ఒకనాడు వస్త్రోత్పత్తులు, గృహ సామగ్రి ఉత్పత్తులలో వలే ఇప్పుడు కృత్రిమమేధ ఇత్యాది అధునాతన సాంకేతికతరంగాలను డ్రాగన్ దున్నేయబోతున్నదా?

○ షులి రెన్
(డెక్కన్ హెరాల్డ్ సౌజన్యం)

# పూర్వవైభవానికై అమెరికా ఆరాటం!

ప్రపంచ చరిత్ర కనీసంగానైనా తెలియకపోతే ప్రపంచంలో వేగంగా మారుతున్న నేటి పరిస్థితులు గందరగోళంగానే దర్శనమిస్తాయి. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ఆ యుద్ధంలో గెలిచినప్పటికీ బ్రిటన్ ఆర్థికంగా చితికిపోయింది. రాజకీయంగా ఉన్న అగ్రరాజ్య ఆధిపత్య స్థానాన్ని కూడా కోల్పోయింది. అప్పటివరకు వేగంగా అభివృద్ధి చెందుతూ వచ్చిన అమెరికా, బ్రిటన్ స్థానాన్ని తీసుకున్నది. రెండు ప్రపంచ యుద్ధాలతో ప్రపంచాన్ని విధ్వంసం చేసిన దేశాలన్నీ అమెరికా నాయకత్వంలో ఒకే కూటమిగా ఏర్పడినాయి. సోషలిస్టు దేశాలకు నాయకత్వం వహిస్తున్న సోవియట్ యూనియన్‌ను బూచిగా చూపించి 1949లో అమెరికా తన కూటమిలోని దేశాలను నాటో సైనిక కూటమిగా నిర్మాణం చేసింది.

మరోవైపు మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలో ఏర్పడిన ఒకే ఒక్క సోషలిస్టు దేశమైన సోవియట్ యూనియన్ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మరో అగ్రరాజ్యంగా అవతరించింది. అమెరికాకు బలమైన ప్రత్యర్థిగా ఎదురు నిలిచింది. 1953లో స్టాలిన్ మరణం తరువాత, నాటోకు జవాబుగా 1955 మే నెల 14న వార్సా ఒప్పందం ద్వారా సైనిక కూటమిని సోవియట్ యూనియన్ ఏర్పాటు చేసింది.

20వ శతాబ్దం మధ్య నుండి ప్రపంచంపై ఆధిపత్యం కొరకు ఈ రెండు కూటముల మధ్య కోల్డ్‌వార్ పేరు మీద ప్రాంతీయ యుద్ధాలు సాగినాయి. సోషలిస్టు కూటమిని ఓడించడానికి, అణచి ఉంచడానికి అమెరికా ప్రపంచవ్యాప్తంగా మిత్ర దేశాలకు ఎన్నో రాయితీలు, కాంట్రాక్టులు ఇచ్చింది. ఎన్నో కార్యక్రమాలకు నిధులు సమకూర్చింది. సైనిక శిబిరాలను ఏర్పాటు చేసింది. ఇలా ఎంతో ఖర్చు చేసి, ప్రపంచ ఆధిపత్యం ద్వారా అంతకంటే ఎక్కువే లబ్ధి పొందింది.

కోల్డ్‌వార్ పేరుతో జరిగిన ప్రాంతీయ యుద్ధాలు 1990 దశకం నాటికి ప్రపంచం పరిస్థితిని మార్చివేశాయి. వార్సా సైనిక కూటమికి నాయకత్వం వహిస్తున్న సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై 15 దేశాలుగా విడిపోయింది. వార్సా కూటమికి చెందిన మిగతా దేశాలలోని సోకాల్డ్ సోషలిస్టు ప్రభుత్వాలు కూడా కూలిపోయాయి. చివరికి 1991లో వార్సా సైనిక కూటమి కూడా రద్దు అయింది.

ఈ కాలంలోనే నాటో రద్దు గురించి కూడా చర్చ వచ్చింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, వార్సా కూటమి రద్దు అయిన తరువాత కూడా నాటో సైనిక కూటమి అవసరం ఏమిటి అనే వాదనలు ముందుకు వచ్చాయి. కానీ అమెరికా, దాని నాటో మిత్రదేశాలు పిట్టకథలు చెబుతూ నాటోను రద్దు చేయకుండా కొనసాగించాయి. అంతే కాదు నాటోను రష్యా సరిహద్దుల వరకు విస్తరించాయి. ఇది నాటో, రష్యన్ ఫెడరేషన్‌లు కలిసి ఏర్పాటు చేసుకున్న, నాటో–రష్యన్ కౌన్సిల్ అవగాహనకు విరుద్ధం.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన 30 సంవత్సరాల తరువాత నేడు ప్రపంచం చాలా మారింది. గ్లోబలైజేషన్ పేరుతో సాగిన వ్యాపార యుద్ధాల వలన ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయి. 1990లో సోవియట్ యూనియన్ సూపర్ పవర్ స్థానాన్ని కోల్పోతే అమెరికా 2025 నాటికి సూపర్ పవర్ స్థానాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకుంది. అందుకే ట్రంప్ పదేపదే తిరిగి అమెరికాను గొప్ప దేశంగా చేయాలని అంటున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా వెన్నుదన్నుతో కోలుకున్న పశ్చిమ యూరప్, జపాన్ లాంటి దేశాలు అమెరికా నీడలో ఉంటూనే అమెరికా లాభాలు ఆదాయాలకు గండి కొట్టడం మొదలుపెట్టాయి.



**అన్నింటికంటే ప్రపంచం పైన చైనా ఆధిపత్యం పెరుగుతుండడం అమెరికాకు ప్రధాన సమస్య. అమెరికాకు పశ్చిమ యూరప్ దేశాలో ఇంకా వేరే దేశాలో మిత్ర దేశాలు కాదు. చైనాతో పోరాడగలిగే దేశాలు, చైనాను బలహీనపరచడానికి ఉపయోగపడే దేశాలు అమెరికాకు మిత్రదేశాలు. అందుకే అమెరికా రష్యాకు అనుకూలంగా వ్యవహరించడానికి ప్రయత్నిస్తున్నది. అయితే ఏ ఒక్క దేశమో కోరుకున్నట్లుగా ప్రపంచం నడవదు.**

1990లలో దెబ్బతిన్న రష్యా కూడా 2000 నుండి క్రమంగా కోలుకొని అమెరికాకు పోటీ ఇవ్వడం మొదలు పెట్టింది. చైనా 1980 తరువాత అమెరికాతో మైత్రిని నెరపుతూనే చాపకింద నీరులా ప్రపంచ మార్కెట్‌ను కబ్జా చేసింది. అమెరికాకు పోటీగా దాని మార్కెట్లను, ప్రాబల్య ప్రాంతాలను తన ఆధీనంలోకి తీసుకున్నది. చైనా బ్రిక్స్‌ను ఏర్పాటు చేసి అంతర్జాతీయ కరెన్సీగా ఉన్న డాలర్‌కే ఎసరు పెట్టింది. మూడు సంవత్సరాల నుండి సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధంలో నాటో విజయం అసంభవంగా మారింది. ఈ పరిణామాలన్నీ అమెరికాను ఆర్థికంగానూ రాజకీయంగానూ దెబ్బతీశాయి. ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా చేసిన యుద్ధాల వలన కూడా అమెరికా ఆర్థిక, రాజకీయ సమస్యలను ఎదుర్కొన్నది. ఆధిపత్యం కోసం అమెరికా చేస్తున్న ఖర్చులకు తగినంత ఆదాయం వెనక్కు రాకపోవడమే కాదు, ఆ ఖర్చులే భారంగా పరిణమించాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా కొత్త ఎత్తుగడలు పాత ప్రపంచాన్ని గందరగోళపరుస్తున్నాయి. యునైటెడ్ నేషన్స్ కార్యక్రమాలలో తన ఖర్చులను తగ్గించుకుంటున్నది. దేశంలో ఉద్యోగులను తగ్గించుకుంటున్నది. వలసదారులను రానివ్వడంలేదు. విదేశీ దిగుమతులపైన పన్నులు పెంచుతోంది. స్వేచ్ఛా మార్కెట్ ఛాంపియన్ అయిన అమెరికా రక్షణ సుంకాల వకాల్తాదారు అయ్యింది. చివరికి నాటో నుంచి కూడా బయటకు వెళ్తానని చెపుతున్నది.

ప్రపంచంపైన చైనా ఆధిపత్యం పెరుగుతుండడం ఇప్పుడు అన్నింటికంటే అమెరికాకు ప్రధాన సమస్య. ఉక్రెయిన్ యుద్ధం, రష్యా, ఇరాన్‌లు అమెరికాకు ప్రాధాన్యం లేని సమస్యలుగా మారిపోయాయి. పశ్చిమ యూరప్ దేశాలో ఇంకా వేరే దేశాలో అమెరికాకు మిత్రదేశాలు కాదు. చైనాతో పోరాడగలిగే, దానిని బలహీనపరచడానికి ఉపయోగపడే దేశాలే అమెరికాకు మిత్రదేశాలు. అందుకే అమెరికా రష్యాకు అనుకూలంగా వ్యవహరించడానికి ప్రయత్నిస్తున్నది.

అమెరికా కోరుకున్నట్లుగా రష్యా నడుస్తుందా, కష్టకాలంలో తనకు మద్దతుగా నిలబడిన చైనాను రష్యా మరిచిపోగలదా? అసలు సంక్షోభంలో ఉన్న అమెరికాపైన ఆధారపడాలని రష్యా అనుకుంటుందా? కొత్త మిత్రులు ఏమోగానీ ఉన్న మిత్రులను కూడా అమెరికా కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. ఏమైతేనేమి రాబోయే కొద్దికాలంలోనే ప్రపంచ రాజకీయ చిత్రపటంలో ఎవరు ఎటువైపు ఉన్నారో స్పష్టంగా దర్శనమివ్వవచ్చు.

■ లంకా పాపిరెడ్డి

## కొత్తరుచి

తొలగిన మంచుతెరల్లోంచి
మామిడాకుల గుబురుల్లో దాగిన
ఓ పాత కోకిల
మళ్లీ రాగాల్ని అందుకొంటోంది
రాగం పాతదే
గొంతు కొత్తగా వినబడుతోంది

వగరు చేదుల ఆరు రుచుల సమ్మేళనం
కొన్నేళ్లపాటు
గొంతులో గరళమై దిగుతుంటే
అలసిపోయిన కోయిల
ఇప్పుడు చైత్రాన్ని కొత్త చిగుళ్ల
తోరణాలతో స్వాగతిస్తోంది

ఒక్కో ఇంటి తలుపును
తడుతున్న వసంతం
రేపటి భరోసాను పంచిపెడుతోంది
బహుశా ఈ ఉగాది కొత్త రుచిని
పందారం చేస్తున్నట్లుంది
అడవులైన పొలాలు
కాలువలై పారుతున్న నీళ్లు
సరికొత్త దృశ్యాలుగా
ఆవిష్కారమవుతున్నాయి
ఈ ఉగాది మాట తప్పని
చేతల్ని వాగ్దానం చేస్తోంది

— బండ్ల మాధవరావు

## దాని పేరు విశ్వావసు

ఉదయం ఏదో ఫోన్ రింగ్ అవుతుంది
బంధువుకి ఒంట్లో బాగాలేదని సారాంశం
హాస్పిటల్‌కి వెళ్లేసరికి అశ్రునివాళి
వాట్సాప్‌లో దూరపు చుట్టాల పెళ్లి సందడికి
తప్పక రమ్మని ఒక షార్ట్ వీడియో
అన్న కొడుకు విదేశాల్లో పైచదువులకు
ఏర్‌పోర్ట్‌లో ఫ్యామిలీ సెండ్‌ఆఫ్ ఫోటోలు

సైకిల్ మీద కాలేజీకి కలిసి వచ్చిన శీనుగాడు
ఇంటికొచ్చి కూతురికి మద్రాస్ ఐఐటీలో సీటు
వచ్చిందని సంబరపడ్డాడు
ముందే తెలుసుకున్నాడో ఏమో
పట్టుబట్టి ఇంటికి తీసుకెళ్లి
నా కష్టం కాస్తయినా తుడవాలని నవ్వులతో
హత్తుకున్నాడు

అంతే కదా జీవితం– నాలుగు నవ్వులు
మూడు ఏడుపులు ఒక దిగులు
అర మోతాదులో కోపం
మరో అర మోతాదు భయం
చిటికెడు ఉల్లాసం చిటికెడు ఉత్సాహం
అచ్చం ఉగాదిలా
అయితే ఈసారికి దాని పేరు విశ్వావసు!

— బంగార్రాజు కంఠ


## ప్రజాస్వామ్య ఉగాది

ఆకుపచ్చని కళన్ అలరారు ప్రతి చెట్టు
క్రమ భారత పతాకగ వెలుంగ
అనఘ పంచాంగంబె అతిగౌరవార్హమౌ
స్తవ్య రాజ్యాంగ గ్రంథంబె కాగ
చిత్రముల్ ఋతువుల శిష్ట క్రమములెల్ల
ఘనపాలనా విభాగాలు కాగ
వికసిత భారత ప్రకట సంస్కృత సభల్
కేంద్ర శాసనసభా కేళి కాగ
అళి పిక శుకమనోహర రూప చేష్టలే
సరస పౌరాళి సంబరము కాగ

'విశ్వ'మున కెల్ల 'వసువౌ'చు శాశ్వతముగ
భవ్యదివ్యంబు దారిదీపంబెయ్యైన
ప్రతి ఉగాది ప్రజాస్వామ్య ప్రభుతగాదె!
సారపర్వయశశ్రీకి స్వాగతంబు

— రామడుగు వేంకటేశ్వరశర్మ





## పర్వగీతం

ఆమని రాసే కమ్మని కవిత
అనంత కాలపు వసంత వేడుక

మామిడికాయల
మేలిమి మెటఫర్

వేపపూలను శృతి చేసే
తేనెపలుకుల పాట

స్సుర్రుమనే నాలుకపై
నడిచేసే పచ్చడి కారం

కొత్తికుండ బెల్లం ముక్కల్లో
తీయతీయగా పలికే ప్రాస

కోయిల పాటల కొసమెరుపుల్లో
కొత్త చింతపండు కొసరు వలపు

చిటికెడు ఉప్పు ఉతరేకించే
రుచి వ్యాకరణపు జిహ్వాభాష

చిగురుటాశల అమరకోశం
ఆరు రుచుల ఆమ్రేడితం

ఉగాది.. ఏరువాకల భారతం
మన తెలుగువారి పర్వగీతం!

–కంచరాన భుజంగరావు

## రెండు పండుగలు

రెండు మతాలు
రెండు నేత్రాలై
మానవత్వానికి
'చూపు'నిస్తున్నాయి..!
రెండు పండుగలు
గుండె స్పందనలై
ఏకత్వానికి
'బ్రతుకు'నిస్తున్నాయి..!


మామిడి తోరణాలు
అత్తరు పరిమళాల మధ్య
షీర్ ఖుర్మా పాయసాలు
షడ్రుచుల భావనలు
ఆవిష్కృతమవుతున్నాయి..!

ఖర్జూర పండ్లు
కోయిల రాగాల మధ్య
పంచాంగ శ్రవణాలు
నమాజులు
మన విశ్వాసపు
గీతాలై వినిపిస్తున్నాయి..!

ఉపవాసాలు
ఉగాది పచ్చడిల మధ్య
మత సామరస్యపు ప్రతిబింబాలు
కవుల కవితా గానాలు
మనదేశ ఆదర్శాలై నడుస్తున్నాయి..!

మనలోని ఐక్యత
మనందరి సమగ్రత
మేరా భారత్ మహాన్ అంటూ
నింగిలోని మేఘాల మధ్య
పిడుగుల గర్జనగా
మన దేశం ప్రతిధ్వనిస్తుంది..!

– ఫిజిక్స్ అరుణ్‌కుమార్



## ఉగాది తల్లీ వందనం!

మామిడి కొమ్మ మీద
కలమంత్ర పరాయణుడైన
కోకిల స్వామి నీకు వందనమ్ము
విశ్వసుందర పరమ పవిత్రమూర్తియైన
విశ్వావసు నామ వత్సరంబునకు
ఎదురువోయి స్వాగతంబిమ్ము
గీతికా ప్రసవమొసగి!

అరవదేడుల కాలచక్రభ్రమణమున
మరల వచ్చెను విశ్వావసు నవోదయమై
తెలుగు ప్రజలకు పర్వదినమై
షడ్రసోపేత రుచులను పంచగ
వచ్చెనమ్మా! నవ ఉగాది విశ్వావసువై!
తెచ్చునేమో ప్రజల జీవితమున క్రొత్త మార్పులు!
వచ్చునేమో! అభ్యుదయ పరంపరలు!

జాతి జనుల జీవితమ్మున
స్నేహ వాత్సల్య ప్రేమ మధురిమలు
వెల్లివిరియగ వచ్చెనమ్మా! నవ ఉగాది!
తెచ్చెనమ్మా క్రొత్త శోభలు! నవ ఉగాది!
ఆయురారోగ్య సంభరితమై
హృదయములానంద భరితము కాగ
అక్షరాక్షతల తోడ దీవించును గాక! విశ్వావసు!
వందనమమ్మా వందనమ్ము ఉగాది తల్లీ!
విశ్వావసుకు వందనమ్ము!

— ఆచార్య కె. యాదగిరి

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:35 (ఆదివారం సాయంత్రం)



# నేటి నుంచి వసంత నవరాత్రోత్సవాలు


భద్రకాళి అమ్మవారు

- ఏప్రిల్ 6వ తేదీ వరకు వేడుకలు
- భద్రకాళి అమ్మవారికి ప్రతీ రోజు లక్ష పుష్పార్చన
- నేడు ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం

వరంగల్ కల్చరల్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ఓరుగల్లు నగరంలో కొలువుదీరి ఉన్న భక్తుల ఆరాధ్యదేవత భద్రకాళి అమ్మవారికి ఆది వారం నుంచి వసంత నవరాత్రోత్సవాలను నిర్వ హిస్తున్నట్లు ఆలయ ఈవో శేష భారతి తెలిపా రు. ఆదివారం ఉదయం 4 గంటలకు ప్రారంభ మయ్యే వసంత రుతువు నవరా త్రోత్సవాల సంద ర్భంగా అమ్మవారికి పూర్ణాభిషేకంతో ఉత్సవం ప్రారంభమవుతుంది. చైత్ర శుద్ధ పాడ్యమి నాటికి బ్రహ్మ తన సృష్టిని పూర్తి చేశారని, ఆ రోజున బ్రహ్మను పూజిస్తే సంవత్సరం మొత్తం శుభప్రదంగా ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి. బ్రహ్మ కు ప్రత్యేక దేవాలయాలు లేకపోవడం జగన్మాత అయిన భద్రకాళిదేవియే బ్రహ్మ స్వరూపమణి శాస్త్రాలు చెబుతున్నట్లు ఈవో తెలిపారు. ఉద యం, సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు, మంగళ హారతులు, భోగంలు ప్రతీ రోజు రాత్రి 8 గంటలకు ప్రత్యేక హారతి నిర్వహించబడునని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు లక్ష పుష్పార్చన జరుపబడునని, ఈ సేవలో పాల్గొన డానికి భక్తులు దేవాలయ కార్యాలయంలో సంప్ర దించాలని అన్నారు. ఉగాది సందర్భంగా అమ్మ వారి దేవాలయంలో ఉగాది వేడుకలు నిర్వహి స్తామని, సాయం త్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ ఐనవోలు రాధాకృష్ణ శర్మచే పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించ బడునని భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కాగలరని అన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్




- ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్‌లో ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మంత్రి సురేఖ


ఇఫ్తార్ విందులో మంత్రి సురేఖకి ఖర్జూర తినిపిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్‌టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి, ఆత్మీయతకి ప్రతీక రంజాన్ పండుగ అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ 21వ డివిజన్ ఎల్‌బీ నగర్‌లోని ఏవన్ ఫంక్షన్ హాల్లో రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన దావత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులు హాజరై కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా, ఇతర ముస్లిం మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపచేసిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా పలు రంగాల్లో ప్రతిభ చాటిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆమె తెలిపారు. ముస్లింలకు రంజాన్ పండుగ ఎంతో పవిత్రమైందని, నెలపాటు ఉపవాస దీక్షలు చేయడం చెప్పుకోదగ్గ విషయమని ఆమె తెలిపారు. అనంతరం మంత్రి కొండా సురేఖ ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫుర్ఖాన్, కావటి కవిత, సునీల్ జోషి, పోశాల పద్మ, మరిపల్ల రవి, చింతాకుల అనిల్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, 19వ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, డీపీఆర్‌వో ఆయూబ్ అలీ, ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.





మండిబజార్‌కు రంజాన్ షాపింగ్‌కు వచ్చిన జనం

# పండుగల వేళ.. మార్కెట్ కళకళ

ఓ వైపు తెలుగు సంవత్సరాది ఉగాది.. మరోవైపు ముస్లింల పరమ పవిత్ర రంజాన్ పర్వదినాలు వరసగా రావడంతో మార్కెట్‌లో పండుగల కళ కనిపిస్తోంది. ఆదివారం ఉగాది పండుగ కావడంతో హిందువులు అందుకు అవసరమైన పూలు, ఫలాలు, మామిడికాయలు, కొత్త చింతపండు, బెల్లం తదితర వస్తువులతో పాటు కొత్త కుండలను కొనుగోలు చేయడంతో శనివారం నగరంలోని పలు ప్రాంతాలు సందడిగా మారాయి. ఇక సోమవారం రంజాన్ పండుగ కావడంతో తమ పండుగకు అవసరమైన వస్తువులతో పాటు దుస్తులు, అత్తర్లు తదితర సామగ్రి కొనుగోలులో ముస్లింలు బిజీగా మారారు. ఈ క్రమంలో వరంగల్ మండిబజార్‌లోని చిన్నా పెద్దా దుకాణాలు రద్దీగా కనిపించాయి.

ఫోటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



మార్కెట్‌లో ఉగాది పండుగ, పూజా సామగ్రి

# 3 నదులు పుష్కరాలు రాష్ట్రాలు

**త్రిలింగాలలో ఒకటి కాళేశ్వరాలయం**
**సరస్వతి పుష్కరాలకు సిద్ధమవుతున్న పనులు**

మహదేవపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర గోదావరితో పాటు రెండు ఉపనదులు కలిసి ఉన్న క్షేత్రం కాళేశ్వరం. తెలుగు రాష్ట్రాల్లోని త్రిలింగ క్షేత్రాలలో అత్యంత పవిత్రమైంది కాళేశ్వర ముక్తీశ్వర దేవాలయం. దక్షిణ భారతదేశంలో గొప్ప క్షేత్రంగా విలసిల్లుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల దండకారణ్యంలో త్రేతాయుగంలో వెలిసిన దివ్యక్షేత్రం కాళేశ్వరం. దేశంలో 12 నదులకు 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కరాలు వస్తుంటాయి. మేష గంగా రుశేరేవా అన్నట్టు మేషంలో బృహస్పతి చేరినప్పుడు గంగానదికి.. వృషభంలో బృహస్పతి చరించినప్పుడు నర్మదా నదికి.. మిధునంలో బృహస్పతి ప్రవేశించినప్పుడు సరస్వతి నదికి పుష్కరాలు వస్తాయి. మీన రాశిలో దేవ గురువు సంచరించినప్పుడు ప్రాణహిత పుష్కరాలు వస్తుంటాయి. అయితే కాళేశ్వరం విశేషమేమిటంటే ఇక్కడ ఒక చోటనే గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులకు రెండేళ్ల తేడాతో పుష్కరాలు వస్తుంటాయి. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు దండకారణ్యంలో నివసించినప్పుడు కాళేశ్వరం వచ్చి ముక్తీశ్వరుడిని పూజించి లంకకు వెళ్లినట్టుగా పురాణంలో ఏకాదశి అధ్యాయంలో రాసిఉన్నట్టు చెబుతారు.

### త్రిలింగ దేశంగా..

శ్రీశైలం, ద్రాక్షారామం, కాళేశ్వరం మూడు క్షేత్రాల మధ్యన ఉన్న ప్రాంతం త్రిలింగ దేశంగా వర్ధిల్లిందని, త్రిలింగ త్రిలంగమే తెలుగుగా తెలుగుగా మారిందని చెబుతారు. ఇక్కడ వ్యాసుడు ప్రతిష్ఠించిన సరస్వతీ దేవి విగ్రహం పురాతనమైంది.

కశ్మీర్‌లోని బాలసరస్వతి, బాసరలో ధ్యాన సరస్వతి, కాళేశ్వరంలో మహా సరస్వతి దేవాలయాలు వ్యాసుడు ప్రతిష్ఠించినవిగా పేరొందాయి. శృంగేరి శంకరాచార్యులు తరతరాల నుంచి కాళేశ్వరం రావడం, కాళేశ్వర ముక్తీశ్వరుడిని మహా సరస్వతిని దర్శించడం ఆనవాయితీగా వస్తోంది. కాళేశ్వరం చుట్టూ 200కిలోమీటర్ల పరిధిలో ఉన్న దేవాలయాలన్నీ కాళేశ్వర కాండంలో ఉన్న దేవాలయాలు. కాశీకి స్కంద పురణాంలో ఎంత చరిత్ర ఉందో కాళేశ్వరానికి అంతకన్నా గొప్పగా చరిత్ర పౌరాణిక ఇతిహాస కథలున్నాయి. ప్రయాగలో గంగా యమున, సరస్వతి, త్రివేణి సంగమంలో స్నానం చేస్తే ఎంత ఫలం వస్తుందో అంతకన్నా గోదావరి, ప్రాణహిత, సరస్వతి త్రివేణి సంగమంలో స్నానం చేస్తే 1000 కోట్ల ఫలం దక్కుతుందని స్కంధ పురాణంలో వివరించారని పండితులు చెబుతున్నారు.



సరస్వతి అమ్మవారు

### 1976 నుంచి..

ఎన్నో రాజవంశాలు దాటిపోయిన కాలంలో పునరుద్ధరణకు నోచుకోకుండా ఉన్న కాళేశ్వర క్షేత్రం 1976 వరకు దట్టమైన అరణ్య ప్రాంతంలో దారి తెన్ను లేకుండా ఓ మూలన ఉండేది. అడవిలో కాలినడకన భక్తులు తరలివచ్చి స్వామివారిని



కాళేశ్వరం వద్ద గోదావరి నది

దర్శించుకునేవారు. ఆదిలాబాద్ చెన్నూరు ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రాంతం, ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ ప్రాంతం నుంచి కాలినడకన భక్తులు మూడు నాలుగు రోజుల ప్రయాణం చేసి వచ్చి పూజలు చేసేవారు. అలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ శాఖ, దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న జువ్వాడి చొక్కారావును శృంగేరి పీఠాధిపతి కాళేశ్వర క్షేత్రాన్ని జీర్ణోద్ధారణ చేయాలని కోరారు. ఆయన ఆదేశాల మేరకు చొక్కారావు కాళేశ్వరం వచ్చి వెంటనే జీర్ణోద్ధరణ పనులు మొదలు పెట్టారు. కొత్తగా ఊరికి బస్సులు వేయించి ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ప్రతిరోజు జరిగే విధంగా చేశారు. 1976లో డిసెంబర్ 15న విజయ గణపతి ఆలయ ప్రతిష్ఠ జరిపించారు శంకారాచార్యులు. ఆ తర్వాత జీర్ణోద్ధారణ పనులు 1982 వరకు పూర్తి చేశారు. 1982 ఫిబ్రవరి 9వ తేదీన శంకరాచార్యుల నేతృత్వంలో మహాకుంభాభిషేకం , రాజగోపుర కళశ స్థాపన ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటి నుంచి 1990 వరకు బస్సులు నడుస్తుండగా.. ప్రస్తుతం మూడు రాష్ట్రాలను కలుపుతూ జాతీయ రహదారులు ఏర్పాడ్డాయి.

### పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు

40ఏళ్ల తర్వాత ఈ సంవత్సరం మహా కుంభాభిషేకం జరి గింది. రెండేళ్ల క్రితం ప్రాణహిత పుష్కరాలు మీన రాశిలో గురు వు ప్రవేశించినప్పుడు జరిగాయి. ఈ ఏడాది మే 15 నుంచి 26 వరకు సరస్వతి నది పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. దేవ గురువు బృహస్పతి మిధున రాశిలో ప్రవేశించినప్పుడు ఈ పుష్కరాలు జరుగుతాయి. రాబోయే సరస్వతి పుష్కరాలకు నాలుగైదు రాష్ట్రా నుంచి లక్షలాది మంది భక్తులు తరలిస్తారని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని సరస్వతి నదీ పుష్కరాల కోసం రూ.25కోట్లు ఖర్చు చేస్తోంది. రాష్ట్ర ఐటీ శాఖ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆయన సతీమ ణి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ కూడా ప్రత్యేక నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నారు.

**సరస్వతీ పుష్కరాలు జరగడం ఎంతో మేలు**
మాడుగుల భాస్కర్ శర్మ, ఆధ్యాత్మికవేత్త

కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు నిర్వహించడం మహా విశేషం. ఇప్పటికీ ఐదు సరస్వతి పుష్కరాలు చూశా. నాడు రవాణా సౌకర్యాలు లేక తక్కువ సంఖ్యలో భక్తులు వచ్చేవారు. ఇప్పుడు మూడు రాష్ట్రాల భక్తులు వస్తున్నారు. పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# సరదా.. కావొద్దు విషాదం

- ఆనందం మాటున పొంచి ఉన్న ప్రమాదాలు
- ఒంటిపూట బడులు, సెలవుల్లో పిల్లలు జాగ్రత్త
- ఆటల సమయంలో ఓ కంట కనిపెట్టాలి
- చెరువులు, బావులు, నీటి కుంటల వైపు ఒంటరిగా వెళ్లనీయొద్దు

ఖానాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఒంటి పూట బడులు.. మరికొద్ది రోజుల్లో వేసవి సెలవులు. ఇక చెప్పేదేముంది. సెలవులంటే చిన్నారులకు చెప్పలేని ఆనందం. ఎక్కువ సమయం ఆడుకోవచ్చు.... సరదాగా స్నేహితులతో గడపొచ్చని చూస్తుంటారు. కానీ ఆ సరదాల మాటున ప్రమాదాలు పొంచి ఉన్నాయన్న విషయాన్ని గుర్తించే స్థితిలో ఉండరు. అందుకే అభం శుభం తెలియని పిల్లలను తల్లిదండ్రులు, కుటుంబీకులే ఓకంట కనిపెట్టుకోవాలి. ఆనంద సమయాల్లో ఎన్నో అనర్థాలు పొంచి ఉంటాయన్న విషయాన్ని గ్రహించి.. పిల్లలకు వివరించే ప్రయత్నం చేయాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాల బారిన పడతారని వారికి చెప్పాలి. అంతే కాదు ఎండల తీవ్రత నేపథ్యంలో వారి ఆరోగ్యం విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల కాలంలో సరదాగా ఈతకు వెళ్లి చిన్నారులు మృత్యువాతపడుతున్న సంఘటనలు.. కన్నవారి కన్నీటి రోదనలు చూస్తూనే ఉన్నాం.

### ఏ శిక్షణ అయినా పెద్దల సమక్షంలోనే..

ఒంటిపూట బడులు, వేసవి సెలవుల్లో పిల్లలు ఈతపై సరదా చూపుతూ ప్రమాదాలకు గురవుతుంటారు. వీలైనంతవరకు పిల్లల్ని చెరువులు, బావుల వద్దకు ఒంటరిగా పంపకూడదు. ఈత నేర్వాలనుకుంటే తల్లిదండ్రులే తీసుకెళ్లి కొంత సమయం వరకు ఈత నేర్పడం ఉత్తమం. ఇప్పటికీ కొన్ని చెరువులు బావులు నిండుగా ఉన్నాయి. దీంతో వాటి లోతు తెలయక పిల్లలు చెరువులు, కాలువల్లో దిగి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇక ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై పిల్లలకు మోజు ఎక్కువ. ఇంట్లో చెప్పిన వినకుండా వాటిని నడుపుతూ రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో చిన్నారులను మోటరు సైకిళ్ల, సైకిళ్లకు దూరంగా ఉంచాలి. బైక్‌ల తాళాలు వారికి అందుబాటులో ఉంచకూడదు. అవసరమైతే పెద్దల సమక్షంలో వాహనాలను నడపడం నేర్పించాలి. అలాగే పిల్లలను ఎక్కువ సమయం తిరగనిస్తే పరీక్షల సమయంలో అనారోగ్యానికి గురవుతారు. అందుకే బయట ఎక్కువ సేపు ఆడుకోనివ్వకూడదు.

### టీవీ, సెల్‌ఫోన్లతో అనర్థాలే..

ఇంట్లో తరుచూ కంప్యూటర్, వీడియో గెమ్స్‌లు, మొబైల్ గేమ్స్‌లు, టీవీలకు అతుక్కుపోతే దృష్టి లోపం తలెత్తే అవకాశముందని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధ్యమైనంతవరకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి.

### ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఎండ తీవ్రత కారణంగా చిన్నారులు త్వరగా నీరసించి పోతుంటారు. పాఠశాలకు వెళ్లే సమయంలో తేలికపాటి ఆహారం, త్వరగా జీర్ణమయ్యే అల్పాహారంతోపాటు పండ్ల రసాలు అందజేయాలి. భోజనంలో కూరలు, ఆకు కూరలు ఉండేవిధంగా చూడాలి. మాంసాహారం, వేపుళ్లకు దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి. రాత్రి వేళ త్వరగా పడుకునే విధంగా చూడాలి. ఉదయాన్నే త్వరగా నిద్ర లేచి పాఠశాలకు బయలుదేరి వెళ్లే అవకాశం ఉంటుంది. ఎండలకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండేలా చూసుకోవాలి.



బడి నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

### ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- బడి వదలగానే మధ్యాహ్నం వేళ పిల్లలను అవసరమైతే తప్ప బయటకు పంపించడం మంచిది కాదు. పిల్లలు వీలైనంతవరకు విశ్రాంతి తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- తల్లిదండ్రులు పిల్లలతో అధిక సమయం కేటాయించి, వారితో సరదాగా గడపాలి. ఖాళీ సమయంలో విజ్ఞాన, వినోద సంబంధమైన పుస్తకాలు చదివించాలి.
- పిల్లలు ఇంటి నుంచి బయటకు ఎటువైపు వెళ్లినా తప్పకుండా సమాచారం ఇచ్చి వెళ్లేలా వారికి అవగాహన కల్పించి, జాగ్రత్తలు తీసుకోవాలి.
- చిన్నారులు ఇంట్లో మారం చేస్తే వారికి సర్దిచెప్పాలే తప్ప కోపతాపాలకు పోయి, కొట్టడం, కోపంతో బెదిరించడం చేయకూడదు. వారిని సన్మార్గంలో పెట్టాలి.
- ఇంటి పనుల్లో సాయం చేసే అలవాటును నేర్పాలి.

**తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి**
మల్యాల అరుణ్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ-ఖానాపురం

వేసవిలో సాధ్యమైనంతవరకు పిల్లలను మధ్యాహ్నం పూట ఎండలోకి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. ఎండలో ఆటలు ఆడటం వలన చిన్నారులు వెంటనే డీ హైడ్రేషన్‌కు గురవుతారు. వడదెబ్బ తగలకుండా బయటకు వెళ్లే సమయంలో ఎక్కువ నీరు తాగాలి. శీతల పానియాల బదులు కొబ్బరిబొం డాం, పండ్ల రసాలు తీసుకోవాలి. వ డదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ తాగించాలి. దగ్గలో ఉన్న


# కేయూ గ్రంథాలయం.. చదువుల దేవాలయం..

**ఇక్కడ కష్టపడి చదివితే ఉద్యోగాలు గ్యారంటీ**
**సెంటిమెంట్‌గా భావిస్తున్న యువత**
**ఉచిత వైఫై సహా మెరుగైన సౌకర్యాల కల్పన**
**వర్సిటీ లైబ్రరీ పట్ల దేశవిదేశాల స్కాలర్ల ఆసక్తి**

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని మన దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కీర్తించారు. అంతేకాదు మన పెద్దలు నాడే గ్రంథాలయాల గొప్పతనాన్ని గుర్తించారు. ఒక మంచి పుస్తకం వంద మంది మంచి స్నేహితులతో సమానమని చెప్పడమే కాదు.. అలాంటి మంచి పుస్తకాలు అందుబాటులో ఉండే దేవాలయాలుగా గ్రంథాలయాలను రూపుదిద్దారు. అలాంటి ఎన్నో గ్రంథాలయాల్లో కాకతీయ యూనివర్సిటీ గ్రంథాలయం ఒకటి. నిరుద్యోగ యువత దేవాలయంగా భావించే కేయూ వర్సిటీ ప్రధాన గ్రంథాలయంలోని అహ్లాదకరమైన వాతావరణంలో చదివితే మంచి ఉద్యోగం సాధించడం ఖాయమని వారి నమ్మకం. ఈక్రమంలోనే వేలాది మంది మంచి స్థాయిల్లో స్థిరపడ్డారు. సివిల్ సర్వీసుతో పాటు ఇంజనీర్లుగా, గ్రూప్స్ స్థాయి అధికారులుగా, పోలీసులుగా, టీచర్లుగా ఇలా అనేక మంది పెద్దపెద్ద ఉద్యోగాలు సంపాదించారు. ఇక్కడ చదువుతో పాటు విజ్ఞానాన్ని సంపాదించుకుని తామంతా అత్యుత్తమ జీవితాన్ని పొందామని ఇక్కడి పూర్వ విద్యార్థులు తమ జూనియర్లతో అనుభవాలను, వర్సిటీ జ్ఞాపకాలను పంచుకుంటారు. కొందరు తమకు ఈ ఉజ్వల జీవితాన్ని ప్రసాదించిన లైబ్రరీకి పుస్తకాలు, కంప్యూటర్లు, ఫర్నిచర్ సహా అనేక విలువైన వస్తువులను బహూకరించి తమ ప్రేమను చాటుకుంటారు. అయితే ఒక్క ఏడాదిలోనే సుమారు 200 మంది ఉద్యోగాలు సాధించినట్లు వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

### లక్షా 45 వేల పుస్తకాలు..

కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు లక్ష45వేల పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి. 300 మంది ఒకే సారి ప్రశాంతంగా కూర్చుని చదువుకునేందుకు సువిశాలమైన గదులు, ఫర్నిచర్, స్టడీ ప్యాడ్లు, ఫ్యాన్లు, ఇతర సామగ్రిని సమాకుర్చారు. సెలవు రోజులు మినహా ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిత్యం లైబ్రరీ తెరిచి ఉంటుంది. తెలుగు, ఇంగ్లిష్, హిందీ దినపత్రికలను తెప్పిస్తారు. ఇక వర్సిటీ లైబ్రరీలో ఇంజనీరింగ్, లైఫ్‌సైన్స్, ఆర్ట్స్, సోషల్ సైన్స్‌తో పాటు ఫార్మసీ, లా, జనరల్ పుస్తకాల అధ్యయనం కోసం ప్రత్యేక విభాగాలను, గదులను ఏర్పాటు చేశారు. ఏ విభాగానికి చెందిన విద్యార్థులు ఆ విభాగాల్లోనే చదువుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇక నూతన ఆవిష్కరణలు. సామాజిక అధ్యయనాలతో పాటు ఫార్మసీ, ఇంజనీరింగ్, న్యాయశాస్త్రం, ఎడ్యుకేషన్, కామర్స్, సైన్స్, ఆర్ట్స్‌తో పాటు ఇతర విభాగాలల్లో నిరంతరం వస్తున్న మార్పులను క్రమబద్ధంగా పరిశోధనలు సాగించేలా స్కాలర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్సిటీలో ఇప్పటి వరకు జరిగిన పరిశోధకుల థిసెస్‌ను క్రమపద్ధతిలో పొందుపరిచారు. ఎవ్వరికీ ఎప్పుడూ ఏ థిసెస్ కావాలంటే అప్పుడూ రెప్పపాటులో అందించేందుకు సిద్ధం చేశారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

### దేశ విదేశాల పరిశోధకుల సందర్శన

కేయూ లైబ్రరీని దేశ విదేశాలకు చెందిన పరిశోధకులు సందర్శిస్తారు. అనేక రోజుల పాటు తమ థిసెస్‌ల రూపకల్పనలో భాగంగాఅరుదైన పుస్తకాలను సేకరిస్తారు. తమకు అవసరమైన అంశాలను నోట్ చేసుకుంటారు. కేరళ రాష్ట్రంలోని మాళప్పురం మాళయాళం వర్సిటీ క్రియేటీవ్ రైటింగ్ విభాగానికి చెందిన స్కాలర్ మెలివియా అన్ బిజూ కొంత కాలంగా వర్సిటీ ప్రధాన గ్రంథాలయంలో చదువుతోంది. అక్కడి వర్సిటీ అధికారులు కేయూ లైబ్రరీలోకి అనుమతించాలని వర్సిటీ లైబ్రరీ అధికారులకు లేఖ రాశారు. అలాగే ఇతర దేశాలకు చెందిన స్కాలర్లు, విద్యార్థులు వర్సిటీకి రెగ్యులర్ వచ్చి తమకు అవసరమైన గ్రంథాలను ఉపయోగించుకుంటారని వర్సిటీ లైబ్రరీ అధికారులు చెబుతారు.

### పోటీ పరీక్షలకు ప్రత్యేక పుస్తకాల కొనుగోలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల ప్రకటనల నేపథ్యంలో విద్యార్థులకు అయా పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌తో రూపొందించిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. విద్యార్థుల డిమాండ్లకు అనుకూలంగా ఎంత ఖర్చుకైనా వెనుకాడకుండా సమగ్రమైన పుస్తకాలను కొనుగోలు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే జర్నల్స్ తెప్పిస్తున్నారు. బడ్జెట్‌లో అధిక నిధులను ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు లైబ్రరీ అధికారులు చెబుతున్నారు.

### కంప్యూటర్ ల్యాబ్, వైఫై సౌకర్యం..

వర్సిటీ క్యాంపస్‌లోని ప్రధాన లైబ్రరీలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రత్యేకంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. కంప్యూటర్ ద్వారా విద్యనభ్యసించేందుకు నెట్ సౌకర్యాన్ని కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం చోటు చేసుకుంటున్న మార్పులను ఆవలోకనం చేసుకునేందుకు ఈ లైబ్రరీ తోడ్పడుతోంది. 10 కంప్యూర్లను ఏర్పాటు చేసి నెట్ కనెన్షన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎన్ఆర్ఐ దాతల సహాయంతో ఉచితంగా కంప్యూటర్లను అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు పొందిన వారు చేయూతనందిస్తున్నారు. విలువైన పుస్తకాలను సమాకురుస్తున్నారు. ఇటీవల ఓ రిటైర్డు తహసీల్దార్, ఓ యువ ఇంజనీర్ వర్సిటీకి పుస్తకాలతో పాటు ఏసీలను బహూకరించారు. వర్సిటీ పరిధిలో నిరంతరం వైఫై సేవలను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థుల తమ ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లతో ఇంటర్నెట్‌ను స్పీడ్‌గా ఉపయోగించుకునేందుకు వైఫై సౌకర్యాన్ని కల్పించారు.

**24 గంటల డిజిటల్ లైబ్రరీ**

వర్సిటీ ప్రధాన లైబ్రరీకి అనుబంధంగా వర్సిటీలో డిజిటల్ లైబ్రరీని నిర్మించారు. వారంలో 24 గంటల పాటు ఎల్లప్పుడు తెరిచి ఉంచుతారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు అక్కడే పడుకుని లేచి మళ్లీ చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. అలాగే డిజిటల్ లైబ్రరీ చుట్టూ ఆహ్లాదకరంగా ఉండేలా ప్రత్యేక మొక్కలను పెంచారు. ప్రధాన లైబ్రరీని అనుకుని ఉండే డిజిటల్ లైబ్రరీని మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలను రూపొందించారు. వర్సిటీ లైబ్రరీ చుట్టూ చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా ప్రతీ శనివారం క్లీన్ అండ్ గ్రీన్ ప్రొగ్రాం చేపడుతారు. ఎప్పటికప్పుడు లైబ్రరీని సుందరంగా తీర్చిదిద్దుతారు. విద్యార్థులు చదువుకునేందుకు ప్రశాంత వాతావరణాన్ని ఏర్పాటు చేశారు.

### మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

వర్సిటీలో విద్యార్థులు చదువుకునేందుకు ఉన్నతాధికారుల తోడ్పాటుతో లైబ్రరీ అధికారులు మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తున్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందించేందుకు ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు కూలర్‌తో ఎల్లప్పుడూ చల్లనితాగునీరును అందుబాటులో ఉంచారు. అలాగే విద్యార్థులు, అభ్యర్థుల సంఖ్యకు తగినట్టుగా మరుగుదొడ్లు నిర్మించారు. ప్రతీ ఏడాది నవంబరు 14 నుంచి 20 వరకు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాల్లో ఈ లైబ్రరీ గొప్పతనాన్ని తెలియజేసేలా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. పలు పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేస్తారు.




కేయూ క్యాంపస్ గ్రంథాలయం




కేయూ లైబ్రరీ ఉద్యోగులు

### ఉద్యోగాలు పొందిన వారి వివరాల సేకరణ

వర్సిటీ లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమై విజయం సాధించిన వారు తమ సంతోషాలను లైబ్రరీ సిబ్బందితో పంచుకుంటారు. అలాగే తమ వివరాలను వర్సిటీ లైబ్రరీలో ఏర్పాటు చేసిన పుస్తకంలో పొందుపరుస్తారు. తాము పొందిన ఉద్యోగం వివరాలను రాస్తారు. భవిష్యత్‌లో ఎవరైనా తమను సంప్రదిస్తే ఆయా ఉద్యోగాలకు ఎలా సిద్ధమవ్వాలో సూచనలు చేస్తారు. తమ అనుభవాలను జూనియర్లకు చెబుతూ వారిని ఉద్యోగ సాధనవైపు నడిపిస్తారు. 2024 జనవరి నుంచి డిసెంబరు 31 వరకు 12 నెలల్లో 52,459మంది వర్సిటీ ప్రధాన లైబ్రరీకి వచ్చారని విజిటర్స్ పుస్తకం చెబుతోందంటే వర్సిటీ లైబ్రరీకి ఎంతటి క్రేజ్ తెలుస్తోంది.

**విద్యార్థులకు అందుబాటులో ఉంటాం..**
పి.ఇసాక్ ప్రభాకర్, లైబ్రరీ ఇన్‌చార్జ్ కేయూ వరంగల్



కేయూ గ్రంథాలయంలో చదువుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులకు ఎల్లప్పుడూ సిబ్బంది అందుబాటులో ఉంటారు. విజ్ఞానం, ఉద్యోగం కోసం వచ్చేవారికి స్వాగతం. తాగునీరు, ఫ్యాన్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాం. భవిష్యత్‌లో వర్సిటీ లైబ్రరీకి మరింత పేరు వస్తుంది. ఇక్కడ చదివి ఉద్యోగాలు సాధించిన వారు.. ఈ లైబ్రరీ అభివృద్ధికి ముందుకు రావడం ఆనందంగా ఉంది. వర్సిటీ ఉన్నతాధికారుల సహకారంతో లైబ్రరీలో అధునాతన వసతులు కల్పిస్తాం.

## సర్వర్ డౌన్..

- మీ సేవా కేంద్రాల్లో సర్వర్ సమస్య
- ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం
- తిరుగుతున్న యువవికాస దరఖాస్తుదారులు
- ఏప్రిల్ 5కు గడువు పూర్తి

9





# విశ్వావసు ఉషస్సులో..

### శ్రీ విశ్వావసు తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభం

- ఆలయాల్లో జోరుగా సాగనున్న పంచాంగ శ్రవణాలు
- షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడికి ప్రాధాన్యత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తుల దర్శనాలు
- శ్రీరామ నవరాత్రి వేడుకలూ ఆరంభం
- పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడిగా కూడళ్లు

9

## నేడు ఉగాది పర్వదినం


పూజ సామాను కొనుగోలు చేస్తున్న ప్రజలు

వసుధపై వసంతం వికసించిన తొలి రోజును స్మరించుకుంటూ.. తెలుగు నాట చేసుకునే తొలి పర్వం ఉగాది. ప్రకృతితో మమేకమైన మన సంస్కృతికి మచ్చుతునక ఈ పర్వం. చైత్రశుద్ధ పాడ్యమి ఆదివారం శ్రీ విశ్వావసు నూతన తెలుగు ఉగాది పర్వదినాన్ని జరుపుకునేందుకు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలంతా సమాయత్తమయ్యారు. తెల్లవారుజామున్నే లేచి అభ్యంగన స్నానాలు ఆచరించి, మామిడితోరణాలు, పూలతో ఇంటిని అలంకరించుకుని, ఇంట్లో పూజా మందిరంలో ఇష్టదైవాన్ని పూజలు చేసి పూజించుకొని షడ్రుచుల ఉగాది పచ్చడి సేవించడం ఈ పండుగ పరమార్థం. పంచాంగ శ్రవణం శుభ గుణాలను ఇస్తుందని, శత్రువులను నశింపజేస్తుందని దుస్వప్న ఫలితాలను పోగొడుతుందని, ఆయుస్సును పెంచడమేకాక గంగా స్నాన, గోదాన ఫలితాలను ఇస్తుందన్న విశ్వాసంతో ప్రతీ ఒక్కరు పంచాంగ శ్రవణాన్ని వినేందుకు ఆసక్తి చూపుతారు. ప్రధానంగా శుభ, అశుభ ఫలితాలు, గ్రహచార ఫలం, ఫలశృతి, సంవత్సరాంత ఫలితం, ఏ గ్రహానికి అధికారం లాంటి విషయాలు తెలుసుకొని మనిషి భవిష్యత్ మార్గదర్శనం చేసుకునేందుకు ఈ పర్వదినం గీటురాయిగా తీసుకుంటారు.

-హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్

# డివిజన్ హోదా దక్కకుండా కుట్రలు

- కాజీపేటకు రైల్వే డివిజన్ సాధించి తీరుతాం..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాజీపేట జంక్షన్‌కు డివిజన్ హోదా రాకుండా కొందరు అధికారులు కుట్రల పన్నుతున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు. ఆ కుట్రలో భాగమే ఇక్కడికి రావాల్సిన లోకోరన్నింగ్ స్టాఫ్ పోస్టులను ఇతర డివిజన్‌లకు తరలిస్తున్నారని, వారి కుట్రలు తిప్పి కొట్టి డివిజన్ సాధించి తీరుతామని అన్నారు. కాజీపేట రైల్వే సంఘ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు. కాజీపేటకు మంజూరు కావాల్సిన క్రూకంట్రోల్ నుంచి 185 మంది లోకోపైలెట్‌లు, అసిస్టెంట్ లోకో పైలెట్‌లు, ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఇతర డివిజన్‌లకు తరలించారని రైల్వే ఆర్డర్ విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తరలించిన పోస్టులను వెంటనే కాజీపేటకు తీసుకురావాలని హెచ్చరించారు. డివిజన్ రాకుండా ఓ రైల్వే అధికారి చేసే కుట్రలే ఇవి అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

25 ఏళ్లుగా కాజీపేట అభివృద్ధికి ఉద్యమాలు చేస్తున్నామని నాయిని పేర్కొన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ, డివిజన్ సాధన, పిట్‌లైన్‌లకోసం నిత్యం రైల్వే జీఎం, డీఆర్‌ఎంల దృష్టికి తీసుకెళ్లామన్నారు. డివిజన్ సాధన కోసం ఎంపీ కడియం కావ్య నేతృత్వంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలుస్తామన్నారు. ఇందుకు జిల్లా బీజేపీ నాయకులు కలిసిరావాలని, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ద్వారా డివిజన్ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. లేకుంటే అన్నిరాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ నాయకులతో కలిసి జేఏసీగా ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈమీడియా సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. అంకూస్, నాయకులు బంక సంపత్, షేక్ అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, తమ్మడి మానస, బబ్లూ, దువ్వ రాజు, రేవతి, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

## దివ్యాంగుల వినతులు వెంటనే పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల నుంచి అందిన వినతులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద కోరారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దివ్యాంగుల ప్రజావాణిలో వినతులు స్వీకరించి మాట్లాడారు. దివ్యాంగుల కోసం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణిలో అందిన వినతులు శాఖల వారిగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి మొత్తం 9 వినతులు రాగా, ఇందులో డీఆర్‌డీవో సంబంధించి 4, జిల్లా సంక్షేమ శాఖ 2, జడ్పీ సీఈవో 3 వచ్చాయి. ప్రత్యేక ప్రజావాణిలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేయూ బడ్జెట్ రూ.428.82 కోట్లు

- ప్రభుత్వ గ్రాంట్లు రూ.195.62కోట్లు
- ఇతర వనరుల నుంచి రూ.170.55కోట్లు
- ఉద్యోగుల జీతభత్యాలకు రూ.369.21కోట్లు
- వర్సిటీ లోటు బడ్జెట్ రూ.2.45 కోట్లు
- వర్సిటీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్

9

# స్మార్ట్ పిటీ!

- వరంగల్ నగరంలో స్మార్ట్ సిటీ పనులకు గ్రహణం
- అధికారుల నిర్లక్ష్యంతో కొనసాగుతున్న పనులు
- 108 పనులకు 77 పూర్తి, 31 పనులు పెండింగ్
- బల్దియా, కుడా శాఖల సమన్వయలోపంతో జాప్యం
- జూన్ 30 వరకు పొడిగింపు ?

వరంగల్ కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో స్మార్ట్ సిటీ నత్తనడకన ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల 9 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. 2024 డిసెంబరు 31 వరకు పూర్తి చేయాల్సిన పనులు చాలా పెండింగ్‌లో ఉండడంతో సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో గడువు పెంచే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రగతిపథంలో నడపాలని చూస్తున్నా.. ఇక్కడి అధికారులు, కాంట్రాక్టర్ల కుంటి సాకులవల్ల నగర అభివృద్ధి నత్తను తలపిస్తోంది. వరంగల్ నగరంలో 108 పనులకు 77 పూర్తి కాగా, ఇంకా 31 పనులు కొనసాగింపు దశలో ఉన్నాయి. మరో 7 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వాని పంపించి టెండర్లు పిలిచారు.

2016లో ప్రారంభమైన ఈ పథకం స్వప్నం ఇంకా నెరవేరడం లేదు. వరంగల్ నగరంతో పాటు విలీన గ్రామాల్లో స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టాల్సిన పనులకు ఇంకా కొన్ని చోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. జీడ బ్ల్యూ ఎంసీ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెట్ అథారిటీ (కుడా) సంస్థల మధ్య సమన్వయలోపంతో చేపట్టే పనుల్లో జాప్యం జరుగుతోందనే ప్రచా రం ఉంది. కొన్ని చోట్ల పనులు జరుగుతున్నా నాసిరకం పనులతో పను లు పూర్తి చేసి కాంట్రాక్టర్లు బిల్లులు స్వాహా చేసినట్టు తెలుస్తోంది. కాంట్రాక్టర్లు, బల్దియా, కుడా అధికారులు కుమ్మక్కై నామమాత్రపు పనులు చేసి నిధులు అందినకాడికి దండుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## రూ.964 కోట్లతో పనులు షురూ

కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో స్మార్ట్ సిటీ మిషన్ కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాయత్తమయ్యాయి. కేంద్రం, రాష్ట్రం పనులు జరుగుతున్న క్రమంలో ప్రతీ నెల ఆయా ప్రభుత్వాలకు అందించే యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యూటీసీ) ఆధారంగా నిధులు మంజూరు చేస్తారు. ఇప్పటివరకు వరంగల్ నగరానికి రూ.599.96 కోట్ల నిధులు మంజూరైనట్టు అధికారులు వెల్లడించారు. దీంతో బల్దియా పరిధిలో ముందస్తుగా 89 రకాల పనులు చేసేందుకు కొటేషన్‌లను సిద్ధం చేసి పంపించారు. తర్వాత నగర సుందరీకరణ, జంక్షన్ల అభివృద్ధి, సీసీ రోడ్లు నిర్మించేందుకు మరిన్ని నిధులు కావాలని ప్రతిపాదనలు చేసి గత యేడాది పంపించారు. మొత్తంగా ఇప్పటి వరకు నగరంతో పాటు విలీన గ్రామాల్లో 108 పనులకు వెయ్యి కోట్లు కావాలని ప్రతిపాదనలు చేసి పంపించారు. కానీ రూ.964 కోట్లకు మాత్రమే ఆమోదం తెలిపినట్టు తెలిసింది. 2025లో మరో 7 పనులకు ప్రతిపాదనలు, అగ్రిమెంట్లు చేసి పంపించారు. ఇంకా బల్దియా పరిధిలో జరిగిన స్మార్ట్ సిటీ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.365 కోట్ల నిధులు రావాల్సి ఉంది. అయితే ప్రధానంగా రూ.99 కోట్లతో నగరంలో నిఘా కెమెరాల ఏర్పాటు (ఐసీసీసీ)కు, రూ.250 కోట్లతో ఉర్సు గుట్ట, ప్రగతి నగర్, రెడ్డిపురంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం, రూ.76 కోట్లలో భద్రకాళి బండ్ నిర్మాణంలో అభివృద్ధి పనులు, రూ.34 కోట్లతో వడ్డేపల్లి బండ్, రూ.30 కోట్లతో రాంపూర్‌లో బయోమైనింగ్ ప్లాంట్ ఏర్పాటు పనులు, రూ.9 కోట్లతో పబ్లిక్ గార్డెన్ డెవలప్‌మెంట్, రూ.50 కోట్లతో ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, రూ.30 కోట్లతో భద్రకాళి మాడ వీధులతో పాటు నర్సంపేట, ఖమ్మం, ములుగు, కరీంనగర్ ప్రాంతాల నుంచి వరంగల్ నగరానికి వస్తున్న దారుల్లో గ్రాండ్ ఎంట్రెన్స్ ఆర్చ్‌ల నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ పనులు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయని, ఇంకా మరో మూడు నెలల్లో పనులు పూర్తవుతాయని అధికారులు వెల్లడించారు. యేటా రూ.10 కోట్లతో లైటింగ్, గ్రీనరికి ఉపయోగిస్తున్నారు.


కొనసాగుతున్న వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులు

### అధికారుల్లో చలనం వచ్చేనా ?

స్మార్ట్ సిటీ మిషన్ పనుల్లో బల్దియా, కుడా అధికారుల నిర్లక్ష్యంతోనే పనుల్లో జాప్యం జరిగినట్టు ప్రచారం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నా శాఖల మధ్య సమన్వయం ఉండడం లేదని నిఘా విభాగాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. గత యేడాది జూన్ 30 వరకే స్మార్ట్ సిటీ మిషన్ పథకం ముగిసింది. కానీ చాలా పనులు పెండింగ్‌లో ఉండడం, చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. ఇదీ గమనించి సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లి కేంద్ర గృహ నిర్మాణాల పట్టణ, వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి విషయం తెలిపారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి 2025 మార్చి 31 వరకు స్మార్ట్ సిటీ మిషన్ పనులు పూర్తి చేసే అవకాశాన్ని కల్పించారు. కానీ ఇంకా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

అయితే పెండింగ్ పనుల గడువు పెంచాలని ఈ నెల 26న హైదరాబాద్ సెక్రెటేరియట్ కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ అధ్యక్షతన స్మార్ట్‌సిటీ బోర్డు మీటింగ్ జరిగింది. బల్దియా నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర హాజరు కాగా, అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా తూతూ మంత్రంగా సమావేశం జరిగింది. తర్వాత తిరిగి శుక్రవారం (28)న హైదరాబాద్‌లో మీటింగ్ నిర్వహించి వరంగల్ నగరంలో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు ఆధారాలు చూపించడంతో మరో మూడు మాసాలు (జూన్ 30) గడువు పెంచినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న పనులు మాత్రమే పూర్తి చేయాలని, కొత్త పనులకు ప్రతిపాదనలు వద్దని తేల్చి చెప్పినట్టు తెలిసింది. జూన్ వరకు మిగిలిన పనులు పూర్తి చేయకపోతే బల్దియాకు వచ్చే నిధులు వెనక్కి పోతాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నగరంతో జరుగుతున్న పనులకు రెండుసార్లు గడువు పెంచినా లక్ష్యం చేరకపోవడంతో ఇక్కడి అధికారుల తీరుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లిప్తత వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ సమాచారం.


మచిలీబజార్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్, నబీఖానా వద్ద రూ.75లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్‌డ్రైన్ పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలనలో 10వ డివిజన్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొన్ని మాసాల్లోనే ప్రత్యేక నిధులు కేటాయించి డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అదే విధంగా దశల వారిగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో సైడ్ డ్రైన్‌లు, సీసీ రోడ్లు నిర్మాణం చేపడతామన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మత్యశాఖ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కత్తెర సారంగపాణి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, వేయిస్తంభాల ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మాజీ కార్పొరేటర్ నజీమ్ జిహాన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐనవోలు మల్లన్న ఆలయ ఆదాయం రూ.1.22 కోట్లు

- హుండీల ద్వారా 25 రోజులకు రూ. 25.96 లక్షలు
- టికెట్ల ద్వారా సమకూరిన సొమ్ము రూ. 96.29 లక్షలు


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది, పర్యవేక్షిస్తున్న ఈవో, పరిశీలకులు

ఐనవోలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం హుండీ, టికెట్ల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 25 రోజులకు హుండీల ద్వారా రూ.25, 96, 561లక్షల ఆదాయం రాగా, వివిధ రకాల ఆర్జిత టికెట్లపై రూ.96,29,000లక్షల ఆదాయం సమకూరింది. మొత్తం రూ.1,22,25, 561కోట్ల ఆదాయం లభించినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. భక్తులు హుండీల్లో కరెన్సీ నోట్లతోపాటు మిశ్రమ వెండి బంగారు ఆభరణాలు స్వామి వారికి సమర్పించారు. లెక్కింపులో వాటిని పరిశీలించాక నోట్లు చిల్లర నాణేలను బ్యాంక్ అధికారులకు అందజేశారు. మిశ్రమ వెండి, బంగారాన్ని తిరిగి హుండీలోనే భద్రపరిచారు. ఈ లెక్కింపును దేవాదాయశాఖ డివిజన్ పరిశీలకుడు డి.అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. కానిస్టేబుళ్లు పరమేశ్వరి, యాస్మిన్, శ్రీనివాస్‌లు బందోబస్తు నిర్వహించారు. మహబూబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి, వెంకటేశ్వర సేవా సమితికి చెందిన మహిళలు, అర్చక సిబ్బంది, ఒగ్గు పూజారులు ఎం మహేందర్, అశోక్ తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై పోరాడుతా..

- నేను ఏ పార్టీలో చేరను : ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

జఫర్‌గఢ్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాడుతానని వరంగల్-నల్గొండ-ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జఫర్‌గఢ్‌లో పీఆర్‌టీయూ జిల్లా, మండల ప్రతినిధులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ పటిష్ఠతకు జిల్లా, మండల స్థాయిల్లో ప్రభుత్వం పర్యవేక్షణాధికారులను నియమించాలన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను రూపొందించి అమలు చేయాలన్నారు. తద్వారా ఎంఈఓలు, జూనియర్ లెక్చరర్స్, డిప్యూటీ ఈఓలు, డైట్, బీఈడీ కళాశాలల లెక్చరర్లను పదోన్నతుల ద్వారా నియమించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యావ్యవస్థలో పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ఠం చేస్తూ విద్యార్థులకు తగు వసతి సౌకర్యాలతో నాణ్యమైన విద్యనందిస్తూ పిల్లల తల్లిదండ్రుల్లో సర్కారు బడులపై నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ పంచాయతీరాజ్ పాఠశాలల్లో 16.80లక్షల మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించేందుకు ఉపాధ్యాయులకు ఆంగ్లమాధ్యమం, ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు నష్టం కలిగించే సీపీఎస్‌ను రద్దు చేస్తామని, ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ అమలుతోపాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల గొంతుకగా శాసనమండలిలో వినిపిస్తానన్నారు. తాను ఏ రాజకీయ పార్టీలో చేరబోనని శ్రీపాల్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా, అంతకుముందు మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు పోతు రాజిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పాల్గొని రాజిరెడ్డి దంపతులను సన్మానించారు. ఈ సమావేశాల్లో పీఆర్‌టీయూ జనగామ, హనుమకొండ, ములుగు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, యాకూబ్‌రెడ్డి, జఫర్‌గడ్, ఐనవోలు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సీతారామయ్య, రామారావు, రాజు, చంద్రమోహన్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

# సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలి

### టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను మరింతగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీవోలు, డీసీసీ బ్యాంకు అధికారులకు సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జిల్లాస్థాయి సాధికార కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల బలోపేత చర్యలు, సమస్యల పరిష్కారం, జీవో 44 అమలు తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం ఇటీవలే డీసీవోగా బాధ్యతలు చేపట్టిన సంజీవరెడ్డిని సన్మానించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని డీసీవోలు నీరజ, రాజేందర్‌రెడ్డి, సర్దార్‌సింగ్, డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డైరెక్టర్ జగన్‌మో హన్‌రావు, డీజీఎం అశోక్, మహబూబాబాద్ ఏఆర్ సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవైష్ణవ పండితుడు నారాయణస్వామి కన్నుమూత



హనుమకొండ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కొత్తూరు ప్రాంతానికి చెందిన శ్రీవైష్ణవ పండితుడు, వైష్ణవ సంప్రదాయానికి సంబంధించి అనేక గ్రంథాలను ప్రకటించిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామానుజం (మడికొండ) నారాయణస్వామి (91) శనివారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా అనేక అవార్డులను అందుకోవడమేకాక సంప్రదాయ పండితుడిగా శ్రీవైష్ణవ ఆచార్యుడిగా ఆయన పొందిన సత్కారాలు అనేకం. ఆయన కోరికపై మృతి చెందిన అనంతరం పార్థీవదేహాన్ని వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థుల కోసం దానం చేయడం విశేషం. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, హనుమకొండ జిల్లా ప్రతినిధి శంకర్‌రావు ఆధ్వర్యంలో కేఎంసీకి అప్పగించారు. నారాయణస్వామి మృతి పట్ల అనేక మంది చాత్తాద శ్రీవైష్ణవ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

# కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-1 బోగీలో పొగలు రావడంతో రైలును డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో 15 నిమిషాల పాటు శనివారం సాయంత్రం నిలిపివేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న రైల్వే సీఎన్‌డబ్ల్యూ సిబ్బంది బోగీ వద్దకు చేరుకుని, రైలును పరిశీలించారు. బ్రేక్ పట్టివేయడంతోనే పొగలు వచ్చినట్లు తెలిసింది. సిబ్బంది బ్రేక్‌ను సరిచేసిన అనంతరం రైలును యథావిధిగా పంపించారు. తొలుత విజయవాడ సమీపంలోని కొండపల్లి వద్ద ఇంజన్ ప్యాంట్ రాపిడికి గురికావడంతో రైలు ఇంజన్ ఆగిపోయింది. దీంతో అక్కడసైతం మరో ఇంజన్‌ను అమర్చి రైలును పంపించారు. రెండు సంఘటనలతో కృష్ణ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది.

# కో-ఆర్డినేటర్లు పార్టీ బలోపేతానికి పనిచేయాలి

### వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

వరంగల్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పార్టీని బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ (టీపీసీసీ) ఆదేశానుసారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' మండలాలకు కో-ఆర్డినేటర్లను నియమిస్తున్నామని, మండల కో-ఆర్డినేటర్లు పూర్తిస్థాయిలో పని చేసి ప్రభుత్వ సంక్షేమ కార్య క్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. నగరంలోని రాంకీ సిటీలో శనివారం 20వ డివిజన్ కార్పొరేటర్ గుండే టి నరేంద్రకుమార్ నివాసంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న మొదలయ్యే 'జై బాపు, జై భీం, జై సంవిధానం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కోఆర్డినేటర్లు స్థానిక నాయకులను కలుపుకుని గడపగడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని, ఎప్పటికప్పుడు రిపోర్టు పంపించాలన్నారు. మండలాల వారిగా నియమితులైన కోఆర్డినేటర్ల వివరాలు ప్రకటించారు. నర్సంపేట రూరల్‌కు బస్వరాజు శ్రీమాన్, నర్సంపేట టౌన్‌ను గుండేటి నరేంద్రకుమార్, చెన్నారావుపేటకు జన్ను రవి, దుగ్గొండికి గోరంటల రాజు, నల్లబెల్లికి బిల్లా శ్రీకాంత్, నెక్కొండకు కరాటే ప్రభాకర్, ఖానాపురంనకు తత్తరి లక్ష్మణ్, వర్ధన్నపేటకు జనగామ రమేష్, పర్వతగిరికి దుబ్బాక సంతోష్, వరంగల్‌కు వజ్రరాజు, ఖిలా వరంగల్‌కు ఆకుల రుద్రప్రసాద్, గీసుగొండకు నరుకుడు వెంకటయ్య, సంగెంకు మాసాని యాకూబ్, రాయపర్తికి ఎం.డి. అఫ్జర్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో బస్వరాజు శ్రీమాన్, కురవి పరమేశ్వర్, తత్తరి లక్ష్మణ్, దామెర సర్వేశం, బిల్లా శ్రీకాంత్, జన్ను రవి, గోరంటాల రాజు, చాగంటి శ్రీనివాస్, అనిల్, దామోదర్, కరాటే ప్రభాకర్, వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గుట్కాలు పట్టివేత

వరంగల్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిషేధిత గుట్కాలను మడికొండ, నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మడికొండ పీఎస్ పరిధిలోని నెహ్రూనగర్‌లో ఎం.డి. సోహెల్ వద్ద రూ.33,290 విలువ చేసే వివిధ రకాల గుట్కాలను పట్టుకున్నామన్నారు. అదేవిధంగా ఈస్ట్ జోన్‌లోని నల్లబెల్లి పీఎస్ పరిధిలో బచ్చు రాజయ్య వద్ద రూ.15,090 విలువ చేసే గుట్కాలను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.

# భారత్ గౌరవ్ సప్త జ్యోతిర్లింగాల దర్శనయాత్ర

### ఏప్రిల్ 8 నుంచి 19 వరకు రైలు పర్యటన

గిర్మాజిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వే అనుబంధ ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐ.ఆర్.సి.టి.సి) భారత్ గౌరవ్ రైలు ఏప్రిల్ 8 నుంచి 19 వరకు సప్త జ్యోతిర్లింగాల యాత్రను నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ మార్కెటింగ్ అధికారి ఓ.నరేష్‌బాబు తెలిపారు. వరంగల్ రైల్వేస్టేషన్ వీఐపీ లాంజ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐఆర్‌సీటీసీ టూర్ మానిటర్ ప్రశాంత్‌తో కలిసి ఐఆర్‌సీటీసీ మార్కెటింగ్ అధికారి నరేష్‌బాబు దర్శన యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నరేష్‌బాబు మాట్లాడుతూ.. అత్యంత ప్రాశస్త్యమైన ఏడు జ్యోతిర్లింగాల దర్శనం కోసం ప్రత్యేకంగా ఏప్రిల్ 8 నుంచి 19 వరకు భారత్ గౌరవ్ రైలు పర్యాటక టూర్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 11 రాత్రులు 12 పగలుగా సాగే ఈ యాత్రలో ఉజ్జయిని మహాకాలేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకా నాగేశ్వర్, సోమనాథ్ సోమేశ్వర్, పూణె భీమశంకర్, నాసిక్ త్రియంబకేశ్వర్, ఔరంగాబాద్ గ్రిస్నేశ్వర్‌ల దర్శనం ఉంటుందని చెప్పారు. ఈ యాత్రకు స్లీపర్ క్లాస్ చార్జీ రు.20,890లు, పిల్లలకు (5-11 సంవత్సరాలలోపు) రు.19.555లు, 3ఏసీ తరగతి చార్జీ రూ.33,735లు, పిల్లలకు రూ.32,160లు, 2 ఏసీ తరగతి చార్జీ రూ.44,375లు, పిల్లలకు రూ.42,585లు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతీ రోజు బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, దర్శన ప్రాంతాల్లో వాహనసదుపాయం, వసతి ఈ చార్జీలలోనే ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే ప్రతీ ప్రయాణికుడికి భద్రత, ఇన్సూరెన్స్ సదుపాయం, ప్రతీ కోచ్‌కు టూర్ గైడ్ ఉంటారని తెలిపారు. ప్రయాణంలో ఎవరికైనా అనారోగ్యం కలిగినా వెంటనే తగిన వైద్య సదుపాయం ఉంటుందని నరేష్ బాబు తెలిపారు.

సప్త జ్యోతిర్లింగాల దర్శన యాత్ర రైలు ఏప్రిల్ 8న విజయవాడలో రాత్రి 9 గంటలకు బయలుదేరి 11 గంటలకు చేరుకుని అక్కడ ప్రయాణికులను ఎక్కించుకుని అర్ధరాత్రి 1.45 గంటలకు కాజీపేటకు చేరుకుంటుందన్నారు. జ్యోతిర్లింగాల దర్శనయాత్ర అనంతరం ఏప్రిల్ 19 మధ్యాహ్నం 12 గంటలకు కాజీపేటకు చేరుకుంటుందని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న చార్జీలతో 7 జ్యోతిర్లింగాలను దర్శించుకునే ఈ యాత్రకు వెళ్లే భక్తులు ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్ మొబైల్ నెంబర్లు 92810 30712/92810 30711లను సంప్రదించాలన్నారు. దర్శనయాత్రకు టికెట్‌లు బుక్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక రైలులో స్లీపర్ 460 బెర్త్‌లు, 3ఏసీ 206 బెర్త్‌లు, 2ఏసీ 52 బెర్త్‌లు ఉన్నాయని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ యాత్రను వినియోగించుకోవాలని ఆయన కోరారు.



వరంగల్‌లో యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఆర్‌టీసీ మార్కెటింగ్ అధికారి నరేష్‌బాబు

# విశ్వావసు ఉషస్సులో..

## నేడు ఉగాది పర్వదినం

- తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు
- పూజా సామగ్రి కొనుగోలుతో సందడిగా కూడళ్లు




హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల కొత్త సంవత్సరం ఉగాది పర్వదినం చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం రోజున ప్రజలు జరుపుకోనున్నారు. ఈ ఏడాది ఉగాది పర్వదినం శ్రీవిశ్వావసు నామంతో ప్రారంభమవుతుంది. చైత్రమాసం కొత్త సంవత్సరం ఆదివారంతో ప్రారంభమవుతుంది. కొత్త సంవత్సరం సందర్భంగా మామిడి తోరణాలతో, పూల మాలలతో తమ ఇంటిని అలంకరించుకొని దేవాలయాలను కూడా అలంకరించి కొత్త సంవత్సరం ఆలయ దర్శనాలు చేసుకోవడం సంప్రదాయంగా భావిస్తారు.

### పచ్చడి

ఉగాది పర్వదినం రోజున కష్టం, సుఖం, తీపి, చేదు, ఒగరు రుచులతో షడ్రుచుల పదార్థాలతో తయారు చేసిన మిశ్రమాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు. కొత్త సంవత్సరం ఉగాది రోజున ఉగాది పచ్చడి తీసుకోవడం ప్రతీ ఒక్కరి ఇంట్లో ఆచారంగా వస్తున్న పండుగ. చైత్రమాసంలో ప్రకృతి సిద్ధపరంగా కొత్త చింతపండు, కొత్తగా కాసిన మామిడికాయ, వసంత రుతువులో పూజిన యాపపువ్వు, మంచినీరు, బెల్లంతో కలిపి జీవితంలో ఒడిదొడుకులు సుఖ దుఃఖాల మాదిరిగా అన్ని కలిపితే ఒకే విధంగా ఉండడంగా కొత్త సంవత్సరం రోజున ఉగాది పచ్చడిని కొత్త కుండలో తయారు చేసుకొని ప్రతీ ఇంట్లో పచ్చడి స్వీకరిస్తారు. కొత్త కుండలో చింతపండు, మామిడికాయ, బెల్లం, వేప పువ్వు, మంచినీటి ద్రవంతో పచ్చడి పదార్థాన్ని తయారు చేసి ఉగాది రోజున నూతన వస్త్రాలు ధరించి పచ్చడి స్వీకరించి పండుగ స్పెషల్ అయిన బొబ్బట్లు (భక్షాల)ను పిండి పదార్థాలను ఇంటిల్లిపాది ఆనందంగా ఆరగిస్తారు.

### పంచాంగ శ్రవణాలు



ఉగాది కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా రాబోయే సంవత్సర కాలంలో తమ రాశీఫలాలు ఎలా ఉన్నాయనేది పంచాంగశ్రవణం ద్వారా పండితులు ఉగాది రోజున శ్రవణం చేస్తారు. జిల్లాలోని చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయం, గీతాభవన్, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం, ఎల్లంబజార్‌లోని రామాలయం, ఎంజీరోడ్డులో గల గోపాలస్వామి గుడి, గురుధామం, వాసవీమాత దేవాలయం, దత్తక్షేత్రం, శివనగర్‌లోని రామాలయం, కాశీబుగ్గ దేవాలయం, ఆకారపు వారి గుడితో పాటు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

### వేయిస్తంభాల ఆలయంలో..

ఉగాది పర్వదిన వేళ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సాయంత్రం ఐనవోలు రాధాకృష్ణ సిద్ధాంతిచే పంచాంగ శ్రవణం, తాడూరి రేణుక శిష్యబృందంచే సాంస్కృతిక సంప్రదాయ నృత్యాలు, ప్రత్యేక 12 మంది కవులతో ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రారంభిస్తారని వారు చెప్పారు. పది రోజులపాటు జరిగే శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ఇక్కడ ఆరంభం కానున్నాయి.



హనుమకొండ చౌరస్తాలో ఉగాది పండుగ సందర్భంగా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

### పూజా సామగ్రి కొనుగోలు సందడి

ఉగాది పర్వదినం సందర్భంగా పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఈ మేరకు శనివారం నగరంలో పెద్ద ఎత్తున పూలు, పండ్లు, మామిడి కాయలు, కొత్త చింతపండు, వేప పువ్వు, మామిడి ఆకు, ఇతర పూజా సామగ్రిని ప్రజలు కొనుగోలు చేశారు. వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్, బట్టల బజార్, చమన్, జేపీఎన్ రోడ్డు, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, రంగశాయిపేట, తదితర ప్రాంతాల్లో పూజ సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా తోరణాలు కట్టేందుకు మామిడాకులు, బంతిపూల అమ్మకాలు, పచ్చడి తయారు చేసుకునేందుకు కుండలు, రంజన్లతో నగరమంతా ఉగాదిమయమైంది.

### ప్రముఖుల శుభాకాంక్షలు

ఉగాది నూతన తెలుగు సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఉగాది పండుగను జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. తెలిపారు.

### కవి సమ్మేళనాలు

ప్రత్యేక కవి సమ్మేళనాలు, పంచాంగ శ్రవణాలు రెండు రోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం పర్వదిన వేళ కూడా అనేక చోట్ల కవి సమ్మేళనాలు ఏర్పాటు అయ్యాయి. హనుమకొండలోని సహృదయ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వడ్డేపల్లి రోడ్‌లోని పీఆర్.రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో విశ్వావసు ఉగాది వేడుకలు పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు, కార్యదర్శి కుందావజ్ఝల కృష్ణమూర్తి చెప్పారు. నమిలిగొండ విశ్వేశ్వరశర్మచే పంచాంగ పఠనంతోపాటు స్వరవిపంచి పేరిట సిద్ధిపేటకు చెందిన శశిధర్‌శర్మ బృందంచే ప్రత్యేక లలిత సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా రంగశాయిపేటలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చేపూరి శ్రీరామ్ అష్టవధానంతోపాటు ప్రత్యేక ఉగాది సమ్మేళనం నిర్వహిస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విశ్వావసు నామ ఉగాది వేళ పంచాంగ శ్రవణాలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో యోగా గురువు బాబురావు, ధర్మప్రచార మండలి సభ్యులు దేవేందర్‌రెడ్డి, టీటీడీ కల్యాణ మండప మేనేజర్ రఘువీర్‌లతో కలిసి ఈ సందర్భంగా కార్యక్రమ వివరాల పత్రిక ఆవిష్కరించారు. సముద్రాల శఠగోపాచార్యచే టీటీడీ కల్యాణ మండపంలో ప్రంచాంగ శ్రవణం ఉంటుందని ఉమ్మడి జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ప్రత్యేక పంచాంగ శ్రవనాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు.



# కేయూ బడ్జెట్ రూ.428.82 కోట్లు



## వర్సిటీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్



కేయూ అకడమిక్ సెనెట్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ సురేశ్‌లాల్, ఎఫ్‌ఓ రాజయ్య

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 2025-26 ఏడాది బడ్జెట్ రూ.428.82కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించింది. వర్సిటీకి వచ్చే ఆర్థిక ఏడాదిలో ప్రభుత్వ ప్రభుత్వ గ్రాంట్ల రూపంలో రూ.195.62కోట్లు, అలాగే ఇతర వనరుల నుంచి రూ.170.55 కోట్ల మేరకు వనరులు వస్తాయని అంచనాలు వేశారు. వీటిలో వర్సిటీ ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనలు, భత్యాలు, నిర్వహణ ఖర్చులు, పరీక్షలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఇతర ఖర్చులకు రూ.369.21కోట్లకు అంచనాలు రూపొందించారు. వర్సిటీ లోటు బడ్జెట్ రూ.2.45కోట్లుగా చూపారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత జరిగిన 40వ అకడమిక్ సెనెట్ సమావేశం జరిగింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పాలకమండలి సభ్యులు డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కారుకాల అనితారెడ్డి, డాక్టర్ పుల్లూరు సుధాకర్, అడ్వకేట్ బాలు చౌహాన్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుకుమారి, డాక్టర్ నవీన్‌తో పాటు అకడమిక్ సెనెట్ సభ్యులు డాక్టర్ అంపశయ్య నవీన్, మాణిక్యం, మాజీ వీసీలు ప్రొఫెసర్ వంగాల గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి, ప్రొఫెసర్ విద్యావతితో పాటు డీన్లు, ఇతర పరిపాలన అధికారుల సమక్షంలో బడ్జెట్ ప్రవేశపెట్టారు.

సభలో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ వర్సిటీ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. మొత్తంగా బడ్జెట్ రూ.428.82 కోట్లుగా ప్రతిపాదించగా, అందులో ఖర్చులకు రూ.369.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్స్ రూపంలో రూ.195.62 కోట్లుగా ప్రతిపాదించారు. వర్సిటీకి ఇతర వనరుల నుంచి రూ.170.55 కోట్ల రాబడి వస్తోందని అంచనాలు వేశారు. వీటిలో యూజీసీ ఏరియర్స్‌గా రూ.32.81కోట్లు, అకడమిక్, ట్యూషన్ ఫీజులు రూ.8కోట్లు, అంతర్గత వనరుల రూపంలో రూ. 41.80 కోట్లు, పరీక్షల విభాగం నుంచి రూ.50.06కోట్ల మేరకు వర్సిటీకి ఆర్థిక వనరులు సమాకురుతాయని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. బడ్జెట్‌ను మొత్తంగా 8 విభాగాలుగా ప్రొఫెసర్ సురేశ్‌లాల్ చూపారు. రూ.2.45 కోట్లు లోటు ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్‌లకు రూ. 211.41కోట్లు, నిర్వహణ కార్యక్రమాలకు రూ.8.80కోట్లు, పరీక్షలకు రూ. 50.06 కోట్లు మేరకు నిధులను కేటాయించినట్లు వివరించారు. అకడమిక్ కార్యక్రమాలకు రూ.8.36కోట్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.84.38 కోట్లు నిధులను వెచ్చిస్తున్నట్లు స్పష్టం చేశారు. బడ్జెట్‌పై చర్చల్లో పాల్గొన్న పాలక మండలి సభ్యులు, డీన్లు, ఇతర పరిపాలన అధికారులు కేయూ 2025-26 బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు.

## కేయూను డిజిటలైజేషన్ చేస్తాం..

### కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 2026లో స్వర్ణోత్సవ సంబురాలకు సిద్ధమవుతోందని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. శనివారం కేయూ 40వ అకడమిక్ సెనెట్ సమావేశంలో అధ్యక్షత వహించి కీలక రిపోర్టును సమర్పిస్తూ ప్రసంగించారు. వర్సిటీ అభివృద్ధిలో అందరి కృషి ఉందన్నారు. బాధ్యతతో వర్సిటీని మరింత ముందుకు తీసుకుపోదామన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా కొత్త కోర్సులను తెస్తామన్నారు. బోర్డు ఆఫ్ స్టడీస్‌లను బలోపేతం చేస్తామని, వర్సిటీని డిజిటలీకరణ చేస్తామన్నారు. 10 ఏళ్లలో వర్సిటీలో 3వేల రీసెర్చ్ పేపర్లు గొప్ప జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయన్నారు. 5 ఏళ్లలో 65 పరిశోధన ప్రాజెక్టులతో పాటు 85 మంది స్టూడెంట్స్ జాతీయ అర్హత పరీక్షల్లో ప్రతిభ చూపారని పేర్కొన్నారు. రుసా నిధులు, ప్రాజెక్టులతో పాటు డిపార్టుమెంట్ ప్రాజెక్టులు వచ్చాయన్నారు. కె-హబ్‌ను ఉపయోగంలోకి తెస్తామని చెప్పారు. 6వ జనరేషన్, మెషిన్ లర్నింగ్, మార్కెట్ ఓరియంటేషన్ కోర్సులను తెస్తామన్నారు. న్యాక్ ఏ ప్లస్, ఎన్ఐఆర్ఎఫ్, యూఐ గ్రీన్ మెట్రిక్ ర్యాంకులు సాధించమని పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో అలూమినీ సహకారంతో అకడమిక్ బ్లాక్‌ను నిర్మించినట్లు తెలిపారు. జెన్‌కో రూ.కోటి, ఇన్ఫోసిస్ 300 కంప్యూటర్లను అందచేసినట్లు చెప్పారు. హరితహారంలో 11వేల మొక్కలు, ఎన్ఎస్ఎస్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహించమన్నారు. ఇంజనీరింగ్, కామర్స్ కళాశాలలో 285 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడించారు.

అలాగే మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సెలబస్‌లో మార్పులు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేస్తామని వీసీ పేర్కొన్నారు. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా టీచింగ్ ఏర్పాట్లు చేస్తామని, నూతన నియామకాలు చేపడుతామని పేర్కొన్నారు. అలూమినీలను బలోపేతం నిధులను సేకరిస్తామన్నారు. అలూమినీ ఫండ్, కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామన్నారు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.293కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేశామని వెల్లడించారు. బోధన, పరిశోధనపై శ్రద్ధ వహించాలని వీసీ సూచించారు.



మాజీ వీసీ ప్రొఫెసర్ విద్యావతి



మాజీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి



మాజీ వీసీ ప్రొఫెసర్ లింగమూర్తి



సెనెట్ సభ్యుడు అంపశయ్య నవీన్



పాలక మండలి సభ్యుడు పుల్లూరి సుధాకర్

## బడ్జెట్ వాస్తవికంగా రూపొందించాలి

కేయూ బడ్జెట్ వాస్తవికం గా రూపొందించాలని కేయూ పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్ సూచించారు. శనివారం కేయూ బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో పాల్గొని కీలక సూచనలు, సలహాలను ఇచ్చారు. బడ్జెట్ సంప్రదాయక పద్ధతులపై ఆధారపడకుండా, ఇతర వనరుల నుంచి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మరో పాలక మండలి సభ్యులు, అడ్వకేట్ బాలు చౌహాన్ మాట్లాడుతూ.. గతంలో పోల్చితే తాజాగా ప్రభుత్వం కేయూకిచ్చిన బ్లాక్‌గ్రాంట్ ఆశాజనకంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రాష్ట్రంలోనే వర్సిటీని టాప్‌కు తీసుకుపో వాలని అన్నారు. విద్యార్థులలో భవిష్యత్‌లో మార్పులు తీసుకువచ్చేందు కు అధ్యాపకులు మరింతగా కృషి చేయాలన్నారు. ఈసీ మెంబర్ డాక్టర్ కారుకల అనితారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీలో అనేక పరిమితుల మధ్య బడ్జెట్‌ను గొప్పగా రూపొందించారని పేర్కొన్నారు. వర్సిటీని రక్షించుకో వాలని కోరారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్ మాట్లాడుతూ.. బ్లాక్ గ్రాంట్ పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ విద్యావతి మాట్లాడుతూ.. వర్సిటీలో ప్రొఫెసర్ల సంఖ్య తగ్గిపోతుందని, విభాగాధిపతులు కాంట్రాక్టు అధ్యాపకులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డు ప్రొఫెసర్లకు రీసెర్చ్ అవకాశం కల్పించాలని కోరారు. మాజీ వీసీ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో పోలిస్తే తాజా ప్రభుత్వానికి వర్సిటీలపై సానుకూల దృక్పథం ఉందన్నారు. ఎస్డీఎల్‌సీఈ, ఎస్ఎఫ్‌సీ కోర్సులను బలోపేతం చేయాలన్నారు. టీం వర్క్‌తో వర్సిటీ అభివృద్ధికి కృషి జరుగాలని పేర్కొన్నారు. మాజీ వీసీ ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి మాట్లాడుతూ.. నియామకాలు జరగాలని, బ్లాక్‌గ్రాంట్ పెరుగాలని అన్నారు. నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రముఖ రచయిత, సెనెట్ సభ్యుడు డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. స్మారక ఉపన్యాసాలను ఏటేటా నిర్వహించేలా చూడాలనిన్నారు. సెనెట్ సభ్యుడు మాణిక్యం, సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి. హన్మంతు, ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ రాంనాథ్‌కిషన్‌లు మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధిపై కీలక సూచనలు చేశారు.

ఈ సమావేశంలో డీన్లు ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, గాదె సమ్మయ్య, ఎం.శ్రీనివాస్, మంచాల సదానందం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, అకూట్ అధ్యక్షులు ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి, తిరుమలదేవి, వెంకయ్య, ఈసం నారాయణ, తదితరులు పాల్గొన్నారు. సభలో రిటైర్డు కానున్న తోట రాజయ్య దంపతులను సన్మానించారు.

# సర్వర్ డౌన్..



రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న సంగెంలోని మీ సేవా కేంద్రం

- మీ సేవా కేంద్రాల్లో సర్వర్ సమస్య
- ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం
- తిరుగుతున్న యువవికాస దరఖాస్తుదారులు
- ఏప్రిల్ 5కు గడువు పూర్తి

హనుమకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారం రోజులుగా మీసేవా కేంద్రాల్లో సర్వర్లు పని చేయడం లేదు. ఏ ధృవీకరణ పత్రాలు జారీ కావడం లేదు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులు చేసుకునేందుకు కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల కోసం నిరుద్యోగ యువతీ యువకులు మీ సేవా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. సైట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపడం లేదు.

### అన్నిటికీ మీ సేవా కేంద్రమే..

కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు మొదలు కొని స్కాలర్‌షిప్‌ల వరకు ఇలా ప్రతీ అవసరానికి దరఖాస్తు చేసుకోవాలంటే మీ సేవా కేంద్రానికి వెళ్లక తప్పదు. మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాతే సంబంధిత కార్యాలయాల నుంచి ధృవీకరణ పత్రాలు జారీ అవుతాయి. ఈ సర్టిఫికెట్లను కూడా మీ సేవా కేంద్రాల నుంచే తీసుకోవాల్సి ఉంటుంది. ఈప్రక్రియ ఉమ్మడి జిల్లాలో వారం పాటు దాదాపుగా నిలిచిపోయింది.

### సర్వర్ డౌన్

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే మీ సేవా కేంద్రాల్లో వారం రోజులుగా సర్వర్ ఏకారణం వల్ల డౌన్ అయింది సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలిపోయింది. ఏ మీ సేవా కేంద్రానికి వెళ్లినా ఆపరేటర్లు 'సారీ.. సర్వర్ డౌన్ అయింది..' అని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. వివిధ ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన విద్యార్థులు, యువతీ యువకులు ఎంతసేపు ఎదురు చూసినా సర్వర్లు తిరిగి పని చేయడం లేదు, సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారితో అన్ని కేంద్రాలు కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. రాజీవ్ యువ వికాస పథకం కోసం దరఖాస్తులు చేసుకునే గడువు దగ్గర పడుతుండం, అవసరమైన ధృవీకరణ పత్రాలు జారీ కాకపోవడంతో యువకులు ఆందోళన పడుతున్నారు. భూ సంబంధిత రికార్డులు, ఇతరత్రా అవసరాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళుతున్న వారికి కూడా నిరాశే ఎదురవుతున్నది. కొత్తగా దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుండగా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు రెవెన్యూ కార్యాలయాల నుంచి తీసుకోవాల్సిన ధృవీకరణ పత్రాలు కూడా తీసుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. రోజు ఉదయం, సాయంత్రం మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగడమే సరిపోతున్నదని అంటున్నారు.


### చేతులెత్తేస్తున్న నిర్వాహకులు

సమస్య ఏమిటో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు చెప్పలేకపోతున్నారు. సర్వర్‌లో లోపాలు ఉన్నాయని, లేదా సైట్‌లో సాంకేతిక సమస్య ఉందనో, అప్‌డేట్ చేసే పనిలో యంత్రాంగం ఉందనో అనుకోవడం తప్పా ఎవరూ సరైన సమాచారం ఇవ్వడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సర్వీస్‌ను మీ సేవకు అనుసంధానించిన అధికారులు సమస్య ఏమిటో చెప్పకపోవడంతో దరఖాస్తుదారులతో చీవాట్లు పడాల్సి వస్తోందని నిర్వాహకుల వాపోతున్నారు. సైట్‌లో సమస్య వల్ల అన్ని మీ సేవా కేంద్రాల్లో గుట్టగుట్టలుగా దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాల దాఖలు కోసం చేసిన కొందరి దరఖాస్తులు ఆమోదం పొందినట్లు సందేశం వచ్చినా సర్వర్లో సమస్యతో సర్టిఫికెట్ మాత్రం డౌన్‌లోడ్ కావడం లేదు. హైదరాబాద్ మీసేవా స్టేట్ డాటా సెంటర్ (ఎస్‌డీఎస్)లో తలెత్తిన సాంకేతిక సమస్యే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

మీ సేవా కేంద్రాల్లో 38 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 204 రకాల సేవలు ప్రజలకు అందిస్తున్నారు. ఆ సేవల్ని పొందాలంటే మీ సేవ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కుల, ఆదాయ, నివాసపత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఈసీ పొందాలంటే సమీప సేవా కేంద్రాల్లో అందుకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దార్ కార్యాలయాల్లో మాన్యువల్‌గా అందించే తొమ్మిది రకాల సర్టిఫికెట్లను సైతం ఇటీవల మీ సేవలో అందుబాటులోకి తెచ్చారు.

### గడువు దాటుతోంది..

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 5 చివరి తేదీ. ఆ తర్వాత ఏప్రిల్ 6 నుంచి 30 వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. అర్హులైన లబ్ధిదారులకు జూన్ 2న తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలు అందజేస్తారు. ఈ పథకం కింద నిరుద్యోగ యువతకు రూ. 3 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తారు. ఈ పథకం కింద దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా సమర్పించాల్సిన ధృవీకరణ పత్రాల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా దరఖాస్తుదారు తెలంగాణ శాశ్వత నివాసి అయి ఉండాలి. ఈ నివాస ధృవీకరణ పత్రం కొత్తగా తీసుకోవాలంటే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. అగ్రికల్చర్ యూనిట్‌కు దరఖాస్తు చేస్తే పట్టాదారు పాస్ బుక్ ఉండాలి. ట్రాన్స్‌పోర్టు వాహనానికి దరఖాస్తు చేస్తే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. దివ్యాంగ అభ్యర్థులైతే సదరం సర్టిఫికెట్ జత చేయాలి. ఆన్‌లైన్ అప్లికేషన్ పూర్తయ్యాక దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఎంపీడీవో లేదా మున్సిపల్ లేదా జోనల్ కార్యాలయాల్లో ఇవ్వాలి. ఇదంతా జరగాలంటే ముందు మీ సేవా కేంద్రాల్లో నుంచి ధృవీకరణ పత్రాలు రావాలి. అవి రావడంలో జాప్యం జరుగుతోంది. ఈ దృష్ట్యా దరఖాస్తుల దాఖలు గడువును పొడిగించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లో ఎస్ఎఫ్ఐ 3వ జిల్లా మహాసభలు జరిగాయి. సీతారాంఏచూరి ప్రాంగణం సుందరయ్య భవన్‌లో జరిగిన సభలకు ముఖ్యఅతిథిగా దామెర కిరణ్ హాజరై మాట్లాడారు. కేయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, కోఠారి కమిషన్ సిఫార్సుల మేరకు బడ్జెట్‌లో 30 శాతం నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీ మండల కేంద్రంలో అంతర్జాతీయ స్థాయి స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అద్దెభవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు అద్దె చెల్లించాలని అన్నారు. పాఠ్యపుస్తకాలను సకాలంలో ముద్రించి విద్యార్థులకు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియాంబర్స్‌మెంట్‌లు చెల్లించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఫీజుల దోపిడీని అడ్డుకుని, విద్యాహక్కు చట్టాలన్నీ అమలు చేయాలని అన్నారు. ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ రూపొందించిన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సభల్లో ఎస్ఎఫ్ఐ హనుమకొండ అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, సూర్యం, బిరెడ్డి జస్వంత్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.పరిమళ, సాయికుమార్, మడికొండ మేఘన, సన్నీ, అజయ్, మల్లేశ్, పవన్‌కుమార్, ఎమ్డీ ఇస్మాయిల్, అరుణ్, కుమార్, వరప్రసాద్, నిరోషా, ప్రతిమ, కావ్య, సందీప్, అఖిల్, కన్నారావు, రాజ్‌కుమార్, రత్నం, స్వాతి, వేణు, పృథ్వీ, నరేశ్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట రైల్వేస్టేషన్‌లో డ్రగ్ కంట్రోల్ టీం తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో అనుమానితుల బ్యాగుల తనిఖీ చేస్తున్న దృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నియంత్రణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో వరంగల్ రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల బ్యాగ్‌లతో పాటు రైల్వేస్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం

హనుమకొండ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని హనుమకొండ హెడ్ పోస్టాఫీసు పవన్‌కుమార్ అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్ పోస్టాఫీసులో ఎల్ఎస్‌జీ పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న పులి సరోత్తం రెడ్డి ఉద్యోగ విరమణ సభ శుక్రవారం హనుమకొండ నక్కలగుట్ట హెడ్‌పోస్టాఫీసులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పులి సరోత్తంరెడ్డి-లక్ష్మి దంపతులకు తోటి ఉద్యోగులు, అధికారులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోస్టాఫీసు అధికారులు వి.హన్మంత్, మదన్‌మోహన్, రమాదేవి, అనంతరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్

## అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా అందజేయాలి

వరంగల్ మెడికల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ అనుమతితో ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్) పోస్టులకు దరఖాస్తులు స్వీకరించినట్లు హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. ఎంబీబీఎస్ అర్హత గల వారు 38 మంది, బీఏఎంఎస్ 116, నర్సింగ్ పూర్తిచేసిన వారు 316 మంది మొత్తం 470 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, ఈ దరఖాస్తులను స్ర్కూటినీ చేసి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. వీటిలో ఎవరికైనా అభ్యంతరాలుంటే ఏప్రిల్ 3వ తేదీ లోపు లిఖితపూర్వకంగా సమర్పించాలన్నారు.

## ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజి వాకడే

వరంగల్ కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీని 90 శాతం రాయితీ ప్రకటించిందని, వన్‌టైం సెటిల్మెంట్ (ఓటీఎస్) అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. శనివారం బల్దియా కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 31లోపు ప్రాపర్టీ ట్యాక్స్‌లో అపరాధ రుసుము చెల్లించేందుకు గడువు దగ్గరగా ఉండడంతో ఆది, సోమవారాలు కార్యాలయాలకు సెలవు దినాలు ఉన్నప్పటికీ నగరంలోని ఈ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ సిటిజన్ పోర్టల్ ద్వారా ఆస్తిపన్నులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆలస్యం చేసిన వారికి ఏప్రిల్‌నెల నుంచి వడ్డీతో పాటు అసలును చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ బంపర్ ఆఫర్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రజలు చెల్లించే పన్నులు బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసరు స్వీకరిస్తారని, పన్నులు చెల్లించదలచిన వారు సంబంధిత రెవెన్యూ, శానిటేషన్ అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

## ఎల్ఆర్ఎస్ సాంకేతిక సమస్యలు పరిష్కరించండి

- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్‌లో ఏర్పడే సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా కార్యాలయంలో జరుగుతున్న ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్ అధికారుల పనితీరును పరిశీలించారు. మేయర్ స్వయంగా సాంకేతిక సమస్యలను తెలుసుకుని అక్కడి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఈ నెల 30, 31 రెండు రోజుల పాటు ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లు పనిచేస్తాయని అన్నారు. ఫీజులో 25 శాతం రాయితీతో చెల్లించేందుకు మరో రెండు రోజులు మిగిలి ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌లో మార్కెట్ విలువలో తేడాలు, ఫీజు జనరేషన్ తదితర సమస్యలు ఉంటే హెల్ప్‌డెస్క్‌లకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు రజిత, శ్రీనివాస్‌రెడ్డి, ఇర్షాద్, టీపీఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏకశిల హైస్కూల్‌లో ఉగాది ఉత్సవాలు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కేయూసీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో ఉగాది ఉత్సవాలను విద్యార్థుల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తువుల్లో వచ్చి ఉగాది పచ్చడి, భక్ష్యాలను తయారు చేసి పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఉగాది సందర్భంగా షడ్రుచుల సమ్మేళనంగా తయారు చేసే పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుందన్నారు. అందరికీ శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం హంటర్ రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డికి జన్మదిన శుభాకంక్షలు తెలియజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, నాయకులు నర్మెట్ట శ్రీనువాస్, సంపత్‌రెడ్డి, అరణ్యరెడ్డి, మురళి, రమేశ్ పాల్గొన్నారు.

# మతసామరస్యానికి నిదర్శనం ఇఫ్తార్

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి నిదర్శనం ఇఫ్తార్ విందు అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని టీఎన్‌జీవోస్ భవనంలో శనివారం టీఎన్‌జీవోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందుల్లో ఆత్మీయత, సోదరభావాలు వెల్లివిరుస్తాయన్నారు. ధార్మిక చింతనకు, దైవ చింతనకు, క్రమశిక్షణకు, దాతృత్వానికి రమదాన్ నెల ఆలవాలం అవుతుందన్నారు. ఇఫ్తార్ విందులో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణు, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్‌తోపాటు కేంద్ర సంఘం నేతలు, జిల్లా టీఎన్‌జీవోస్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కాజీపేట: కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని.. ప్రజా సంక్షేమమే ధ్యేయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీలో శనివారం రూ.13 లక్షలతో సీసీరోడ్డు, రూ.3 లక్షలతో పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతామన్నారు. 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, నాయకులు సిరిల్‌లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, మానస, తిరుపతి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

### శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

వడ్డెపల్లి: శ్రీలలిత గాయత్రి బ్రాహ్మణ సేవా సహకార సంఘం, మారుతి బ్రాహ్మణ సేవా సంఘం హనుమకొండ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన తెలుగు సంవత్సరాది శ్రీవిశ్వావసు నామ పంచాంగాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీలలిత గాయత్రి బ్రాహ్మణ సేవా సహకార సంఘం గౌరవ అధ్యక్షుడు చకిలం సుధాకర్ రావు, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మలు మాట్లాడుతూ.. బ్రాహ్మణ భవనం నిర్మాణం కోసం హనుమకొండలో ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు సత్యమోహన్, శ్రీధరాచార్యులు, నర్సింహరావు, మనోహర్‌రావు, ఉత్తమ్‌రాజ్ వికాస్‌తోపాటు బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పింగిళి కళాశాలలో ఉగాది వేడుకలు

వడ్డెపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో తెలుగు విభాగం, సాంస్కృతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉగాది వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఎస్.మధు, సమన్వయకర్త లక్ష్మీకాంతం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు రత్నమాల, సురేష్‌బాబు, అరుణ, సునిత, రాజేశ్వరి, మమత, సుజాత, పద్మ, సారంగపాణి, రామకృష్ణారెడ్డి, బండి యుగంధర్, భాస్కర్ పాల్గొన్నారు.

## టీపీడీఈఏ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



నక్కలగుట్టలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ (టీపీడీఈఏ) ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం సీఎండీ ప్రారంభించారు. ప్రతీ నెల 16 సర్కిళ్ల పరిధిలో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న దాదాపు 3000 మంది అనాథలు, వికలాంగులు, వృద్ధులు, వితంతులకు సహాయం చేయడం ఉద్యోగుల ఉదారతకు చిహ్నమన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్ లాల్, మధుసూదన్, సీజీఎంలు రవీంద్రనాథ్, వెంకటరమణ, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్, టీపీడీఈఏ రాష్ట్ర, కంపెనీ బాధ్యులు బీసీ రెడ్డి, సుబ్రమణేశ్వర్‌రావు, సలహాదారుడు మధుసూదన్, ఎస్.నరేందర్, మల్లిఖార్జున్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల కోసం ఆదివాసీలు ఉద్యమించాలి

వడ్డెపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హక్కుల కోసం ఆదివాసీలు ఉద్యమించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ సిద్దబోయిన లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో నిర్వహించిన తుడుందెబ్బ వరంగల్ ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయనతోపాటు కో కన్వీనర్ ఆగబోయిన రవి మాట్లాడారు. ఆదివాసీ ప్రాంతాల్లో వనరులను కార్పొరేట్ సంస్థలు దోపిడీ చేయకుండా అరికట్టాలని అన్నారు. అడవిపై ఆదివాసీలకే హక్కు కల్పించాలని, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడీలు, బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఏప్రిల్ 12,13,14 తేదీల్లో కొమురం భీం అసిఫాబాద్ జిల్లా కెరమేరి మండలం ఆదివాసీల యుద్ధ వీరుడు కొమురం భీం అసువులు బాసిన జోడెన్ ఘాట్‌లో తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలకు నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలకు ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. మహా సభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా నాయకులు సోయం రాజేందర్, సోయం భిక్షపతితో పాటు ఆదివాసీ విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

## నూతన ఎక్సైజ్ స్టేషన్‌కు ఏర్పాట్లు

హసన్‌పర్తి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ టీటీడీసీ కార్యాలయం భవనంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సంస్కృతి విహార్‌లో నూతన ఎక్సైజ్‌స్టేషన్ కోసం కేటాయించిన భవనానికి ఎక్సైజ్ శాఖ అధికారులు బోర్డును కూడా ఏర్పాటు చేశారు. తెలంగాణలో 14 నూతన ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం విదితమే. దీనికి సంబంధిత ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రజ్వీ, కమిషనర్ చెర్వూరు హరికిరణ్‌లు ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త స్టేషన్‌ల ద్వారా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేస్తూ అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వరంగల్ జిల్లా హసన్‌పర్తి సంసకృతి విహార్, టీటీడీసీ భవన సముదాయంలో ఒక భవనాన్ని తీసుకొని బోర్డు ఏర్పాటుచేశారు.



సంస్కృతి విహార్‌లో ఏర్పాటవుతున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్

# సనాతన ధర్మానికి ప్రతీక పంచాంగం

హనుమకొండ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మానికి పంచాంగం ప్రతీకలని, ప్రతియేట ఉగాది పర్వదిన వేళ ఆవిష్కరింపజేసుకునే పంచాంగాల విలువ వెలకట్టలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. కుమార్‌పల్లిలోని షైన్‌షైన్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీ లలిత పంచరత్న పంచాంగాన్ని పలువురు ఆవిష్కరించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ గజ్జెల రాజుభరత్, తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, ప్రొఫెసర్ ఎ.విజయ్‌బాబు, మామునూరు ఏసీపీ బొంపెల్లి తిరుపతి, తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్య, డాక్టర్ అనసూరి చంద్రమౌళి తదితర ప్రముఖులు పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. సమాజం మంచిచెడుల విశ్లేషణ, సనాతన ధర్మాన్ని ఎలా ఆచరించాలో పంచాంగం తెలియజేస్తుందన్నారు. ఈసందర్భంగా బేతోజు సత్యనారాయణ సిద్ధాంతి, కట్ట వెంకటమధుసూదనాచార్యులు సిద్ధాంతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులు, ఉద్యోగ, వ్యాపారవేత్తలు, రచయితలను 150మందిని గుర్తించి ఉగాది పురస్కారాలను ప్రదానం చేసినట్లు చొల్లేటి కృష్ణమాచార్య చెప్పారు. డాక్టర్ వలబోజు మోహన్‌రావు స్వాగతం పలుకగా రావులకొలను రాంమూర్తి గణపతి విశ్వకర్మ ప్రార్థన, ఉప్పుల విజయ్ ఆలపించిన సామాజిక గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజభరత్, గంగు ఉపేంద్రశర్మ, ప్రొఫెసర్ విజయ్‌బాబు

## పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శ్రమదానం

మడికొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మడికొండలోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు ఆధ్వర్యంలో శనివారం పోలీసులు శ్రమదానం నిర్వహించారు. ఈసందర్భంగా సెంటర్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సీటీసీఆర్ఐ, ఎస్సైలు, ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నవరాత్రి వేడుకలు ప్రారంభం

హనుమకొండ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న శ్రీ సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలకు ఆలయంలో శ్రీ సీతారామ ఉత్సవాలను శోభాయమానంగా అలంకరింపజేసి సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రం విశ్వావసు ఉగాది వేడుకల పర్వంలో భాగంగా వైష్ణవ పాంచరాత్ర ఆగమానుసారం కలష స్థాపన, కాళికాపూజ, రుత్వికరణ, అంకురారోపణతో వేడుకలు ప్రారంభింపజేస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఉత్సవాలను ప్రారంభిస్తారని ఈవో అనిల్ కుమార్ తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని విస్మరించింది

- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నాయకులకు ఇఫ్తార్ విందు, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు అనుసరించే కఠోర ఉపవాసం వారి జీవన విధానంలో గొప్ప మార్పులకు దోహదపడుతుందని అన్నారు. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీల అభ్యున్నతికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నయీమొద్దీన్, ఖుద్దూస్, ఖలీల్, ఖదీర్, సోని, గౌస్‌ఖాన్, ఇస్మాయిల్, ముర్తజ, మహ్మద్ ఫరూక్, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు రంజిత్‌రావు, సోదా కిరణ్, పులి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

## వ్యక్తిని కాపాడిన పోలీసులు

మడికొండ, మార్చి29(ఆంధ్రజ్యోతి):కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన సందీప్‌రెడ్డి ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఇదే విషయమై తీవ్ర మనస్తాపానికి గురై శనివారం ఆత్మహత్య చేసుకుంటానని అంటూ ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. అతడి సోదరుడు పుల్యాల భూపాల్‌రెడ్డి భయాందోళనకు గురై డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. స్పందించిన మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఎస్సై రాజ్‌కుమార్, పోలీసులతో ఆధునిక టెక్నాలజీ సహాయంతో సందీప్ రెడ్డి ఆచూకీ తెలుసుకున్నారు. జఫర్‌గఢ్‌లో ఉన్నట్లు సమాచారం తెలుసుకొని వెంటనే వెళ్లి అతడిని తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్, ఎస్సై, కానిస్టేబుళ్లను పలువురు అభినందించారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

వడ్డెపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ అంబేద్కర్ రోడ్డులోని రాజాజీ నగర్‌లోని టీడీపీ మినీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ పశ్చిమ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ మెంబర్ ఎం.డి.రహీమ్ ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం హనుమకొండ పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకొని అక్కున చేర్చుకున్నది తెలుగుదేశం పార్టీయేనని అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని నినదించిన ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు బర్ల యాకూబ్, కుసుమ శ్యాంసుందర్, పోతరాజు అనిల్‌కుమార్, మాడగాని మనోహర్, అనిశెట్టి సతీష్, బైరి శేషాద్రి, నాగవెల్లి సురేష్, కొంగర ప్రభాకర్, బింగి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

- కాజీపేట: కాజీపేట బాపూజీనగర్‌లోని కార్యాలయంలో శనివారం టీడీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాలకు, రైతులకు, కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రారంభించడంలో టీడీపీ ఆదర్శమన్నారు. తెలుగు జాతి ఎన్టీఆర్‌ను ఎప్పటికీ మరువదన్నారు. కార్యక్రమంలో నాయకులు కాలమాల మహేందర్, జవ్వాజి నరేందర్, గాజుల నరేందర్, రాము, వినయ్, వెంకటేశ్, రాజేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్లాబ్ సిస్టం రిబేట్ కొనసాగింపుతో గ్రానైట్ పరిశ్రమకు జీవం

మడికొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రానైట్ పరిశ్రమల శ్లాబ్ సిస్టమ్ రిబేట్‌ను ప్రభుత్వం కొనసాగించడంతో గ్రానైట్ పరిశ్రమలకు జీవం పోసినట్లయిందని వరంగల్ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రధర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి గ్రానైట్ పరిశ్రమలదారులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మడికొండలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చక్రధర్‌రెడ్డి మాట్లాడారు. టైల్స్ పోటీతో గ్రానైట్ పరిశ్రమ కుదేలైందన్నారు. గ్రానైట్ ఉత్పత్తి సగానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ తాము ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు, పన్నులు చెల్లిస్తూ అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. గ్రానైట్ పరిశ్రమకు పదేళ్లుగా ఎలాంటి ప్రోత్సాహకాలు రాలేదని, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, సబ్సిడీలు సకాలంలో అందిస్తే కాస్త ఊపిరి అందించినట్లవుతుందన్నారు. అలాగే క్వారీలకు సంబంధించిన లీజులు కానీ, పర్యావరణ అనుమతులు గానీ.. సరళతరం చేసినట్లయితే కొత్తగా క్వారీలు ఏర్పాటై గ్రానైట్ పరిశ్రమలకు విరివిగా ముడి సరుకు లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా పరిశ్రమలు లాభాల్లో నడిచి ప్రభుత్వానికి కూడా ఆదాయం లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఇండస్ట్రియల్ ఏరియా ప్రక్కనే గల డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగ వల్ల ఇక్కడే ఉండి పని చేసే వలస కూలీలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపక పోతే భవిష్యత్తులో ఇండస్ట్రియల్‌లో పనిచేయడానికి ఒక్కరు కూడా ముందుకు వచ్చే పరిస్థితి లేదని వెంటనే ప్రభుత్వం డంపింగ్ యార్డును ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి జి.శరబంది, ఉపాధ్యక్షులు వి.వాసుదేవరెడ్డి, విజయ్‌సోని, కోశాధికారి రమేష్‌కుమార్, కార్యదర్శులు కె. కరమ్‌చంద్, కె. సయీదుల్ హసన్, సభ్యులు సీహెచ్. విజ్ఞాన్, జె. ప్రణయ్‌కుమార్, జి.చక్రవర్తి, వై.మధుసూదన్‌రెడ్డి, జె.కాశిరెడ్డి, బి.పి.ఎస్.రెడ్డి, రాధేశ్యాందయాల్, అభిషేక్ తోషినివాల్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండ ఇండస్ట్రియల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ గజ్జుల వసంత మహేందర్‌రెడ్డి

జూలైవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని 59వ డివిజన్ కార్పొరేటర్ గజ్జుల వసంత మహేందర్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం భవానీనగర్‌లో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను, డ్రెయినేజీ కాల్వలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాజారెడ్డి, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, జవాన్ భిక్షపతి, కమిటీ సభ్యులు ప్రేమాకర్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్, భాస్కర్, జనార్దన్‌రావు, రాంరెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో యువత ముందుండాలి

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో యువత ముందుండాలని కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ ఉద్బోధించారు. శనివారం కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) యూనిట్-1, 2 నేతృత్వంలో విద్యార్థులు కళాశాల ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. కళాశాల ఆవరణలోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ దాసరి శైలజ, మామిడాల సౌజన్యల నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజ అభివృద్ధికి యువత ముందుకు రావాలని అన్నారు. యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని చెప్పారు. యువత క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని అన్నారు. సమాజంలో ఎక్కువ మందిని ప్రభావితం చేసేది యువతేనని అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ దాసరి శైలజ, మామిడాల సౌజన్య మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేసి కళాశాల ఆవరణం శుభ్రం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, బీటెక్ నాలుగో ఏడాది ఈసీఈ, ఈఈఈ, సీఎస్ఈ స్టూడెంట్స్, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

**నేటి మ్యాచ్‌లు**

| | | |
|---|---|---|
| ఢిల్లీ x హైదరాబాద్ | వేదిక విశాఖపట్నం | మ.3.30 నుంచి |
| రాజస్థాన్ x చెన్నై | వేదిక: గువాహటి | రా.7.30 నుంచి |

# గుజరాత్ ఘనంగా..

- సొంత మైదానంలో బోణీ
- ముంబైకి రెండో ఓటమి
- సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ
- కట్టడి చేసిన బౌలర్లు



సాయి సుదర్శన్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 63)

**2** ఒకే వేదిక (అహ్మదాబాద్)లో తక్కువ ఇన్నింగ్స్ (20)లోనే వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా గిల్. క్రిస్ గేల్ (బెంగళూరు, 19) ముందున్నాడు.

**అహ్మదాబాద్:** సొంత మైదానంలో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 63) తన అద్భుత ఫామ్‌ను చాటుకోగా.. బౌలింగ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ (2/18), సిరాజ్ (2/34) ప్రత్యర్థిని కట్టడి చేశారు. దీంతో శనివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 పరుగుల తేడాతో నెగ్గి టైటాన్స్ బోణీ చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. బట్లర్ (39), గిల్ (38) రాణించారు. హార్దిక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులు చేసి ఓడింది. సూర్యకుమార్ (48), తిలక్ వర్మ (39) మాత్రమే ఆకట్టుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ప్రసిద్ధ్ నిలిచాడు.

**బౌలర్ల హవా:** ఈ పిచ్‌పై క్లిష్టమైన ఛేదనకు బరిలోకి దిగిన ముంబై పేలవ ప్రదర్శన కనబర్చింది. ఆరంభం నుంచే వీరిని టైటాన్స్ బౌలర్లు కట్టడి చేశారు. సూర్య, తిలక్ మినహా ఎవరూ నిలువలేకపోయారు. తొలి ఓవర్‌లోనే పేసర్ సిరాజ్ గట్టి ఝలక్ ఇచ్చాడు. రెండు వరుస ఫోర్లతో జోరు కనబర్చిన ఓపెనర్ రోహిత్ (8)ను ఓ అద్భుత బంతికి బౌల్డ్ చేశాడు. ఇక వచ్చీ రాగానే తిలక్ 4,4,6తో 15 రన్స్ రాబట్టినా.. అటు సిరాజ్ మరో ఓపెనర్ రికెల్టన్ (6)ను సైతం బౌల్డ్ చేశాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు కేవలం 48/2 స్కోరుతో నిలిచింది. ఈ దశలో తిలక్-సూర్య జోడీ కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. 8వ ఓవర్‌లో తిలక్ ఫోర్, సూర్య సిక్స్‌తో 15 రన్స్ వచ్చాయి. వీరు క్రీజులో ఉన్నంతసేపు ముంబై పోటీలో ఉన్నట్టు కనిపించింది. కానీ మధ్య ఓవర్లలో స్పిన్నర్లు రషీద్, సాయికిషోర్‌లతో పాటు పేసర్ ప్రసిద్ధ్ అద్భుత బౌలింగ్‌తో ఇబ్బందిపెట్టారు. వీరి ఓవర్లలో భారీ షాట్లు ఆడడం ముంబైకి కష్టమైంది. స్వల్ప వ్యవధిలోనే తిలక్, సూర్యలను ప్రసిద్ధ్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 62 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక రాబిన్ మింజ్ (3) రెండో మ్యాచ్‌లోనూ విఫలం కాగా.. కెప్టెన్ హార్దిక్ (11) సైతం సహజశైలిలో ఆడలేక 17వ ఓవర్‌లో రబాడకు చిక్కాడు. చివర్లో నమన్ (18 నాటౌట్), శాంట్నర్ (18 నాటౌట్) వేగం ఓటమి అంతరాన్ని తగ్గించేందుకు ఉపయోగపడింది. అయినా ఆఖరి ఓవర్‌లో 46 పరుగులు అవసరం కావడంతో ముంబై ఓటమి ఖాయమని తేలింది.

**సుదర్శన్ నిలకడ:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో టాపార్డర్ మెరుగ్గా రాణించింది. ఓపెనర్లు గిల్, సాయి సుదర్శన్‌ల మెరుపు ఆట కారణంగా తొలి వికెట్‌కు 78 పరుగులు జత చేరాయి. ఆరంభంలో సుదర్శన్ వేగం కనబర్చుతూ ఐదో ఓవర్‌లో 4,6,4తో 15 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో గిల్ 6,4తో 20 రన్స్ రావడంతో పవర్‌ప్లేలో గుజరాత్ 66 పరుగులతో పటిష్టంగా కనిపించింది. కానీ ఆ తర్వాత ముంబై బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు నెమ్మదించాయి. గిల్‌ను తొమ్మిదో ఓవర్‌లో హార్దిక్ అవుట్ చేశాడు. అటు సాయి ఆటలోనూ జోరు తగ్గింది. పదో ఓవర్‌లో బట్లర్ 6,4తో స్కోరులో కదలిక తెచ్చాడు. అయితే ఊపు మీదున్న బట్లర్‌ను 14వ ఓవర్‌లో స్పిన్నర్ ముజీబ్ వెనక్కి పంపడంతో రెండో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే సుదర్శన్ 33 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఈ మైదానంలో అతడికి వరుసగా నాలుగో ఫిఫ్టీ కావడం విశేషం. ఇక హార్దిక్ స్లో బాల్‌కు షారుక్ (9) వెనుదిరగగా.. 17వ ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ (18), సుదర్శన్‌ల ఒక్కో సిక్సర్‌తో 19 రన్స్ సమకూరాయి. దీంతో జట్టు స్కోరు 200 ఖాయమనిపించింది. కానీ చివరి మూడు ఓవర్లలో రూథర్‌ఫోర్డ్, సుదర్శన్ సహా మరో ముగ్గురు అవుటవడంతో గుజరాత్ డబుల్ సెంచరీ ఫీట్‌ను కొద్దిలో మిస్సయింది.

## ఆకట్టుకున్న రాజు

ఐపీఎల్‌లో తొలిసారి ఆడుతున్న తెలుగు కుర్రాడు సత్యనారాయణ రాజు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆకట్టుకున్నాడు. ముంబై తరఫున గత మ్యాచ్‌లో ఓ ఓవర్ వేసి 13 పరుగులే ఇచ్చిన కాకినాడ పేసర్ రాజు.. గుజరాత్‌తో పోరులో మూడు ఓవర్లు వేసి ఓ వికెట్ (రషీద్) పడగొట్టాడు.



రాజుకు రోహిత్ అభినందన

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 2 | 2 | 0 | 0 | 4 | 2.266 |
| లఖ్‌నవూ | 2 | 1 | 1 | 0 | 2 | 0.963 |
| గుజరాత్ | 2 | 1 | 1 | 0 | 2 | 0.625 |
| పంజాబ్ | 1 | 1 | 0 | 0 | 2 | 0.550 |
| ఢిల్లీ | 1 | 1 | 0 | 0 | 2 | 0.371 |
| హైదరాబాద్ | 2 | 1 | 1 | 0 | 2 | -0.128 |
| కోల్‌కతా | 2 | 1 | 1 | 0 | 2 | -0.308 |
| చెన్నై | 2 | 1 | 1 | 0 | 2 | -1.013 |
| ముంబై | 2 | 0 | 2 | 0 | 0 | -1.163 |
| రాజస్థాన్ | 2 | 0 | 2 | 0 | 0 | -1.882 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

**స్కోరుబోర్డు**

**గుజరాత్:** సాయి సుదర్శన్ (ఎల్బీ) బౌల్ట్ 63, గిల్ (సి) నమన్ (బి) హార్దిక్ 38, బట్లర్ (సి) రికెల్టన్ (బి) ముజీబ్ 39, షారుక్ ఖాన్ (సి) తిలక్ (బి) హార్దిక్ 9, రూథర్‌ఫర్డ్ (సి) శాంట్నర్ (బి) చాహర్ 18, తెవాటియా (రనౌట్) 0, రషీద్ (సి) హార్దిక్ (బి) సత్యనారాయణ రాజు 6, రబాడ (నాటౌట్) 7, సాయి కిషోర్ (రనౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 196/8; వికెట్ల పతనం:** 1-78, 2-129, 3-146, 4-179, 5-179, 6-179, 7-194, 8-196; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-34-1, దీపక్ చాహర్ 4-0-39-1, ముజీబుర్ రెహ్మాన్ 2-0-28-1, హార్దిక్ పాండ్యా 4-0-29-2, శాంట్నర్ 3-0-25-0, సత్యనారాయణ రాజు 3-0-40-1.

**ముంబై:** రోహిత్ (బి) సిరాజ్ 8, రికెల్టన్ (బి) సిరాజ్ 6, తిలక్ (సి) తెవాటియా (బి) ప్రసిద్ధ్ 39, సూర్యకుమార్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 48, రాబిన్ విన్స్ (సి) ఇషాంత్ (బి) సాయి కిషోర్ 3, హార్దిక్ (సి) సిరాజ్ (బి) రబాడ 11, నమన్ ధిర్ (నాటౌట్) 18, శాంట్నర్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 160/6; వికెట్ల పతనం:** 1-8, 2-35, 3-97, 4-108, 5-120, 6-124; **బౌలింగ్:** సిరాజ్ 4-0-34-2, రబాడ 4-0-42-1, ఇషాంత్ 2-0-17-0, రషీద్ 2-0-10-0, సాయి కిషోర్ 4-0-37-1, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-18-2.

## జోరు సాగాలని..

### వైజాగ్‌లో సన్‌రైజర్స్‌తో క్యాపిటల్స్ ఢీ

**విశాఖపట్నం:** సాగర తీరాన మరో హోరాహోరీ ఐపీఎల్ పోరుకు వేళైంది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది. వైజాగ్‌ను రెండో సొంత మైదానంగా ఎంచుకున్న ఢిల్లీ..లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో ఉత్కంఠగా జరిగిన తొలి పోరులో ఒక వికెట్‌తో గెలిచింది. ఈ గెలుపుతో ఆత్మవిశ్వాసం కూడగట్టుకున్న ఢిల్లీ..అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. పైగా..స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ జట్టులో చేరడంతో క్యాపిటల్స్ బ్యాటింగ్ మరింత పటిష్టమైంది. మరోవైపు సొంతగడ్డ ఉప్పల్‌లో..రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో బ్యాటర్లు చెలరేగడంతో ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరుతో హైదరాబాద్ భళా అనిపించింది. బ్యాటర్లతోపాటు బౌలర్లూ సత్తా చాటడంతో ఘనమైన బోణీ కొట్టింది. కానీ ఉప్పల్‌లోనే లఖ్‌నవూతో జరిగిన రెండో మ్యాచ్‌లో 5 వికెట్లతో ఓడిన సన్‌రైజర్స్. నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఢిల్లీతో జరిగే పోరులో బలంగా పుంజుకోవాలని హైదరాబాద్ పట్టుదలగా ఉంది.

## నవీన డబుల్ ధమాకా



**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఫెడరేషన్ కప్ జాతీయ వుషు చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన వడ్డేపల్లి నవీన రెండు పతకాలు కొల్లగొట్టింది. చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఈ టోర్నీలో నవీన.. ట్రెడిషనల్ నాన్ క్యాన్ విభాగంలో రజతం, ట్రెడిషనల్ వెపన్ కేటగిరీలో కాంస్యం సాధించింది.

## ఫైనల్లో జొకోవిచ్, మెన్సిక్

**మియామీ గార్డెన్స్ (ఫ్లోరిడా):** టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ మియామీ ఓపెన్‌లో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచాడు. సింగిల్స్ సెమీఫైనల్లో 4వ సీడ్ జొకోవిచ్ 6-2, 6-3తో దిమిత్రోవ్ (బల్గేరియా)ను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఆదివారం జరిగే తుదిపోరులో 19 ఏళ్ల అన్‌సీడెడ్ జాకుబ్ మెన్సిక్ (చెక్ రిపబ్లిక్)తో జొకో తలపడనున్నాడు. మరో సెమీస్‌లో జాకుబ్ 7-6(7/4), 4-6, 7-6(7/4)తో మూడో సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌ను చిత్తుచేశాడు.

## ఆ క్రికెటర్లు గౌరవానికి అర్హులు!



రోహిత్ సంచలన వ్యాఖ్యలు

**ముంబై:** ఈ వ్యాఖ్యలు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఎందుకు చేశాడో తెలియదుకానీ..దేశ క్రికెట్ వర్గాల్లో మాత్రం సంచలనంగా మారాయి. గత మూడు పరిమిత ఓవర్ల ఐసీసీ టోర్నమెంట్లలో..భారత్ 24 మ్యాచ్‌లు ఆడితే ఒకదాంట్లోనే ఓడింది. ఆ ఒక్క ఓటమి భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైంది. ఇక..ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత్.. గత జూన్‌లో టీ20 ప్రపంచ కప్ నెగ్గింది. ఈ మధ్యలో స్వదేశంలో న్యూజిలాండ్‌పై, ఆస్ట్రేలియాలో ఆ జట్టు చేతిలో టెస్ట్ సిరీస్‌లు కోల్పోయింది. దీంతో రోహిత్‌పై వచ్చిన విమర్శలు అన్నీఇన్నీ కావు. ఓ దశలో..కెప్టెన్సీ బాధ్యతలనుంచి అతడిని తప్పించాలన్న డిమాండ్లు వినిపించాయి. ఈ పరిణామాలన్నీ రోహిత్‌ను నొప్పించాయేమో! 'ఐసీసీ టోర్నీల్లో 24 మ్యాచ్‌ల్లో 23 గెలవడం ఆషామాషీకాదు. బయట నుంచి చూస్తే ఈ విజయాలు ఎంతో సంతోషంగా కనిపిస్తాయి. కానీ ఈ క్రమంలో జట్టు ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసింది. ఈ మూడు ఐసీసీ టోర్నీల్లో పాల్గొన్న జట్టు సభ్యులంతా గౌరవానికి అర్హులు. నా 18 ఏళ్ల కెరీర్‌లో చవిచూసిన జయాపజయాలు నాకెన్నో పాఠాలు నేర్పాయి. గత 9 నెలలు అందుకు భిన్నం కాదు' అని ముంబై ఇండియన్స్ 'ఎక్స్'లో పోస్ట్ చేసిన వీడియోలో రోహిత్ అన్నాడు. దాంతో రోహిత్ ఈ వ్యాఖ్యల వెనుక మర్మమేమిటన్న చర్చ బయలుదేరింది. ఇటీవల ఎదురైన విమర్శలను దృష్టిలో ఉంచుకొని హిట్‌మ్యాన్ ఆ విధంగా అన్నాడని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే..రోహిత్ టెస్ట్ సిరీస్ భవితవ్యంపై సెలెక్టర్లు చర్చించనున్నారనే వార్తల నేపథ్యంలో అతడు ఆ విధంగా వ్యాఖ్యానించాడని మరికొందరంటున్నారు.

## శరత్.. ఓటమితో వీడ్కోలు



**చెన్నై:** భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ కెరీర్ ప్రస్థానం ముగిసింది. తాను చివరిసారిగా తలపడిన డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీలో శరత్ ఓటమి పాలయ్యాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో తెలుగు ఆటగాడు స్నేహిత్ 11-9, 11-8, 11-9తో శరత్‌పై గెలుపొందాడు. దీంతో 42 ఏళ్ల శరత్ కెరీర్ పరాజయంతో ముగిసినట్లయింది. ఈ టోర్నీనే తనకు ఆఖరిదని శరత్ ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. 'ఆటగాడిగా నా కథ ముగిసింది. ఇక.. పరిపాలకునిగా, కోచ్‌గా, మెంటార్‌గా ఇలా.. ఏదైనా పాత్రలో ఒదిగిపోవాలనుకుంటున్నా' అని శరత్ తన వీడ్కోలు ప్రసంగంలో వెల్లడించాడు. కాగా, ప్రీక్వార్టర్స్‌లో శరత్‌పై నెగ్గిన స్నేహిత్ క్వార్టర్స్‌లో పొరెట్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు.

## కివీస్‌దే బోణీ

**తొలి వన్డేలో పాక్ ఓటమి**

**నేపియర్:** న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను కూడా పాకిస్థాన్ ఓటమితోనే ఆరంభించింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో మార్క్ చాప్‌మన్ (132) శతక సహాయంతో ఆతిథ్య కివీస్ 73 పరుగులతో గెలిచింది. ఇప్పటికే పాక్ ఐదు టీ20ల సిరీస్‌ను 4-1తో ఓడిన విషయం తెలిసిందే. ముందుగా కివీస్ 50 ఓవర్లలో 344/9 స్కోరు సాధించింది. మిచెల్ (76), మహమ్మద్ అబ్బాస్ (52) అర్ధసెంచరీలు చేశారు. భారీ ఛేదనలో పాక్ 44.1 ఓవర్లలో 271 రన్స్‌కే పరిమితమైంది. బాబర్ (78), సల్మాన్ ఆఘా (58) రాణించారు. నాథన్ స్మిత్‌కు 4, డఫీకి 2 వికెట్లు దక్కాయి. పాక్ మూలాలున్న అబ్బాస్ ఈ మ్యాచ్‌లో కివీస్ తరఫున అరంగేట్రం చేశాడు. 24 బంతుల్లోనే ఫిఫ్టీ బాదిన అబ్బాస్.. అరంగేట్ర వన్డే మ్యాచ్‌లో వేగవంతమైన అర్ధసెంచరీ చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో 2021లో ఇంగ్లండ్‌పై 26 బంతుల్లోనే ఫిఫ్టీ కొట్టిన టీమిండియా ఆల్‌రౌండర్ క్రునాల్ పాండ్యా రికార్డును అధిగమించాడు.

## కొత్త ఆర్థిక సంవత్సరంలో కీలక పన్ను మార్పులు..

మీరు పన్ను చెల్లింపుదారా..? ఏటా ఆదాయ పన్ను రిటర్నులు సమర్పిస్తున్నారా..? అయితే, కొత్త ఆర్థిక సంవత్సరంలో అమల్లోకి రానున్న కీలక పన్ను మార్పులను తప్పక తెలుసుకోవాల్సిందే..

**రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేదు:** కొత్త పన్ను విధానంలో సెక్షన్ 87ఏ కింద లభించే పన్ను రిబేటును రూ.25,000 నుంచి రూ.60,000కు పెంచుతున్నట్లు 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంటే, రూ.12 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారికి (వేతన జీవులైతే, స్టాండర్డ్ డిడక్షన్ వెసులుబాటుతో రూ.12.75 లక్షల వరకు ఆదాయంపై) పన్ను చెల్లింపుల నుంచి పూర్తిగా ఊరట లభించనుంది.

**టీడీఎస్ నిబంధనలో మార్పులు:** చిన్న మొత్తాల్లో పన్ను చెల్లించే వారికి ఊరట కల్పించేందుకు ఏప్రిల్ 1 నుంచి ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్) పరిమితిని పెంచింది ప్రభుత్వం. ఉదాహరణకు సీనియర్ సిటిజన్లకు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ వర్తింపు పరిమితి రూ.లక్షకు పెరగనుంది. అంటే, వార్షిక వడ్డీ ఆదాయం రూ.లక్ష మించితేనే టీడీఎస్ వర్తిస్తుంది.

**టీసీఎస్ నిబంధనలో మార్పు:** వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) పరిమితి కూడా పెరగనుంది. ఇది విదేశీ ప్రయాణాలు, పెట్టుబడులు, ఇతర లావాదేవీలను ప్రభావితం చేయనుంది. ప్రస్తుతం రూ.7 లక్షలకు పైగా విదేశాలకు పంపే సొమ్ముపై ఏ అవసరం కోసం పంపుతున్నారన్న ఆధారంగా 0.5 శాతం నుంచి 20 శాతం వరకు టీసీఎస్ చెల్లించాల్సి ఉంటుంది. వచ్చే నెల నుంచి ఈ పరిమితి రూ.10 లక్షలకు పెరగనుంది.

**అప్‌డేటెడ్ ఐటీ రిటర్నుల ఫైలింగ్‌కు మరింత సమయం:** ఇకపై అప్‌డేటెడ్ ఐటీ రిటర్నుల ఫైలింగ్‌కు 48 నెలల (4 ఏళ్ల) వరకు గడువు లభించనుంది. ప్రస్తుతం ఇది 12 నెలలు (ఏడాది)గా ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఏ కారణంగానైనా రిటర్ను సమర్పించలేకపోయినట్లయితే, దాన్ని అప్‌డేట్ చేసేందుకు నాలుగేళ్ల వెసులుబాటు లభించనుంది.

## బిజినెస్ ప్లస్

# 30, 40, 50 ఏళ్లలో రిటైర్మెంట్ ప్రణాళిక ఇలా..

### ఆలస్యమైనా ఆరంభించడం ఎంతో ముఖ్యం

జీవితంలో మలి దశ ఆర్థిక అవసరాలను సమకూర్చుకునేందుకు వీలైనంత త్వరగా రిటైర్మెంట్ ప్రణాళికను ప్రారంభించడం మేలు. ఈ ప్లానింగ్‌లో ఏటేటా పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, ఆయుర్దాయం వంటి అంశాలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే రిటైర్మెంట్ అనంతర జీవితానికి తగినన్ని నిధులను పోగేయగలం. కానీ, తక్కువ ఆదాయం, కుటుంబ వ్యయ భారం వంటి సవాళ్ల కారణంగా చాలా మంది కెరీర్ ప్రారంభం నుంచే రిటైర్మెంట్ ప్లానింగ్‌కు శ్రీకారం చుట్టలేకపోతున్నారు. ఆలస్యమైనా ఫర్వాలేదు.. ఏదో ఒక దశలో మొదలుపెట్టడం చాలా ముఖ్యం. అవసరం కూడా. మరి 30, 40, 50 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రణాళిక ప్రారంభించే వారు అనుసరించాల్సిన వ్యూహాలేంటో తెలుసుకుందాం..



**30 లో..**

ముప్పై ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు మీ నెలవారీ ఖర్చులు రూ.30,000 అనుకుందాం. ఏటా 5 శాతం చొప్పున పెరుగుతూ పోతుంటే, మీరు రిటైర్ అయ్యేనాటికి మీ నెలవారీ ఖర్చులు రూ.1.33 లక్షలకు చేరుకోవచ్చు. పర్యవసానంగా రిటైర్ అయిన తొలి ఏడాదిలో మీకు ఖర్చులకు రూ.16 లక్షలు అవసరమవుతాయి. 5 శాతం ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మీకు 80 ఏళ్లు వచ్చేవరకు మొత్తం రూ.5.3 కోట్లు అవసరం. కాబట్టి, మీరు దీర్ఘకాలంలో అధిక రిటర్నులు అందించేందుకు అవకాశాలున్న ఈక్విటీలు, ఈక్విటీ ఫండ్లలో పెట్టుబడులు పెట్టడం మేలు. ఉదాహరణకు, 30 ఏళ్ల వయసులో ఈక్విటీ ఫండ్‌లో నెలకు రూ.2,000తో సిప్ (క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక) ప్రారంభించి, ఏటా ఈ మొత్తాన్ని 10 శాతం చొప్పున పెంచుకుంటూ పోతే, రిటైర్మెంట్ అనంతర అవసరాలను సమకూర్చుకునేందుకు వీలుంటుంది. రిటైర్మెంట్ నాటికి ఫండ్‌లో మీరు మొత్తం రూ.40 లక్షల పెట్టుబడి పెడతారు. మీ పెట్టుబడులపై ఏటేటా 15 శాతం చొప్పున రిటర్నులతో కలిపి మీ ఫండ్ మొత్తం విలువ రిటైర్మెంట్ నాటికి రూ.2.53 కోట్ల వరకు చేరుకోగలదు. రిటైర్మెంట్ అనంతరం, సిప్ నుంచి ఎస్‌డబ్ల్యూపీ (క్రమానుగత ఉపసంహరణ ప్లాన్)కు మారాలి. మీ ఫండ్ నుంచి 20 ఏళ్ల పాటు నెలకు రూ.1.33 లక్షల చొప్పున సొమ్మును విత్‌డ్రా చేసుకుంటూ పోవాలి. విత్‌డ్రా సొమ్మును ఏటా 10 శాతం చొప్పున పెంచుకోవచ్చు. రిటైర్మెంట్ అనంతరం 20 ఏళ్ల పాటూ మీ ఫండ్ ఏటా 15 శాతం చొప్పున పెరిగితే, నెలనెలా డబ్బును ఉపసంహరించుకున్నప్పటికీ, మీకు 80 ఏళ్లు వచ్చేసరికి మీ ఫండ్‌లో రూ.8 కోట్ల వరకు మిగిలి ఉండే అవకాశం ఉంటుంది.

**40 లో..**

ఈ వయసులో మీ నెల ఖర్చులు రూ.40,000 అనుకుందాం. ద్రవ్యోల్బణాన్నీ పరిగణిలోకి తీసుకుంటే, రిటైర్మెంట్ అయ్యాక తొలి నెలలో మీకు ఖర్చుల కోసం రూ.1.1 లక్షల వరకు అవసరమవుతాయి. అప్పుడు కూడా ఖర్చులు ఏటేటా 5 శాతం చొప్పున పెరిగాయనుకుంటే, రిటైర్మెంట్ అనంతర రెండు దశాబ్దాలకు (60 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వరకు) గాను మొత్తం రూ.4.3 కోట్లు అవసరం. అయితే, రిటైర్మెంట్ ప్రణాళికను 40 ఏళ్లప్పుడు ప్రారంభిస్తున్నందున మీ వద్ద ఎక్కువ సమయం ఉండదు. తక్కువ కాలంలో అధిక సంపద సృష్టికి దూకుడుగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అలాగని, అధిక రిస్క్ కూడా తీసుకోలేరు. కాబట్టి, మార్కెట్ ఆటుపోట్ల నుంచి కొంత రక్షణ కల్పించే బ్యాలెన్స్ అడ్వాంటేజ్ ఫండ్లలో ఎక్కువ మొత్తంలో సిప్ చేయడం మేలు. నెలకు రూ.12,000 చొప్పున, ఏటేటా 10 శాతం పెంచుతూ పోవాలి. మీ ఫండ్ పెట్టుబడులపై ఏటేటా 12 శాతం రిటర్నులు లభించగలిగితే, రిటైర్మెంట్ అనంతర ఆర్థిక అవసరాలను తీర్చుకోగలిగే వీలుంటుంది. మీరు రిటైర్ అయ్యే నాటికి మీ మొత్తం పెట్టుబడి రూ.82.5 లక్షలకు చేరుతుంది. ఏటేటా 12 శాతం రిటర్నులతో కలిపి మీ ఫండ్ మొత్తం విలువ రూ.2.24 కోట్లకు చేరుకుంది. రిటైర్మెంట్ అనంతరం సిప్ నుంచి ఎస్‌డబ్ల్యూపీకి మారడం ద్వారా మీకు నెలవారీగా అవసరమయ్యే రూ.1.1 లక్షల ఖర్చును సమకూర్చుకోవచ్చు. నెలవారీ విత్‌డ్రా సొమ్మును ఏటా 10 శాతం పెంచుకుంటూ పోయినా, 80 ఏళ్లు వచ్చేవరకూ మీ ఆర్థిక అవసరాలను తీర్చుకోగలుగుతారు.

**50 లో..**

నడి వయసులో రిటైర్మెంట్ ప్లానింగ్ అంటే చాలా ఆలస్యమైనట్టే. అయినా, సాధ్యమే. భారీ మొత్తాల్లో రిస్క్ తక్కువగా ఉంటే ఆర్థిక పథకాల్లో పెట్టుబడిగా పెట్టడం ద్వారా రిటైర్మెంట్ కార్పస్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ వయసులో మీ నెలవారీ ఖర్చు రూ.50,000 అనుకుంటే, ఖర్చులు ఏటేటా 5 శాతం పెరుగుతున్నాయనుకుంటే, పదవీ విరమణ అనంతరం మొదటి నెలలో ఖర్చులకు రూ.82,000 అవసరం. 60 ఏళ్ల నుంచి 80 ఏళ్ల ప్రయాణం సాఫీగా సాగాలంటే మొత్తం రూ.3.2 కోట్ల నిధులు కావాలి. ఇందుకోసం బ్యాలెన్స్ అడ్వాంటేజ్ ఫండ్‌లో నెలకు రూ.50,000 చొప్పున సిప్ చేయగలిగితే, ఏటా 12 శాతం రిటర్నులు లభించాయనుకుంటే, 60 ఏళ్ల నాటికి మీ ఫండ్ విలువ రూ.1.64 కోట్లకు చేరుకుంటుంది. పదవీ విరమణ అనంతరం సిప్ నుంచి ఎస్‌డబ్ల్యూపీకి మారి మీ నెలవారీ ఖర్చులను ఫండ్ నుంచి విత్‌డ్రా చేసుకోవచ్చు. విత్‌డ్రా సొమ్మును ఏటేటా 10 శాతం చొప్పున పెంచుకుంటూ పోయినా, మీకు 80 ఏళ్లు నిండే నాటికి మీ ఫండ్‌లో ఇంకా రూ.52 లక్షల వరకు మిగిలి ఉండే అవకాశం ఉంది.

## ఇదీ GST

# ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్.. మరిన్ని విషయాలు..



రాంబాబు గొండాల

గత వారం ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్‌కు సంబంధించి కొన్ని విషయాలు తెలుసుకున్నాం. ముఖ్యంగా ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ అంటే ఏవిటి? దీని కింద ఎవరు రిజిస్ట్రేషన్ తీసుకోవాలి? ఇలాంటి విషయాలు తెలుసుకున్నాం. అయితే ఒక ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ తాను పొందిన క్రెడిట్‌ను వివిధ శాఖల మధ్య ఎలా పంపిణీ చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఉదాహరణకు హైదరాబాద్ కేంద్రంగా లక్ష్మీ సిల్క్స్ అనే ఒక షోరూమ్ ఉంది. ఇది ఒక కంపెనీగా రిజిస్టర్ అయ్యింది. దీనికి హైదరాబాద్‌తో పాటు విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబైల్లో కూడా షోరూమ్‌లు ఉన్నాయి. జీఎస్‌టీ చట్టం ప్రకారం ఈ కంపెనీ తనకు షోరూమ్‌లు ఉన్న అన్ని రాష్ట్రాల్లో కూడా రిజిస్ట్రేషన్ పొందింది. అంటే, ఇవన్నీ ఒకటే పాన్ సంఖ్యతో పొందిన రిజిస్ట్రేషన్స్. ఈ షోరూమ్‌లు అన్నీ కూడా తమకు కావాల్సిన బట్టలు, ఇతర సరుకులను తమ షోరూమ్ పేరు మీదే ఇన్వాయిస్‌లు పొందుతాయి. కాబట్టి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందటంలోనూ, దానిని వాడుకోవటంలోనూ ఎలాంటి ఇబ్బంది లేదు. ఇబ్బంది అంతా కామన్‌గా పొందే సర్వీస్‌లతోనే. ఉదాహరణకు ఆడిటర్లకు చెల్లించే ఫీజు, సాఫ్ట్‌వేర్ కోసం ఖర్చు పెట్టడం, ముఖ్యంగా ప్రకటనలు, ఇతర ప్రకటనల ఖర్చులు. వీటిని ఒకటే శాఖ కోసం ఉపయోగించరు కాబట్టి కంపెనీ ఇంతకు ముందు చెప్పినట్లు ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ కింద రిజిస్ట్రేషన్ పొంది ఇలాంటి ఇన్వాయిస్‌లు అన్నీ ఆ రిజిస్ట్రేషన్ మీద తీసుకోవాలి. ఉదాహరణకు ఈ మార్చి నెలలో రూ.10 లక్షలు ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ కింద క్రెడిట్ పొందారనుకుందాం. దీన్ని వివిధ బ్రాంచీలకు ఎలాం పంపిణీ చేయాలో ఇప్పుడు చూద్దాం.

ముందుగా ఈ బ్రాంచీలకు సంబంధించిన గత ఆర్థిక సంవత్సరపు టర్నోవర్ లెక్కించాలి. అంటే 2023-24 ఆర్థిక సంవత్సరం అన్నమాట. ఇందులో హైదరాబాద్ టర్నోవర్ రూ.12 కోట్లు, విజయవాడ రూ.6 కోట్లు, చెన్నై రూ.6 కోట్లు, ముంబై రూ.3 కోట్లు, బెంగళూరు రూ.3 కోట్లు టర్నోవర్ ఉందనుకుందాం. అంటే మొత్తం టర్నోవర్ రూ.30 కోట్లు. ఇప్పుడు ఈ రూ.10 లక్షలను పంపిణీ చేయటానికి ముందుగా పొందిన సర్వీస్ ఏ శాఖకు సంబంధించినదో తెలుసుకోవాలి. ఉదాహరణకు రూ.10 లక్షల్లో రూ.2 లక్షలకు సంబంధించిన సర్వీస్ కేవలం హైదరాబాద్ బ్రాంచీ కోసం వాడినట్లయితే, ఆ మొత్తాన్ని ఆ బ్రాంచీకే పంపిణీ చేయాలి. అలా కాకుండా ఒకటికి మించిన బ్రాంచీలకు వాడినట్లయితే, టర్నోవర్ ఆధారంగా దామాషా పద్ధతిలో పంచాలి. ఉదాహరణకు కేవలం, హైదరాబాద్, విజయవాడ షోరూమ్స్‌లోనే ఆధునికీకరణ జరిగింది. దానికి సంబంధించి పొందిన క్రెడిట్ రూ.6 లక్షలు అనుకుంటే, టర్నోవర్ ఆధారంగా హైదరాబాద్ శాఖకు రూ.4 లక్షలు, విజయవాడకు రూ.2 లక్షలు పంపిణీ చేయాలి. అలాకాకుండా పొందిన కామన్ క్రెడిట్ అంటే పైన చెప్పుకున్నట్లు మార్కెటింగ్, ఆడిటింగ్, ప్రకటనలు ఇలాంటి వాటికి సంబంధించిన క్రెడిట్ అన్నీ శాఖలకు సంబంధించినది కాబట్టి, ఇదే విధంగా దామాషా పద్ధతిలో టర్నోవర్ ఆధారంగా అన్నీ శాఖలకు పంచాలి.


క్రెడిట్ పంచేటప్పుడు గుర్తు పెట్టుకోవాల్సిన మరొక ముఖ్య విషయం ఏమిటంటే.. క్రెడిట్‌ను ఐజీఎస్‌టీ, సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కింద పంచాలి. అంటే పొందిన క్రెడిట్ ఐజీఎస్‌టీ అయితే అన్ని శాఖలకు ఐజీఎస్‌టీ కింద పంపిణీ చేయాలి. అలాకాకుండా సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ అయితే ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ ఉన్న రాష్ట్రంలోని బ్రాంచీకి సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కింద, మిగిలిన బ్రాంచీలకు ఐజీఎస్‌టీ కింద పంపిణీ చేయాలి.

అంటే పై ఉదాహరణలో ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ రిజిస్ట్రేషన్ అనేది హైదరాబాద్ అడ్రస్ కింద పొంది ఉంటే సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ క్రెడిట్‌ను హైదరాబాద్ బ్రాంచీకి సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ లాగా, మిగిలిన రాష్ట్రాల్లోని బ్రాంచీలకు ఐజీఎస్‌టీ కింద పంపిణీ చేయాలి. ఒకవేళ టర్నోవర్ లెక్కించేటప్పుడు ఏదేనీ శాఖకు గత ఆర్థిక సంవత్సరం ఎలాంటి ఆదాయం లేకున్నా లేదా ఆ శాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరమే ప్రారంభించి ఉన్నా.. బ్రాంచీల టర్నోవర్ కోసం గడచిన ఆర్థిక సంవత్సరం కాకుండా, గడిచిన త్రైమాసికాన్ని తీసుకోవాలి. ఇది ఏ ఒక్క బ్రాంచీకో కాకుండా అన్నీ బ్రాంచీలకు ఇలానే తీసుకోవాలి.

ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, ఏదేనీ ఒక బ్రాంచీకి రిజిస్ట్రేషన్ లేకున్నా కామన్ క్రెడిట్‌ను పంపిణీ చేయటానికి ఆ బ్రాంచీ టర్నోవర్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే క్రెడిట్ పంపిణీ చేసేటప్పుడు అర్హత లేని క్రెడిట్ కూడా ఇదే పద్ధతిలో విడిగా చూపుతూ పంపిణీ చేయాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**




| 30వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 450 | విజయవాడ | 470 |
| వరంగల్ | 452 | గోదావరి | 455 |
| చిత్తూరు | 520 | విశాఖపట్నం | 455 |
| | | డజను గుడ్లు రూ. 60 | |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 131 | విజయవాడ | 137 |
| వరంగల్ | 131 | గుంటూరు | 137 |
| కరీంనగర్ | 131 | ఒంగోలు | 137 |
| మహబూబ్‌నగర్ | 131 | చిత్తూరు | 105 |
| కర్నూలు | 131 | నెల్లూరు | 110 |
| విశాఖపట్నం | 109 | అనంతపురం | 110 |
| గోదావరి | 137 | | |

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 91,200 ▲ | 83,600 ▲ | 1,13,000 ▼ |
| విజయవాడ | 92,500 ▲ | 87,000 ▲ | 1,00,300 ▼ |
| విశాఖపట్నం | 89,290 ▼ | 81,850 ▼ | 1,00,730 ▼ |
| రాజమండ్రి | 91,200 ▲ | 83,600 ▲ | 1,03,700 ▼ |
| ప్రొద్దుటూరు | 91,150 ▲ | 84,400 ▲ | 1,01,200 ▼ |
| ముంబై | 89,164 ▲ | 81,674 ▲ | 1,00,892 ▲ |


SKF
SAJID NADIADWALA'S
SIKANDAR
AN A R MURUGADOSS FILM
RELEASING TODAY
NETFLIX
A PEN MARUDHAR RELEASE
district
BOOK YOUR TICKETS NOW


RGV DEN PRODUCT
RGV AARVI PRODUCTIONS
4TH APRIL IN THEATRES
FOR HIM NO MEANS YES
రామ్ గోపాల్ వర్మ
శారీ
DIRECTED BY GIRI KRISHNA KAMAL
WRITTEN AND PRESENTED BY RAM GOPAL VARMA
PRODUCED BY RAVI SHANKAR VARMA
TELUGU | TAMIL | MALAYALAM


SIVAPARAMATMA CREATIONS
భక్తి జ్ఞాన వైరాగ్యాలే
ప్రధాన అంశంగా
రూపుదిద్దుకున్న చిత్రం
శివాజ్ఞ
SIVA AGNA
ఏప్రిల్
4
విడుదల
ఆంధ్ర, తెలంగాణలో 108 థియేటర్లలో
మొదటి రోజు 4 ఆటలు
ఉచిత ప్రదర్శన


ROBBING HEARTS ALL OVER
MYTHRI MOVIE MAKERS
NITHIIN
రాబిన్‌హుడ్
WRITTEN & DIRECTED BY VENKY KUDUMULA
PRODUCERS NAVEEN YERNENI, Y RAVI SHANKAR
G V PRAKASH KUMAR
ADVENTUROUS ENTERTAINER COMING YOUR WAY!
ఉగాది
శుభాకాంక్షలు


JAU&I STUDIOS
PADMANABHAREDDY PRESENTS
OMG PRODUCTIONS
PHANI
ఫణి | ఫణి | ఫణి | ఫణి | ఫణి
విశ్వావసు నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలతో
DR. MEENAKSHI ANIPINDI | DR.V.N.ADITYA


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR
BLOCK BUSTER MAXX
HOUSEFULLS EVERYWHERE
S.NAGA VAMSI PRESENTS
(MAD)²
#ThisTimeItsMADMAXX
ఉగాది
శుభాకాంక్షలు


RAW AND RUSTIC ACTION BLOCK BUSTER
ఉగాది శుభాకాంక్షలతో..
తప్పక
చూడండి
HR
RIYA SHIBU
NVR CINEMA
CHIYAAN VIKRAM
వీర ధీర శూర
PART 2
AN S.U.ARUN KUMAR FILM
A GV PRAKASH KUMAR MUSICAL
VEERA DHEERA SOORA
HR PICTURES

సండే సెలబ్రిటీ





టాలీవుడ్‌లో ప్రతిభావంతులైన దర్శకులలో **హరీష్ శంకర్** ఒకరు. తన అభిప్రాయాన్ని నిస్సంకోచంగా... నిర్భయంగా చెప్పగలిగిన ఆయన... త్వరలో పవన్‌కల్యాణ్, సల్మాన్‌ఖాన్ వంటి అగ్రనటుల సినిమాలకు దర్శకత్వం వహించనున్నారు. కొత్త సంవత్సరం... 'విశ్వావసు'లోకి కొత్త ఆశలతో అడుగుపెడుతున్న హరీష్‌శంకర్ 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

# గమ్యం కన్నా గమనాన్ని ఆస్వాదిస్తా

### పవన్ కల్యాణ్‌తో సినిమా ఎప్పుడు?

ఎన్నికల ముందు ఒక స్క్రిప్ట్ అనుకున్నాం. ఆ తర్వాత కొన్ని మార్పులు చేశాం. ఇప్పుడు అంతా రెడీ. కల్యాణ్‌గారి డేట్స్ చూసుకొని, త్వరలోనే సినిమా ప్రారంభిస్తాం. నేను మాత్రం మూడు నాలుగేళ్ల నుంచి సిద్ధంగానే ఉన్నా.

### చిన్ననాటి ఉగాది జ్ఞాపకాలు చెబుతారా..?

నా ఉద్దేశంలో పండుగ అంటే పదిమంది కలిసి చేసుకొనేది. మన సంస్కృతిలోని పండుగలన్నీ ఈ అంతస్సూత్రం ఆధారంగా ఏర్పడినవే! ముఖ్యంగా ఉగాది విషయానికి వస్తే... ఇది ప్రకృతి పండుగ. ప్రకృతికి... మనిషికి మధ్య ఉన్న బాంధవ్యాన్ని చెప్పే పండుగ. ఉగాది పచ్చడి, పంచాగ శ్రవణం... మొదలైనవన్నీ వీటిలో భాగాలే! అందుకే ఆ రోజు కచ్చితంగా ఫలానా దేవుడికి దండం పెట్టాలని లేదు. నాకు చిన్నప్పటి నుంచి పంచాంగ శ్రవణం వినటం... ఆ సంవత్సరం ఎలా ఉందో చూసుకోవటం అలవాటు. నా ఉద్దేశంలో జ్యోతిషం కూడా ఒక శాస్త్రం. మనం పుట్టినప్పుడు గ్రహాలు ఎలా ఉన్నాయనే ఆధారంగా విశ్లేషిస్తే చాలా విషయాలు తెలుస్తాయనేది నా నమ్మకం. చెప్పేవాళ్లు తప్పుకావచ్చు. శాస్త్రం మాత్రం ఎప్పుడూ తప్పుకాదు. ఇక అమ్మ, నాన్న బీహెచ్‌ఈఎల్‌లో ఉంటారు. ప్రతి ఏడాది వాళ్ల దగ్గరకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుంటా. అమ్మ చేతి వంట తింటా. మార్చి 31 నా పుట్టిన రోజు. ఈసారి ఉగాది మర్నాడేప వచ్చింది.

### చాలామంది దర్శకులకు గ్యాప్ వస్తూ ఉంటుంది. అలా వేచి చూడటం చికాకుగా అనిపించదా?

ఇష్టమైన పని కష్టమయినా ఇబ్బంది పెట్టదు. చికాకు అనిపించదు. నేను గమ్యం కన్నా గమనాన్ని ఎక్కువ ఆస్వాదిస్తా. దీనివల్ల కూడా చికాకు అనిపించదు. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. బయట నుంచి చూసేవాళ్లకు మేము షూటింగ్ చేసేటప్పుడు మాత్రమే పని చేస్తున్నట్టు కనిపిస్తుంది. కానీ అది నిజం కాదు. ఏడాదిలో వంద రోజులు షూటింగ్ ఉందనుకుందాం. మిగిలిన రోజులు కథలు రాసుకుంటాం... స్క్రీన్‌ప్లే తయారు చేసుకుంటాం. ఏడాదంతా ఏదో ఒక పని చేస్తూనే ఉంటాం. ప్రస్తుతం నాదగ్గర 4 కథలు ఉన్నాయి. వచ్చే నాలుగు సినిమాల మధ్య గ్యాప్ ఉండదు.

### జయాపజయాలను ఎలా చూస్తారు?

నా మొదటి సినిమా 'షాక్' పరాజయం పాలయింది. నాకు పెద్ద షాక్ ఇచ్చింది. దాని నుంచి తేరుకొని 'గబ్బర్‌సింగ్' లాంటి ఇండస్ట్రీ హిట్ ఇచ్చానుగా! సినిమాపై ప్రేమతో వచ్చిన తర్వాత విజయమయినా.. పరాజయమయినా.. ప్రస్థానం మాత్రం సాగుతూనే ఉంటుంది. విజయం సాధిస్తే ఇది కొంత సులభమవుతుంది. పరాజయం వస్తే కొంత కష్టమవుతుంది అంతే! కొన్ని విమర్శలు.. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉంటాయి. విజయం సాధిస్తే మనకు ఫోన్లు ఎత్తే సమయం కూడా ఉండదు. పరాజయం వస్తే... మనం ఫోన్ చేసినా ఎవరూ తియ్యరు. ఇది పరిశ్రమ తత్వం. దీన్ని అర్థం చేసుకుంటే ప్రశాంతత వస్తుంది.

### జయాపజయాలు ఇంట్లోవాళ్లను ఇబ్బంది పెట్టవా?

నా సినిమా కబుర్లు అన్నీ ఆఫీసులోనే ముగిసిపోతాయి. నా భార్య స్నిగ్ధకు సినిమాలంటే పెద్ద ఇష్టం ఉండదు. కార్బాన్ నెట్‌వర్క్ అన్నా.. మొక్కలన్నా తనకు పిచ్చి. నా పారితోషికం ఎంతో కూడా తనకు తెలియదు. ఇక అమ్మ సరోజ, నాన్న శ్యాంసుందర్‌తో కూడా మొన్నటి దాకా నాకు ఎటువంటి సమస్య ఉండేది కాదు. నాన్న తెలుగు మాస్టారుగా రిటైరైన తర్వాత ఆయనకు ఒక ట్యాబ్ కొనిచ్చా. దాంతో సమస్య ప్రారంభమయింది. "హరీష్ శంకర్‌కు వార్నింగ్ ఇచ్చిన హీరో"... "ఈ దర్శకుడి పని అయిపోయిందా.." లాంటి యూట్యూబ్ వీడియోల థంబ్‌నెయిల్స్ చూసి ఆయన ఆందోళన చెందటం మొదలుపెట్టారు. దాంతో నాన్నకు "ఇవన్నీ చిన్న చిన్న విషయాలు. సినిమాల మీద ప్రేమతో ఇండస్ట్రీకి వచ్చా. పేపర్ మీద పెన్ను పెట్టి రాస్తున్నంత వరకూ మనకు ఢోకా లేదు. జీవన ప్రమాణాల స్థాయిలో తేడా ఉండచ్చేమో" అని చెప్పాను. ఆయన కొంత సమాధానపడ్డారు. అయినా అప్పుడప్పుడు ఆ తెలుగు మాస్టారిని.. మనస్సు లోపల దాగి ఉన్న తండ్రి డామినేట్ చేస్తూ ఉంటాడు! కంగారు పడుతూ ఉంటారు.

### మంచి దర్శకుడికి ఉండాల్సిన లక్షణం?

దీనికి జవాబు ఈ మధ్యనే సల్మాన్ తండ్రి సలీంఖాన్ నాతో చెప్పారు. సల్మాన్‌ను కలవటానికి వెళ్లినప్పుడు ఆయన రావటం కొద్దిగా ఆలస్యమైంది. దాంతో సలీంఖాన్‌ను కలిసే అవకాశం వచ్చింది. అప్పుడు నేను ఆయనను ఇదే ప్రశ్న అడిగాను. దానికి ఆయన "హరీష్.. కారు ఎక్కగానే మీ డ్రైవర్ నీకు ఒక కథ చెబుతాడు. విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు తోటి ప్రయాణికుడు ఒక కథ చెబుతాడు. నీ అసిస్టెంట్ ఆలస్యంగా వస్తే ఒక కథ చెబుతాడు. ఇలా కథలు చెప్పేవారు మన చుట్టూ ఉన్నారు. ప్రతి వ్యక్తి కథ చెప్పగలడు. కానీ దానిని ఒక పద్ధతిలో పెట్టి మంచి స్క్రీన్‌ప్లేగా మార్చగలిగినవాడే గొప్ప డైరెక్టర్" అన్నారు. ఆ మాటలకు నా మబ్బులన్నీ వీడిపోయాయి.

### మీకు ఎమోషనల్ సపోర్ట్ ఎవరు?

నా భార్య స్నిగ్ధ. చిన్నప్పటి నుంచి నేను స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతికినవాడిని. మానసికంగా ఎవరిపైనా పెద్దగా ఆధారపడను. మనను బలహీనపరిచేది ఏదైనా ఉందంటే అది దురలవాటేనని నేను నమ్ముతాను. చాలామంది మందు, సిగరెట్లులాంటివే దురలవాట్లు అనుకుంటారు. కానీ మనను ఇబ్బంది పెట్టే ఎమోషన్ ఏదైనా దురలవాటే! దానిని దూరంగా ఉంచుతా.

### అది కష్టం కాదా?

స్పష్టత ఉంటే కష్టం కాదు. ఒక ఉదాహరణ చెబుతా... మాది మధ్యతరగతి కుటుంబం. పిల్లలందరిలోనూ నేనే పెద్ద. చెల్లికి పెళ్లి చేయటం, తమ్ముడిని సెటిల్ చేయటం, అమ్మానాన్నలకు మంచి జీవనశైలి కల్పించటం.. ఇలా చాలారోజులు బాధ్యతలు తీర్చటంతో సరిపోయింది. వీటన్నింటిలోనూ నాకు నా భార్య మద్దతుగా నిలిచింది. ఇక నా జీవితంలో ఎలాంటి బాధ్యతలూ వద్దనుకున్నా. నేను, నా భార్య కూర్చుని మాట్లాడుకుని పిల్లలు వద్దనుకున్నాం. ఎందుకంటే అందరూ పిల్లలు పుట్టిన తర్వాతే సెల్ఫిష్‌గా తయారవుతారు. వారి ప్రపంచం కుదించుకుపోతుంది. పిల్లల చుట్టూనే తిరుగుతుంది. దీనికి నేరుగా సంబంధం లేకపోయినా ఒక విషయం చెబుతా. మోదీజీకి మూడు సార్లు గెలవటానికి 'ఆయనకు పిల్లలు లేరు.. ఎటువంటి బాదరబందీ లేదు.. నిస్వార్థంగా ఉండగలడు' అని అనేకమంది ప్రజలు నమ్మటమే కారణమనుకుంటా!

• సివిఎల్ఎన్ ప్రసాద్

### మీ దృష్టిలో మంచి ప్రేక్షకుడు ఎవరు?



ఇప్పటి దాకా మంచి ప్రేక్షకుడు.. చెడ్డ ప్రేక్షకుడు అని వేర్వేరు జాతులు ఉండేవికావు. మంచి సినిమాలు.. చెడ్డ సినిమాలు అని ఉండేవి. ప్రేక్షకులందరూ ఒక్కటే. అయితే సోషల్ మీడియా ప్రభంజనం తర్వాత చెడ్డ ప్రేక్షకులు అనే కొత్త జాతి పుట్టుకువచ్చింది. వీరికి విమర్శకు... ఎద్దేవాకు మధ్య తేడా తెలియదు. వీరు దేనినీ తులనాత్మకంగా విశ్లేషించరు. "ఆడియన్స్‌ను వెధవలనుకున్నాడా?", "ఈ మధ్య కళ్లు నెత్తికెక్కాయి.." లాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. వీరికి తమ జీవితాల్లో ఉన్న నిరాశలు వెళ్లగక్కటానికి సోషల్ మీడియా ఒక వేదిక. ఎవరూ చూడటం లేదనే భావనతో చీకట్లో ముసుగువేసుకొని అరుస్తూ ఉంటారు.

### ఎప్పుడైనా సినిమా మేకింగ్‌లో సమాధానపడ్డారా?

కొద్దిగా పేరు వచ్చిన తర్వాత 'ఫలానా సీన్ ఇలా తీయి..' అని ఎవరూ చెప్పరు. కానీ కొన్నిసార్లు మిగిలిన విషయాలలో సమాధానపడాల్సి వస్తుంది. ఉదాహరణకు 'మిస్టర్ బచ్చన్' తీసుకుందాం. నెట్‌ఫ్లిక్స్‌లో మాకు మంచి రేటు.. మంచి డేట్ దొరికాయి. దాంతో ఆగస్టు4 దాకా షూటింగ్ చేసి ఆగస్టు 15కి విడుదల చేసేయాల్సి వచ్చింది. ఆ తర్వాత విడుదల చేస్తే అది బాహుబలి రేంజ్ చేరిపోతుందనేది నా ఉద్దేశం కాదు. కానీ ఇంకొంత సమయం దొరికితే ఇంకొద్దిగా బావుండేదేమో!

### భావోద్వేగాలు...

నేను 10వ తరగతిలో 85 శాతం మార్కులతో పాస్ అయినప్పుడు కలిగిన ఆనందాన్ని ఇప్పటికీ మర్చిపోను. 2010లో రవి అన్నయ్య నా 'మిరపకాయ్' సినిమా ఓకే చేసిన మధ్యాహ్నం కలిగిన భావోద్వేగం ఇంకా గుర్తుంది. ఇక అవమానాల విషయానికి వస్తే... స్క్రిప్ట్‌పై నాలుగేళ్లు పని చేసిన తర్వాత షూటింగ్ మొదటి రోజున సినిమా నుంచి తొలగిస్తే... అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి ఏడుస్తూ పంజాగుట్ట, అక్కడి నుంచి బీహెచ్‌ఈఎల్ వెళ్లిన రోజు ఎప్పటికీ మర్చిపోను. 'మిస్టర్ బచ్చన్' ఫ్లాప్ తర్వాత నాలో ఒక విధమైన ప్రశాంతత వచ్చింది. నాకు ఇష్టమైన పుస్తకాలు చదువుతున్నా. నచ్చిన వ్యక్తులను కలుస్తున్నా. బిజీగా ఉంటే కలవలేనని చెప్పగలుగుతున్నా. ఇటీజ్ బెస్ట్ టైమ్ ఇన్ మై లైఫ్! ఐశ్వర్యానికి అర్థం ఇదే అనుకుంటా!

### మూడు ప్రాజెక్టులు...

ప్రస్తుతం చేతిలో మూడు ప్రాజెక్టులు ఉన్నాయి. కేవీఎన్, మైత్రీ మూవీ మేకర్స్, సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు ఒప్పుకున్నా. ఇక సల్మాన్ విషయానికి వస్తే ఇప్పటి దాకా రెండు మీటింగ్స్ అయ్యాయి. మేమిద్దరం సినిమాను ఒకే కోణం నుంచి చూస్తున్నాం. అంతే కాకుండా ఎలాంటి కథ తీయాలనే విషయంపై ఏకాభిప్రాయం ఉంది. సల్మాన్‌తో త్వరలోనే సినిమా ఉంటుంది. దీనిని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తారు.

పర్వదినం

# 'విశ్వావసు' అంటే

తెలుగు సంవత్సరాలలో 39వదైన 'విశ్వావసు నామ' సంవత్సరంలోకి అడుగుపెట్టాం. ఈ పేరు 'విశ్వ+వసు' అనే రెండు పదాల కలయిక. 'విశ్వం వాసయతి'... అంటే 'విశ్వానికి నివాసాన్ని కలిగించినవాడు, భగవంతుడు' అని అర్థం. "ఈ పేరు మహా విష్ణువుకు కూడా వర్తిస్తుంది. శుభకారకుడైన శ్రీహరి పేరిట ఉన్న ఈ ఏడాది అందరికీ సంతోషాన్ని కలిగించి, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుంది.

సర్వత్ర జాయతే క్షేమం సర్వ సస్య మహార్ఘతా
విశ్వావసౌ వరారోహే కార్పాసస్య మహార్ఘతా...

విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ అన్నింటా క్షేమం కలుగుతుంది. పాడి పంటలు బాగుంటాయి. ప్రత్యేకించి పత్తి పంటలు బాగా పండుతాయి" అనేది పంచాంగకర్తల నిర్వచనం.

కాగా ఇది ఏకాదశ గంధర్వ గణాలలో ఒకరైన గంధర్వుడి పేరని కూడా అంటారు. ఈ పేరు వేదాలలో కూడా కనిపిస్తుంది. "అతను సంపదను ప్రసాదించేవాడు, వివాహ సమయంలో నూతన వధూవరుల మధ్య అనురాగం ఏర్పడి, అది దినదిన ప్రవర్ధమానమయ్యేలా చేసేవాడు" అని కూడా పండితులు చెబుతున్నారు.

సంవత్సరాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయి?

సంవత్సరాల పేర్ల వెనుక ఆసక్తికరమైన పురాణ గాథ ఒకటి ఉంది.



ఒకసారి వైకుంఠానికి నారదుడు వచ్చి, మహా విష్ణువును దర్శించుకున్నాడు. వారి మధ్య విష్ణు లీలల ప్రస్తావన వచ్చింది. ఆ లీలలు, మాయల ప్రభావానికి ఎవరైనా లోనవుతారేమో కానీ... అవి తనపై పని చెయ్యవని నారదుడు అన్నాడు. విష్ణువు నవ్వి "సరే నారదా!" అని భూలోకంలోని ఒక అడవిలో ఉన్న సెలయేరును నారదుడికి చూపిస్తూ... "వెళ్లి దానిలో స్నానం చెయ్యి" అని చెప్పాడు. నారదుడు ఆ సెలయేరులో స్నానం చేయగానే స్త్రీగా మారిపోయాడు. తన గతాన్ని పూర్తిగా మరచిపోయాడు. ఏదీ అర్థం కాని స్థితిలో అటూ ఇటూ తిరుగుతూ ఉండగా... వేట కోసం అడవికి వచ్చిన ఒక రాజు... స్త్రీ రూపంలో ఉన్న నారదుణ్ణి చూసి మోహించాడు. ఆమెను ఒప్పించి వివాహం చేసుకున్నాడు. వారికి అరవై మంది కుమారులు కలిగారు. వారు పెరిగి పెద్దవారయ్యాక... వేరొక రాజ్యంతో యుద్ధం సంభవించింది. ఆ యుద్ధంలో రాజు, ఆ అరవై మంది కుమారులు మరణించారు. ఇది తెలుసుకున్న రాణి (స్త్రీరూపంలో ఉన్న నారదుడు) రోదిస్తూ, మహా విష్ణువును ప్రార్థించింది. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై... "నారదా! నువ్వు ఎవరనేది నీకు ఇంకా గుర్తుకురాలేదా?" అన్నాడు. తక్షణమే నారదుడు తన పూర్వరూపంలోకి మారిపోయాడు. అతనికి జరిగినదంతా గుర్తుకు వచ్చింది. సిగ్గుతో తల వంచుకుంటూ "దేవా! నాపై ఎలాంటి లీలలు, మాయలు పని చేయవని అన్నందుకు... నాకు గొప్ప గుణపాఠం నేర్పారు. కానీ బ్రహ్మచారినైన నేను... స్త్రీగా మారి, మాతృత్వాన్ని చవి చూశాను. ఇప్పుడు ఆ కుమారుల మరణాన్ని భరించలేకపోతున్నాను. వారి జ్ఞాపకం శాశ్వతంగా నిలిచేలా చెయ్యి" అని కోరాడు. "ఆ అరవై మంది పేర్లు... అరవై సంవత్సర నామాలుగా... చిరస్థాయిగా నిలిపోతాయి" అని శ్రీహరి వరం ఇచ్చాడు. ప్రభవ నుంచి అక్షయ వరకూ... అరవై నెలలను వారి పేర్లతోనే పిలుస్తున్నారు. ఈ అరవై పూర్తయిన తరువాత... మరోసారి ప్రభవతో సంవత్సరాల చక్రం పునఃప్రారంభమవుతుంది.

**హిందూ సంప్రదాయం ప్రకారం... ఈ 'విశ్వావసు నామ' సంవత్సరాది నాటికి కలియుగం ప్రారంభమై 5,126 సంవత్సరాలు గడిచాయి. ఈ ఉగాది రోజున 5,127వ సంవత్సరం ప్రారంభమవుతుంది.**

### సుఖ సౌఖ్యప్రదాయకం... ఉగాది పచ్చడి

ఉగాది అనగానే గుర్తుకువచ్చేది.... ఆరు రుచుల సమ్మేళమైన పచ్చడి. దీని విశిష్టతను, ప్రధానంగా వినియోగించే పదార్థాలను 'ధర్మ సింధు' గ్రంథంలోని ఈ శ్లోకం వివరించింది.

అబ్దాదౌ నింబకుసుమం... శర్కరామ్ల ఘృతైర్యుతమ్
భక్షితం పూర్వయామేస్యా... తద్వర్షం సౌఖ్యదాయకమ్

"ఉగాదినాడు వేపపూత, బెల్లం (పంచదార), చింతపండు, నెయ్యితో కూడిన పచ్చడిని తింటే.. రాబోయే సంవత్సరం సౌఖ్యదాయకంగా సాగుతుంది" అని అర్థం.

అలాగే ఉగాది పచ్చడి తింటున్నప్పుడు...

**శతాయుష్యం వజ్రదేహం దదాత్యర్థం సుఖానిచ**
**సర్వారిష్టవినాశంచ నింబకందళ భక్షణమ్...** అనే శ్లోకాన్ని పఠించాలి. వేపపూతను కలిపిన ఉగాది పచ్చడిని తినడం వల్ల శరీరం వజ్రంలా దృఢంగా మారుతుందనీ, అరిష్టాలన్నీ తొలగిపోతాయనీ, వంద సంవత్సరాలు సుఖ సంతోషాలతో జీవిస్తారని ఈ శ్లోకం చెబుతోంది.

## చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

### ఆ అనుభవాలతో పుస్తకం రాస్తాను

- డాక్టర్ అనిల్ విశ్వనాథ్



"28°C' సినిమా షూటింగ్ కోసం మేం చాలా కష్టపడ్డాం. చిత్రీకరణ కోసం రెండు సార్లు జార్జియా వెళ్లినా కొన్ని కారణాల వల్ల అధికారులు వెనక్కు పంపారు. ఎన్నో సవాళ్లను దాటుకొని మూడో ప్రయత్నంలో అక్కడ చిత్రీకరణ పూర్తి చేశాం. అలా ఈ సినిమా అనుభవాలతో ఓ పుస్తకం రాయాలనుకుంటున్నాను' అని డాక్టర్ అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'పొలిమేర' చిత్రంతో దర్శకుడిగా చక్కని గుర్తింపు దక్కించుకున్న ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం '28°C'. నవీన్‌చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించారు. సాయి అభిషేక్ నిర్మించారు. ఏప్రిల్ 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మీడియాతో మాట్లాడుతూ 'దర్శకుడిగా నాకు ఇది తొలి సినిమా. అయితే కొన్ని కారణాల వల్ల విడుదల ఆలస్యం అయింది. వైద్య విద్యార్థుల ప్రేమకథకు అతీంద్రియ శక్తులు ఎలాంటి అడ్డంకులు సృష్టించాయి అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ప్రస్తుతం 'పొలిమేర 3' చేస్తున్నాను' అని తెలిపారు.

### కన్నప్ప విడుదల వాయిదా



మంచు విష్ణు కీలక పాత్రలో ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. ముందు ప్రకటించిన విధంగా ఏప్రిల్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని మంచు విష్ణు 'ఎక్స్'లో పోస్టు చేశారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి కానందున సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటన చేస్తున్నందుకు అభిమానులకు విష్ణు క్షమాపణలు చెప్పారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

### ఎవరు ఏమైనా అనుకోండి



మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్'. ఇటీవలె విడుదలైన ఈ సినిమాలోని పలు సన్నివేశాలు వివాదాస్పదమయ్యాయి. 2002లో గుజరాత్‌లో చోటు చేసుకున్న అల్లర్లను ఈ సినిమాలో కీలక సన్నివేశాలుగా చూపించారనీ, ఒక వర్గాన్ని తక్కువ చేసి చూపించేలా ఆ సన్నివేశాలు ఉన్నాయనీ పలువురు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రం ప్రదర్శనలను వెంటనే నిలిపివేయాలని వామపక్ష వాదులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర రచయిత మురళీ గోపి స్పందించారు. 'ఈ వివాదంపై నేను మౌనంగా ఉండాలనుకుంటున్నాను. వాళ్లకు నచ్చిన విధంగా అనుకోనివ్వండి. ఒక సినిమాని తమకు నచ్చిన విధంగా ఊహించుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కాబట్టి వాళ్లకు నచ్చిన విధంగా ఊహించుకోనివ్వండి. నేను మాత్రం మౌనంగానే ఉంటాను' అని మురళీ గోపి పేర్కొన్నారు.

## లంచం కేసులో రిటైర్డు హైకోర్టు జడ్జి నిర్మల్ యాదవ్ నిర్దోషి



- ఆమెకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు
- 17 ఏళ్ల నాటి కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

చండీగఢ్, మార్చి 29: ఆస్తి వివాదంలో లంచం తీసుకోవడానికి ప్రయత్నించారన్న కేసులో పంజాబ్-హరియాణా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్ యాదవ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ శనివారం ఇక్కడి సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. 'జడ్జి ఇంటి గుమ్మం వద్ద నగదు' పేరుతో 17 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన కేసులో ఆమె బయటపడ్డారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జిపై కేసు నమోదు కావడం అదే తొలిసారి. 2008లో రూ.15 లక్షల నగదు ప్యాకెట్‌ను కొందరు ఆమెకు పంపారని, కానీ పొరపాటున అది అప్పటి మరో సిట్టింగ్ జడ్జి అయిన జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ నివాసానికి చేరిందంటూ కేసు నమోదైంది. ఆ నగదు లబ్ధిదారు జస్టిస్ నిర్మల్ యాదవే అన్న కోణంలో విచారణ జరిగింది. అయితే ఇందుకు తగిన ఆధారాలు లేవంటూ సీబీఐ కోర్టు జడ్జి అల్కా మాలిక్ కేసును కొట్టివేశారు. ఆమెతో పాటు నిందితులుగా ఉన్న మరో నలుగురు వ్యక్తులు- హరియాణా మాజీ అదనపు ఏజీ సంజీవ్ బన్సల్, ఢిల్లీకి చెందిన హోటల్ యజమాని రవీందర్ బాసిన్, చండీగఢ్‌కు చెందిన స్థిరాస్తి సంస్థ డీలర్ రాజీవ్ గుప్తా, నిర్మల్ సింగ్‌లను కూడా నిర్దోషులుగా ప్రకటించారు. సంజీవ్ బన్సల్ 2017 ఫిబ్రవరిలో మరణించడం గమనార్హం. తీర్పుపై నిర్మల్ యాదవ్ స్పందిస్తూ "న్యాయవ్యవస్థపై నాకు నమ్మకం ఉంది. నేను ఏ నేరమూ చేయలేదు" అని అన్నారు.

### ఏమి జరిగింది?

2008 ఆగస్టు 13వ తేదీ సాయంత్రం 8.30 గంటల సమయంలో పంజాబ్-హరియాణా హైకోర్టు జడ్జి జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ నివాసం వద్దకు పర్కాశ్‌రామ్ అనే వ్యక్తి వచ్చి అక్కడి ప్యూన్ అమ్రిక్ సింగ్‌కు ఒక ప్లాస్టిక్ సంచి ఇచ్చాడు. ఆ సంచిలో నోట్ల కట్టలు కనిపించడంతో జస్టిస్ నిర్మల్‌జిత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పర్కాశ్ రామ్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఆగస్టు 26న ఈ కేసు సీబీఐకి బదిలీ అయింది. ఈ ఘటనపై సుప్రీంకోర్టు కూడా అంతర్గతంగా విచారణ జరిపింది. సీబీఐతో పాటు, సుప్రీంకోర్టు అంతర్గత కమిటీలు జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్‌కు క్లీన్‌చిట్ ఇచ్చాయి. 2009 డిసెంబరులో సీబీఐ కేసును మూసివేసింది. అయితే, దాన్ని అంగీకరించని సీబీఐ ప్రత్యేక కోర్టు మళ్లీ దర్యాప్తు చేయాలని 2010 మార్చిలో ఆదేశించింది. 2011 ఏప్రిల్ 18న సీబీఐ కోర్టులో ఛార్జిషీటు సమర్పించింది. ఆ నగదు ప్యాకెట్ జస్టిస్ నిర్మల్ యాదవ్ ఇంటికి తీసుకెళ్లాల్సి ఉండగా, పేర్లు ఒకే మాదిరిగా ఉండడంతో జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటి వద్దకు వచ్చిందని సీబీఐ ఆ ఛార్జిషీటులో ఆరోపించింది. తాజాగా కోర్టు అందుకు ఆధారాల్లేవని కేసును కొట్టేసింది.

## 10, 12 తరగతులకు సీబీఎస్ఈ కొత్త సిలబస్

న్యూఢిల్లీ, మార్చి 29: పాఠ్యాంశాలు, పరీక్షల విధానంలో భారీగా మార్పులు చేసినట్టు సీబీఎస్ఈ ప్రకటించింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 10, 12 తరగతులకు కొత్త సిలబస్‌ను ముద్రించినట్టు తెలిపింది. పదో తరగతి విద్యార్థులు ఫిబ్రవరి, ఏప్రిల్‌లో రెండు సార్లు పరీక్షలు రాసే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు పేర్కొంది. 12వ తరగతి విద్యార్థులకు మాత్రం ఏటా ఒక్కసారే పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. 2026 ఫిబ్రవరి 17న బోర్డు ఎగ్జామ్స్ రాయాల్సి ఉంటుందని పేర్కొంది. పదో తరగతి విద్యార్థులు 80 మార్కులకు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. మిగిలిన 20 మార్కులు అంతర్గత మదింపునకు కేటాయిస్తారు. ప్రతి పరీక్షలో కనీసం 33 మార్కులు సంపాదించాల్సి ఉంటుంది. మార్కులకు బదులుగా 9 పాయింట్ల గ్రేడ్ విధానాన్ని అమలు చేస్తారు. 12వ తరగతిలోనూ 9పాయింట్ల గ్రేడ్ విధానం అమలవుతుంది. నైపుణ్యాలకు సంబంధించిన ఎలక్టివ్ సబ్జెక్టులను తీసుకోవాల్సి ఉంటుంది.

## ఎక్స్‌ను ఎక్స్‌ఏఐకు అమ్మిన మస్క్

వాషింగ్టన్, మార్చి 29: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌ను అమ్మేశారు. అయితే కొన్న సంస్థ కూడా ఆయనకు చెందినదే కావడం విశేషం. ఎక్స్‌ను కృత్రిమమేధ సంస్థ ఎక్స్‌ఏఐకు 33 బిలియన్ డాలర్లకు విక్రయించినట్లు మస్క్ ప్రకటించారు. ఎక్స్‌కు ఉన్న విశేష ఆదరణతో ఎక్స్‌ఏఐ అధునాతన శక్తిని, నైపుణ్యాన్ని సమ్మిళితం చేయడం ద్వారా అపారమైన సామర్థ్యాన్ని అందుకునే అవకాశం ఉందని ఆ పోస్టులో మస్క్ తెలిపారు. ఈ డీల్‌తో ఎక్స్‌ఏఐ విలువ 80 బిలియన్ డాలర్లుగా, ఎక్స్ విలువ 33 బిలియన్ డాలర్లుగా ఉందని వెల్లడించారు. 2022లో ట్విటర్‌ను కొని దానిని ఎక్స్‌గా మార్చిన మస్క్.. ఏడాది తర్వాత ఎక్స్ఏఐను స్థాపించారు.

## 500 మంది భారతీయ ఖైదీలకు క్షమాభిక్ష

- రంజాన్ నేపథ్యంలో యూఏఈ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి29: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 500 మంది భారతీయ ఖైదీలకు యూఏఈ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టడంతో పాటు జైళ్ల నుంచి విడుదల చేయాలని నిర్ణయించింది. భారత్-యూఏఈ మధ్య బలమైన సంబంధాలకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. విదేశీ జైళ్లలో మగ్గుతున్న భారతీయ ఖైదీలను విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దౌత్యపరమైన ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పదేళ్లలో ఇప్పటివరకు సుమారు 10వేల మంది భారతీయ ఖైదీలు విడుదలయ్యారు.

## బ్యాంకులను 'కలెక్షన్ ఏజెంట్లు'గా చేశారు: ఖర్గే

న్యూఢిల్లీ, మార్చి 29: మోదీ ప్రభుత్వం ప్రజలను లూటీ చేయడానికి బ్యాంకులను 'కలెక్షన్ ఏజెంట్లు'గా మారుస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మే 1 నుంచి ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ చార్జీలు పెరగనున్న నేపథ్యంలో ఖర్గే 'ఎక్స్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. వివిధ బ్యాంకులు పెంచిన చార్జీల జాబితాను ఆయన జత చేశారు. ప్రజలు తమ పొదుపు ఖాతాల్లో కనీస నగదు నిల్వను ఉంచనందుకు 2018-2024 మధ్య మోదీ ప్రభుత్వం రూ.43,500 కోట్లు ముక్కు పిండి వసూలు చేసిందని పేర్కొన్నారు. బ్యాంకులు వివిధ చార్జీల పేరిట ప్రజలను లూటీ చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరైనా ఖాతాదారుడు ఏడాదిలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించకపోతే రూ.100-200, బ్యాంకు స్టేట్‌మెంట్ జారీ ఫీజు కింద రూ.50-100, ఎస్ఎంఎస్ అలెర్ట్‌ల పేరుతో 4 నెలలకు రూ.20-25 చొప్పున, రుణాల మంజూరు సమయంలో 1 నుంచి 3 శాతం ఫీజు వసూలు చేస్తున్నాయన్నారు.

## ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ దిశగా ఇస్రో!

న్యూఢిల్లీ, మార్చి 29: ఉపగ్రహ ప్రయోగాల్లో కొత్త శకాన్ని ప్రారంభించే 'ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్' సాకారం దిశగా ఇస్రో మరో ముందడుగు వేసింది. 300 మిల్లీన్యూటన్ల సామర్థ్యమున్న స్టేషనరీ ప్లాస్మా థ్రస్టర్ వెయ్యి గంటల జీవితకాలాన్ని విజయవంతంగా పరీక్షించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేసింది. సదరు థ్రస్టర్‌ను ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్‌లో వినియోగించనున్నారు. ప్రస్తుతం ఉపగ్రహాలను ఒక కక్ష్యలో స్థిరంగా ఉంచటానికి, ఒక కక్ష్య నుంచి మరొక కక్ష్యలోకి పంపించటానికి 'రసాయనిక ప్రొపల్షన్ వ్యవస్థలను' వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను వాడే అవకాశాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి ఫలిస్తే.. ఉపగ్రహాల బరువు తగ్గుతుంది.

## ఉప్పు నీటిలో కరిగే ప్లాస్టిక్ తయారీ

టోక్యో, మార్చి 29: సముద్ర జలాల్లో టన్నులకు టన్నులు పేరుకుపోయి అందులోని జీవులతో పాటు మానవ మనుగడకే ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్‌కు పరిష్కారాన్ని కనుగొన్నారు జపాన్ శాస్త్రవేత్తలు. సముద్ర జలాల్లో(ఉప్పునీటిలో) కరిగి పోయే ప్లాస్టిక్‌ను వారు ఆవిష్కరించారు. సుప్రామాలిక్యులర్ అని పిలిచే ఈ వినూత్న ప్లాస్టిక్ సాధారణంగా ఉపయోగిస్తున్నప్పుడు మన్నికగా ఉండి, సముద్రపు నీటిలో కలిస్తే సురక్షితంగా అందులో విచ్ఛిన్నమవుతుంది. జపాన్‌లోని సెమ్స్ శాస్త్రవేత్తలు దీనిని కనుగొన్నారు. పర్యావరణహితమైంది కావడంతో దీనిని విస్తృతంగా వాడుకలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు.



మాండలేలోని స్కై విల్లా భవన శిథిలాల వద్ద సహాయక సిబ్బంది

భూకంప తీవ్రతతో కుంగిపోయిన నేల



# మయన్మార్‌లో హాహాకారాలు



శిథిలాల కింద చిక్కుకున్న వ్యక్తిని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

## 1,664కు చేరిన భూకంప మృతుల సంఖ్య

నేపిదా(మయన్మార్), మార్చి 29: మయన్మార్‌లో సంభవించిన శక్తిమంతమైన భూకంపం.. తదనంతర ప్రకంపనలతో మరణాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. శనివారం రాత్రి కడపటి వార్తలందేసరికి 1,664 మంది మృతిచెందారని.. 3,408 మంది గాయపడ్డారని, పలువురు గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. అయితే.. కొండ ప్రాంతాలు, రెబల్స్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మరణాలను అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే(యూఎస్‌జీఎస్) మృతుల సంఖ్య ఏకంగా 10 వేలకు పైనే ఉంటుందని అంచనా వేసింది. మయన్మార్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో భూకంప ప్రభావం కనిపించింది. భూకంప తీవ్రతకు నేపిదాలోని అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) టవర్ కుప్పకూలి, అందులో ఉన్న సిబ్బంది అంతా చనిపోయారు. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడి ఆలస్యం అవుతుండటంతో మరణాల సంఖ్య బాగా పెరిగే ప్రమాదముందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మయన్మార్‌కు భారత్ సహా.. పలు దేశాలు సహాయక సామగ్రిని తరలించాయి. సహాయక చర్యలకు భారత్ 80 మంది ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, 118 మందితో వైద్య బృందాన్ని పంపింది.

### అంతటా హాహాకారాలు

భూకంపంతో ఒక్క మండలే నగరంలోనే 700 మందికి పైగా మృతిచెందినట్లు, ఇతర నగరాల్లో కలుపుకొని ఆ సంఖ్య 1,002గా ఉందని మయన్మార్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే.. కొండప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో మరణాలను ఇంకా అంచనా వేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో సహాయక చర్యలు ప్రారంభం కాకపోవడంతో బాధితుల హాహాకారాలు మిన్నంటుతున్నాయి. ఒక్క సికాయ్ పట్టణంలోనే 200 మందికిపైగా మృతదేహాలను కనుగొన్నామని, పర్వత ప్రాంతం కావడంతో ఇంకా సహాయకచర్యలు అందడం లేదని స్థానికులు చెబుతున్నారు. శిథిలాల కింద వందల మంది చిక్కుకుపోయారని పేర్కొన్నారు. భూకంపం సంభవించినప్పుడు ప్రీస్కూళ్లు, కాన్వెంట్లు, మఠాలు, శరణార్థి శిబిరాల్లో వందల మంది ఉన్నట్లు చెప్పారు. ఇక్కడికి సమీపంలో రెబల్స్ ఆధీనంలో ఉన్న గ్రామంలోనూ 18 మరణాలు సంభవించాయి. వంతిన్ ప్రాంతంలో ఓ బౌద్ధారామం కుప్పకూలడంతో ఇద్దరు బౌద్ధ సన్యాసులు సహా.. 36 మంది మృతిచెందారు. టౌంగూ వెహ్లావన్‌లోనూ బౌద్ధమఠం కుప్పకూలడంతో ఐదుగురు చిన్నారులు(శరణార్థుల పిల్లలు), ఒక బౌద్ధ భిక్షువు మృతిచెందారు. ఇక్కడ సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. శిథిలాల కింద నుంచి మరో ముగ్గురిని కాపాడి, స్థానిక ఆస్పత్రికి తరలించారు. టోంగ్యు టౌన్‌షిప్‌లో ఓ మసీదు కూలడంతో ఐదుగురు చిన్నారులు మృతిచెందారని స్థానికులు తెలిపారు. సిచువాన్, మాంటలే, మాగుయి, షెండాంగ్, పెయిచు, యాంగూన్‌లలో ప్రభుత్వం ఎమర్జెన్సీని ప్రకటించింది.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

### 30 గంటలకు పైగా పోరాటం

మాండలేలోని న్యూమార్కెట్ వద్ద ఓ ఏడంతస్తుల పాఠశాల భవనం కుప్పకూలిపోయింది. ఏడో అంతస్తులోని వసతిగృహంలో ఉన్న విద్యార్థులు 30 గంటల పాటు మృత్యువుతో పోరాటం చేశారు. ఇక్కడ ఓ ఉపాధ్యాయుడు సహా.. ఐదుగురు మృతిచెందగా.. మిగతా వారిని సురక్షితంగా కాపాడినట్లు సహాయక బృందాలు వెల్లడించాయి. కచ్చిన్‌లోని మరో ప్రాథమిక పాఠశాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ పాఠశాల భవనం కూలడంతో 24 మంది మరణించగా.. 50 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. శనివారం సాయంత్రం వీరిని సురక్షితంగా వెలికి తీశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆస్పత్రులు భూకంప బాధితులతో నిండిపోతున్నాయి. వేల మంది క్షతగాత్రులకు రక్తం అవసరమవుతోందని మయన్మార్ ఆరోగ్య శాఖ తెలిపింది. రక్తదాతలు వెంటనే ముందుకు రావాలని పిలుపునిచ్చింది. భూకంపం ధాటికి దేశంలోని పలు జైళ్లు దెబ్బతిన్నాయి. భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న మాండలే జైలు, ఓబో జైలులో పలు భవనాలు కుప్పకూలిపోయాయి. అక్కడి ఖైదీల పరిస్థితి ఏమిటనేదానిపై సమాచారం లేదు.

## భారత్ సాయం

భూప్రకోపంతో విలవిలలాడిన మయన్మార్, థాయ్‌లాండ్‌కు సాయమందించేందుకు అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. భారత్ ఏకంగా 'ఆపరేషన్ బ్రహ్మ' పేరుతో ఆపన్నహస్తం అందిస్తోంది. 40 టన్నుల సహాయక సామగ్రిని మయన్మార్‌కు పంపింది. ఇందులో టెంట్లు, దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, జనరేటర్లు, ఆహార ప్యాకెట్లు ఉన్నాయి. ఇప్పటికే వైమానిక దళం తరలించిన 15 టన్నుల మానవతాసాయం మయన్మార్‌కు చేరిందని, నౌకాదళాన్ని కూడా రంగంలోకి దింపామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. మృతుల్లో భారతీయులెవరూ లేరని తెలిపింది. సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు నిర్వహణ దళం(ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి 80 మంది, 118 మంది వైద్య సిబ్బందిని పంపినట్లు వివరించింది. వీరితోపాటు.. నాలుగు రెస్క్యూ డాగ్‌స్క్వాడ్‌లు ఉంటాయని తెలిపింది.



### 40కి పైగా వారసత్వ కట్టడాలు ధ్వంసం

తాజా భూకంపం, తదనంతర ప్రకంపనల కారణంగా మయన్మార్‌లోని 40కి పైగా వారసత్వ కట్టడాలు పాక్షికంగా/పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిల్లో.. 2019లో యునెస్కో గుర్తించిన బగాన్, 2014లో గుర్తించిన 'ప్యూ' పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. భూకంపంతో మయన్మార్‌లో నిత్యావసరాల ధరలకు రెక్కలొచ్చాయి. కరెంటు కొరత నేపథ్యంలో కొవ్వొత్తులకు డిమాండ్ పెరిగింది. దీంతో.. రూ.250గా ఉండాల్సిన 10 కొవ్వొత్తుల ప్యాకెట్ ధర రూ.450కి పెరిగింది. ఆహార పదార్థాల ధరలు కూడా రెట్టింపయ్యాయి. విద్యుత్తు కొరత కారణంగా.. రోజుకు నాలుగు గంటలు మాత్రమే సరఫరా చేయనున్నట్లు యాంగూన్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ప్రకటించింది.

### ప్రధాని మోదీ సంతాపం..

మయన్మార్ విపత్తుపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. మృతులకు సంతాపం తెలిపారు. భూకంప బాధిత దేశాలు మయన్మార్, థాయ్‌లాండ్‌కు 5 మిలియన్ డాలర్ల మేర ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఐక్యరాజ్య సమితి(ఐరాస) సెక్రటరీ జనరల్ గుటెరస్ ప్రకటించారు. కాగా, మానవతాసాయాన్ని అందించాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో రెబల్స్(పీపుల్స్ డిఫెన్స్ ఆర్మీ) స్థావరాలపై కాల్పులకు విరామం ఇస్తున్నట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం ప్రకటించింది.

## అసలే అంతర్యుద్ధం.. ఆపై ప్రకృతి ప్రకోపం

మయన్మార్.. భూకంపాలు అధికంగా సంభవించే దేశం. ప్రకృతి ప్రకోపాన్ని ఎదుర్కోవడం ఆ దేశ ప్రజలకు కొత్తేమీ కాదు. కానీ, శుక్రవారం సంభవించిన భూకంపం మాత్రం ఆ దేశాన్ని, ఆ దేశ ప్రజలను మరింత దీన స్థితికి చేర్చింది. మానవతా హృదయంతో ఆ దేశానికి సాయం చేసే వారున్నా.. ఆ సాయాన్ని అందుకోలేని దుస్థితి మయన్మార్ ప్రజలది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి సైనిక పాలన, అంతర్యుద్ధం, పేదరికంతో అల్లాడుతున్న మయన్మార్ పరిస్థితిని 2021 నుంచి జరుగుతోన్న అంతర్యుద్ధం మరింత దిగజార్చేసింది. సైనిక పాలనకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పాలన కోసం ప్రజలు సాయుధ పోరాటానికి దిగడంతో దేశంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగేళ్లుగా సైన్యానికి, తిరుగుబాటు దారులకు మధ్య జరుగుతున్న భీకర పోరు వల్ల మయన్మార్ తీవ్రంగా నష్టపోయింది. ఇలాంటి దుర్భర పరిస్థితిలో ఉన్న మయన్మార్‌లో శుక్రవారం సంభవించిన భూకంపం ఆ దేశాన్ని మరిన్ని కష్టాల్లోకి నెట్టేసింది. దీంతో దిక్కుతోచని స్థితిలో నిలిచిన మయన్మార్ పాలకులు గతంలో ఎప్పుడూ లేని విధంగా తమకు సాయం చేయాలని తొలిసారి ప్రపంచాన్ని కోరారు.

## మోదీ గొప్ప ప్రధాని

చాలా తెలివైన వ్యక్తి.. నా మంచి మిత్రుడు

సుంకాల ఉద్రిక్తతల వేళ ట్రంప్ ప్రశంసలు



వాషింగ్టన్, మార్చి 29: ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. మోదీని గొప్ప మిత్రుడు, చాలా తెలివైన వ్యక్తి అంటూ శుక్రవారం వైట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రంప్ కొనియాడారు. అయితే, భారత్‌పై అధిక సుంకాలు విధించడాన్ని ట్రంప్ సమర్థించుకున్నారు. 'మోదీ ఇటీవల ఇక్కడికి వచ్చారు. మేం ఎప్పటి నుంచో మంచి మిత్రులం. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. వారు చాలా తెలివైనవారు. మోదీ నాకు గొప్ప మిత్రుడు. ఆయన చాలా తెలివైన వ్యక్తి. మా మధ్య చాలా మంచి చర్చ జరిగింది. అది చాలా మంచి ఫలితాన్ని ఇస్తుందని భావిస్తున్నా' అన్నారు. కాగా, భారత్ సహా అనేక దేశాలపై అమెరికా విధించిన ప్రతీకార సుంకాలు ఏప్రిల్ 2 నుంచి అమలు కానున్నాయి. అలాగే, అమెరికాకు దిగుమతి చేసుకునే ప్రతి వాహనంపైనా 25 శాతం సుంకాలు విధించాలని గురువారం ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఇది కూడా ఏప్రిల్ 2 నుంచి అమలు కానుంది. కాగా, యూఎస్ ఎయిడ్‌కు అంతర్జాతీయంగా ఉన్న కార్యాలయాలను మూసివేయనున్నట్టు ట్రంప్ యంత్రాంగం అమెరికా కాంగ్రెస్‌కు తెలిపింది. భూకంపం ధాటికి కుదేలైన మయన్మార్‌కు ట్రంప్ సాయం ప్రకటించిన సమయంలోనే, ఆయన యంత్రాంగం ఈ ప్రకటన చేయడం గమనార్హం.

## 17 మంది మావోయిస్టుల మృతి

### ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్.. మృతుల్లో 11 మంది మహిళలు

చర్ల/చింతూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. తొమ్మిది రోజుల క్రితం ఈ నెల 20న బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌ను మరువకముందే శనివారం మరో ఘటన చోటుచేసుకుంది. సుక్మా జిల్లా కెర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పంపల్లిలో శనివారం ఉదయం 8 గంటల సమయంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో 11 మంది మహిళలు ఉన్నారు. మృతుల్లో దర్భా డివిజన్ కమిటీ కార్యదర్శి, ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యుడు కుహ్రామి జగదీశ్ అలియాస్ బుద్రా కూడా ఉన్నాడు. ఇతనిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. కాగా, ఎదురుకాల్పుల్లో నలుగురు జవాన్లకు కూడా గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు డీఆర్‌జీ, మరొకరు సీఆర్‌పీఎఫ్ జవాను ఉన్నారు. గాయపడ్డ జవాన్ల పరిస్థితి నిలకడగా ఉందని బస్తర్ రేంజ్ మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. గాయపడ్డ జవాన్లను హెలికాప్టర్‌లో రాయపూర్ ఆస్పత్రికి తరలించారు. 17 మంది మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉప్పంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, 159 బెటాలియన్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్లు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు జరిగి 17 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కాగా, శనివారం సాయంత్రం వరకు మృతుల్లో ఏడుగురిని గుర్తించినట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దర్భా డివిజన్ కమిటీ కార్యదర్శి జగదీశ్ స్వస్థలం సుకుమా జిల్లా కుకనార్ గ్రామం. 2013లో 30 మంది కాంగ్రెస్ నాయకులను హత్య చేసిన ఘటన, 2023లో జవాన్లు ప్రయాణిస్తున్న వాహనాన్ని పేల్చివేసి 10 మందిని హత్య చేసిన ఘటనల్లో జగదీశ్ నిందితుడు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లో ఒకే నెలలో రెండు భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. మార్చి 20న బీజాపూర్ జిల్లా గంగలూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 26 మంది మావోయిస్టులు మృతి చెందగా.. తాజా ఎన్‌కౌంటర్‌లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 25 మంది మహిళలు ఉన్నారు. వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఇకనైనా మావోయిస్టులు లొంగిపోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో శనివారం 15 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. ఇదిలా ఉండగా, బీజాపూర్ జిల్లాలోనే జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు.

### ఎన్‌కౌంటర్ బూటకం


ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు ఆరోపించారు. దండకారణ్యంలో నరమేధం ఆపాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వక్ఫ్ బోర్డు నిర్ణయాలపై సవాల్!

- ఏ నిర్ణయంపై అయినా కోర్టుకు వెళ్లేలా బిల్లులో కీలక మార్పులు
- బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు: అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 29: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4తో ముగియనున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వక్ఫ్ బిల్లుపై కీలక ప్రకటన చేశారు. ప్రస్తుత సెషన్‌లోనే వక్ఫ్ (సవరణ) బిల్లును ప్రవేశపెడుతామని స్పష్టం చేశారు. టైమ్స్ నౌ సమ్మిట్-2025లో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చేసిన చట్టానికి భిన్నంగా.. వక్ఫ్ బోర్డు నిర్ణయాలను కూడా కోర్టుల్లో సవాల్ చేసే విధంగా చట్టాన్ని రూపొందిస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2013లో పార్లమెంట్‌లో సమగ్ర చర్చ చేపట్టకుండా వక్ఫ్ బిల్లును పాస్ చేయించుకుందని విమర్శించారు. బిల్లులోని చాలా నిబంధనలు రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా లేనప్పటికీ, కాంగ్రెస్ పార్టీ తన బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ విధంగా చేసిందని అన్నారు. ఏ చట్టమూ రాజ్యాంగం కంటే ఎక్కువేమీ కాదని అమిత్ షా స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు ప్రస్తుత స్థితిని ప్రశ్నిస్తూ.. "వక్ఫ్ బోర్డు గనుక ఒక నిర్ణయం తీసుకుంటే, దాన్ని దేశంలోని కోర్టుల్లో సవాల్ చేసేందుకు అవకాశం లేదు. భారత్ వంటి దేశంలో ఈ పద్ధతిని ఏ విధంగా అనుమతించగలం" అని షా అన్నారు.

### లోకం తీరు




## స్వచ్ఛందంగా వెళ్లిపోండి!

- క్యాంపస్ ఆందోళనల్లో పాల్గొన్న అంతర్జాతీయ విద్యార్థులకు అమెరికా ఈ-మెయిల్స్ ...జాబితాలో భారతీయ విద్యార్థులు !

వాషింగ్టన్, మార్చి 29: అమెరికాలోని విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లలో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థులంతా స్వచ్ఛందంగా క్యాంపస్ విడిచి వెళ్లిపోవాలని ఆ దేశ విదేశాంగ శాఖ ఈ-మెయిల్ ద్వారా హెచ్చరికలు జారీ చేసింది. వీరితో పాటు ఆందోళనలకు సంబంధించిన సమాచారాన్ని, జాతి వ్యతిరేక సందేశాలను సోషల్ మీడియాలో షేర్ చేసినవారికి కూడా ఈ-మెయిల్ పంపినట్లు ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు ధ్రువీకరించారు. వీరిలో కొంతమంది భారతీయ విద్యార్థులు కూడా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను కాన్సులేట్ అధికారులతో కలసి విదేశాంగ శాఖ ఇటీవల నిశితంగా సమీక్షించింది. ఆ నివేదికల ఆధారంగా తాజా నిర్ణయం తీసుకున్నారు. హమాస్, ఇతర ఉగ్రసంస్థలకు మద్దతు పలుకుతున్న అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేయడానికి అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ఏఐ ఆధారిత 'క్యాచ్ అండ్ రివోక్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది అమల్లోకి వచ్చిన మూడు వారాల్లోనే 300 మందికిపైగా విదేశీ విద్యార్థుల స్టూడెంట్ వీసాలు రద్దయ్యాయి. 'మీకు వీసా జారీచేసిన తర్వాత అదనపు సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా అమెరికా ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 22(1) ప్రకారం మీ ఎఫ్-1 వీసా రద్దయింది' అని విద్యార్థులకు పంపిన ఈ మెయిల్స్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాలో నివసిస్తున్న భారతీయ వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం మరో పిడుగు వేసింది. గ్రీన్‌కార్డుల ప్రాసెసింగ్‌ను నిలిపివేసింది. ఆ దేశంలో శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకొనే వారి వివరాలను మరింత సమగ్రంగా పరిశీలన చేసే లక్ష్యంతో అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేసిన రెండు కార్యనిర్వాహక ఆదేశాలను పాటించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది.



ఒప్పంద పత్రాలతో హిమాచల్ సీఎం సుఖ్వీందర్, డిప్యూటీ సీఎం భట్టి

## హిమాచల్‌ప్రదేశ్‌లో తెలంగాణ జెన్‌కో జలవిద్యుత్ కేంద్రాలు

- 520 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటు
- 40 ఏళ్ల పాటు హిమాచల్‌కు 12-40 శాతం విద్యుత్
- ఆ తర్వాత హిమాచల్‌కు యాజమాన్యపు హక్కులు
- హిమాచల్, తెలంగాణ ప్రభుత్వాల మధ్య ఒప్పందం

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్‌లో రెండు చోట్ల 520 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాలను తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్‌కో నిర్మించనుంది. నామినేషన్ విధానంలో ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి 100% మూలధన పెట్టుబడులను జెన్‌కో భరించనుంది. శనివారం హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో రెండు రాష్ట్రాల అధికారులు ఈ మేరకు పరస్పర అవగాహన ఒప్పందం(ఎంవోయూ)పై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో సెలీ ప్రాంతంలో 400 మెగావాట్లు, మియార్‌లో 120 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. స్థలంతో పాటు సహకారాన్ని అందించినందుకుగాను 40 ఏళ్ల పాటు హిమాచల్‌ప్రదేశ్‌కు 12-40 శాతం మధ్య విద్యుత్‌ను తెలంగాణ ఉచితంగా సరఫరా చేయనుంది. 40 ఏళ్ల ఒప్పంద గడువు ముగిసిన తర్వాత రెండు విద్యుత్ కేంద్రాలపై హిమాచల్‌ప్రదేశ్‌కు యాజమాన్య హక్కుల పూర్తి స్థాయిలో బదిలీ కానున్నాయి. విద్యుత్ భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

## అర్థ గణాంక శాఖలో 20మందికి పదోన్నతులు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అర్థ గణాంక శాఖ సంచాలకుల కార్యాలయంలోని ఏడుగురు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా, 13మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం రెండు జీవోలను జారీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్లు ఎం.మాన్య, ఎం.నాగేంద్రకుమార్, టి.అశోక్, ఎస్.మోహన్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, పి.సుబ్బారావు, ఆర్.రాజారాంలకు జాయింట్ డైరెక్టర్లుగా, మరో 13 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు.

## పిడుగుపాటు, అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం

- రూ.6 లక్షలు, రూ.4 లక్షల చొప్పున నిధుల విడుదల

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో పిడుగుపాటు, అగ్ని ప్రమాదాల వల్ల మృతిచెందిన వ్యక్తుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని విడుదల చేసింది. పిడుగు పాటుతో చనిపోయిన వారి కుటుంబానికి రూ.6లక్షలు, అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాలకు ఈ పరిహారాన్ని త్వరితగతిన అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఐదేళ్లలో పిడుగుపాటుతో మృతి చెందిన 40 మంది, హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతిచెందిన 10 మంది, రుబీ హోటల్ అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన 8మంది కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించనుంది.

## దేశానికే మోడల్‌గా ఎర్త్‌సైన్సెస్ వర్సిటీ: తుమ్మల



ఖమ్మం, మార్చి 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): దేశంలో ఎక్కడా లేనివిధంగా కొత్తగూడెంలో ఎర్త్‌సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు కాబోతోందని, శ్రీరామనవమిలోగా ప్రభుత్వం నుంచి దీనికి సంబంధించిన జీవో విడుదల చేయనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికే మోడల్‌గా నిలవబోనుందన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు విశ్వవిద్యాలయం లేనందున ఈ జిల్లాలో అన్నిరకాల ఖనిజ సంపద అపారంగా ఉందని, ఇక్కడున్న భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెంలో ఎర్త్‌సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరానని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి కూడా నిపుణులతో నివేదికలు తెప్పించుకుని వర్సిటీ మంజూరు చేశారన్నారు. ఈ యూనివర్శిటీ ఏర్పాటుతో తెలంగాణతోపాటు దేశంలోని పలురాష్ట్రాల విద్యార్థులు ఇక్కడ చదివి భూగర్భ పరిశోధనలు నిర్వహించి శాస్త్రవేత్తలుగా దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురానున్నారని తెలిపారు. తెలంగాణ మొత్తం ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున కేంద్రం నుంచి పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు తీసుకొచ్చామన్నారు. దాంతో అన్ని జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేయబోతున్నామని ఆయన పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర ప్రజలకు, రైతులకు మంత్రి తుమ్మల శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముంబై డీసీపీ పథారే మృతి

- నల్లమల ఘాట్‌రోడ్డులో ప్రమాదం

దోమలపెంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నల్లమల ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో ముంబై డీసీపీ సుధాకర్ పథారేతో పాటు మరొకరు మృతి చెందారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట ఆక్టోపస్ వ్యూపాయింట్ సమీపంలో శనివారం జరిగింది. శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓ ఇన్నోవా కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముంబై డీసీపీ సుధాకర్ పథారే(54)తో పాటు, భగవత్ కిషన్‌రావు కోడ్కే పాటిల్ (66) తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. డీసీపీ మృతికి ముంబై పోలీసులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంకితభావం కలిగిన అధికారి అని కొనియాడారు. కాగా ఈ ఘటనలో డ్రైవర్ తప్పేమీ లేదని, కారు రాంగ్ రూట్‌లో రావడంతోనే ప్రమాదం సంభవించిందని ఆర్టీసీ అధికారులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై వీరమల్లు తెలిపారు.

## విద్యావంతమైన రాజకీయాలకు టీడీపీ బాట

- పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యావంతమైన రాజకీయాలకు తెలుగుదేశం పార్టీ బాట వేసిందని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు తెలిపారు. 1983 ఎన్నికల్లో 127 మంది పట్టభద్రులు, 47 మంది న్యాయవాదులు, 28 మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, 20 మంది వైద్యులు, 8 మంది ఇంజనీర్లకు నాడు ఎన్టీఆర్ టికెట్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు. మాల, మాదిగలకు 46 ఆశ్రమ పాఠశాలలు దేశంలోనే తొలిసారిగా ప్రారంభించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో లక్షా 78వేల సభ్యత్వాలు పూర్తిచేశామని, సంస్థాగతంగా అన్ని కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తామని ఆయన చెప్పారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు శనివారం ఎన్టీఆర్‌భవన్‌లో పార్టీ జెండా ఎగురవేసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆలోచన మేరకు పార్టీ కార్యకర్తలకు రూ.5లక్షల బీమా సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని, దేశంలో మొదటిసారిగా ఒక రాజకీయ పార్టీ తన కార్యకర్తలకు ఈ సౌకర్యం కల్పించిందని ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌గౌడ్ మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి, సామాజికన్యాయం టీడీపీ ఘనత అన్నారు.

## పండగ పూట 'సన్నబియ్యం'

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. శనివారం ఆయన హుజూర్‌నగర్, పాలకవీడు, నేరేడుచర్ల, కోదాడలో సన్నబియ్యం పథకం ప్రారంభోత్సవ సభకు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సభావేదిక నిర్మిస్తున్న ప్రాంతాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. సన్నబియ్యం పథకం కోసం వానాకాలం సీజన్‌లో సైతం సన్నధాన్యానికి కనీస మద్దతు ధరకు తోడు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేశామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 89.73 లక్షల రేషన్‌కార్డులు ఉండగా, 2.80 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. వీరితో పాటు కొత్తగా రేషన్‌కార్డుల కోసం మరో 30 లక్షల వరకు దరఖాస్తులు వచ్చాయని, వీటన్నింటికీ కలిపి ఏప్రిల్ నుంచి 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. మంత్రి వెంట మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, సూర్యాపేట కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ ఉన్నారు.

## గల్ఫ్ డాక్యుమెంటరీని ఆవిష్కరించిన సీఎం



హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మిక కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గల్ఫ్ భరోసాకు సంబంధించి ప్రవాసీ మిత్ర సంస్థ రూపొందించిన గల్ఫ్ డాక్యుమెంటరీ, పోస్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. గల్ఫ్ కార్మికుల సామాజిక భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన నేపథ్యంలో ఈ డాక్యుమెంటరీని రూపొందించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అనిల్, ప్రవాసీ మిత్ర సంస్థ ప్రతినిధులు భీమ్‌రెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లు కొడంగల్‌కే సీఎం సీటు

**దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా.. భూ నిర్వాసిత కుటుంబాలకు రెండు ఉద్యోగాలు**

- బీసీలకు వ్యతిరేకంగా బీజేపీ తీరు
- హిందూ ముస్లింలు ఏకమై దేశాన్ని కాపాడాలి: సీఎం రేవంత్



కొడంగల్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్/వికారాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీ.. పదేళ్లపాటు కొడంగల్‌కే ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లలో కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదుద్దుతానన్నారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన వారి కుటుంబాలకు ఎకరాకు రూ.20 లక్షలు, 150 గజాల ఇంటిస్థలంతోపాటు కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వచ్చే ఐదేళ్లలో మరో రూ.10 వేల కోట్ల పనులు చేపడతామని చెప్పారు. శనివారం తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం పర్యటించారు. సాయంత్రం కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ముస్లింలకు సీఎం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి కొడంగల్‌లోని తన నివాసంలో నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశంలో రేవంత్ మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంటు సాక్షిగా బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా, మహాత్మాగాంధీని చంపిన వారిని ప్రోత్సహించేలా మాట్లాడడం దారుణమన్నారు. వెనుకబడిన వర్గాలకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సమావేశాలు నిర్వహించి ఆయన స్ఫూర్తి చాటాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు.

### కొడంగల్ ప్రజలిచ్చిన శక్తితోనే..

కొడంగల్ ప్రాంత ప్రజలు ఇచ్చిన శక్తితోనే తాను ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీకి వస్తే కొడంగల్ వ్యక్తిగా తాను మాట్లాడితే మాట పడాల్సి వస్తుందనే మాజీ సీఎం కేసీఆర్ సభకు రావడం లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ తరపున అసెంబ్లీకి వచ్చిన వారికి ఓనమాలు కూడా రావని అన్నారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు ఉండాల్సిన అధికారం కొడంగల్‌కు రావడంతో కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. కొడంగల్‌ను ఎలాగైనా దెబ్బతీయాలనే లక్ష్యంతో రైతులను రెచ్చగొట్టి పరిశ్రమలను అడ్డుకునేందుకు చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం హోదాలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి తెలంగాణను కాపాడుకునే బాధ్యతను తాను తీసుకుంటానని, కొడంగల్ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని అన్నారు. తనను లగచర్లకు వెళ్లాలంటూ అసెంబ్లీలో కేటీఆర్ విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, త్వరలోనే లగచర్లలో సమావేశం నిర్వహించి రైతులతో మాట్లాడతానన్నారు. కొడంగల్ ప్రాంతంలో ఎకరా భూమి ధర కోటి రూపాయల వరకు పెరగడమే తన ఆకాంక్ష అని ప్రకటించారు.

### ఒక్క సంతకంతో అన్నీ కొడంగల్‌కు..

"నేను ఉన్నంతవరకు కొడంగల్‌లో అభివృద్ధి పనుల కోసం మీరు ఎవరి వద్దకో వెళ్లి బిక్షం అడగాల్సిన పనిలేదు. ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి. పనుల కోసం మీరు హైదరాబాద్‌కు రావాల్సిన పని లేదు. చిట్టీ రాసి పంపిస్తే 24 గంటల్లో నేనే వచ్చి కొడంగల్‌కు ఏ పనులు కావాలో అవన్నీ పూర్తి చేయిస్తాను" ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన సందర్భంగా వారినుద్దేశించి సీఎం మాట్లాడారు. గత 15 ఏళ్లుగా మంచికి, చెడుకు ఇక్కడి ముస్లింలు తనకు అండగా ఉన్నారని తెలిపారు. కొడంగల్‌లో ముస్లింల అభివృద్ధికి ఎమ్మెల్యే అభివృద్ధి నిధుల నుంచి 25 శాతం కేటాయించామని గుర్తు చేశారు. దేశంలో ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించింది కాంగ్రెస్సేనని తెలిపారు. మతోన్మాద పార్టీలకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో కాంగ్రెస్ ముందుంటుందన్నారు. హిందూ, ముస్లింలు ఏకమై దేశాన్ని రక్షించాలని భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఆ దిశగా తాము కృషి చేస్తూ ఉంటే, ఎన్నికల్లో గెలుపొందడానికి కొందరు మనలో మనకు విబేధాలు సృష్టించి లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలను సాగనివ్వబోమన్నారు.

## ప్రజావసరాలకు అనుగుణంగా లింక్ రోడ్లు

- రోడ్ల విస్తరణ, కొత్త రోడ్లను నిర్మించాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రాజధాని నగరంతో పాటు హెచ్‌ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై సమీకృత పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచడం, అవాంతరాలు లేకుండా ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.అనుసంధాన రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్లాలని సూచించారు. ఆయా రహదారుల నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వారికి ప్రయాణ సమయం కలిసి వచ్చేలా ఉండాలని, ఈ క్రమంలో అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని స్పష్టం చేశారు.

## వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామిని శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సీఎంకు మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సీఎం మొదట శ్రీ భూవరాహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ప్రదక్షిణగా వెళ్లి ప్రభుత్వం తరఫున స్వామివారికి సమర్పించారు. అనంతరం యాగశాలలో ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆస్థాన మండపంలో వేద పండితులు, అర్చకులు తీర్థ ప్రసాదాలు, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన స్వామి వారి శేషవస్త్రాలను సీఎం రేవంత్‌రెడ్డికి బహూకరించి ఆశీర్వదించారు. దేవాలయ ధర్మకర్తలు శ్రీవేంకటేశ్వరస్వామి ఫొటో, వస్త్రం, ప్రసాదాలను అందజేశారు.



## వచ్చేస్తున్నాయ్ కొత్త బార్లు!

- జీహెచ్‌ఎంసీ మినహా 25 చోట్ల ఏర్పాటు
- నోటిఫికేషన్‌కు సర్వం సిద్ధం చేసిన సర్కార్
- ఎన్నికల కోడ్ ముగిశాక జీహెచ్‌ఎంసీ పరిధిలో మరో 15 బార్లు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త బార్లు ఏర్పాటుకానున్నాయి. జీహెచ్‌ఎంసీ మినహా రాష్ట్రవ్యాప్తంగా 25 చోట్ల బార్లు రానున్నాయి. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై ప్రభుత్వ ఆమోద ముద్ర పడింది. ఈమేరకు నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఆబ్కారీశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏప్రిల్ 26 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జనాభా ప్రాతిపదికన, రాబడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని బార్లను ఏర్పాటు చేయనున్నారు. ఎలైట్ బార్లకు అనుమతులతో పాటు మైక్రోబ్రూవరీల సంఖ్య పెంచాలని భావించినా, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1176 బార్లు ఉన్నాయి. వీటిలో దాదాపు సగం వరకు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం బీర్ల ధరలు పెంచింది. రాష్ట్రంలో లేని విదేశీ, దేశీయ లిక్కర్, బీరు కంపెనీలు తమ మద్యం ఉత్పత్తి బ్రాండ్లను అమ్ముకునేందుకు టీజీబీసీఎల్ దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఇదే తరుణంలో కొత్త బార్లకు అనుమతి ఇవ్వడానికి ఎక్సైజ్ శాఖ ముందుకొచ్చింది. కాగా బార్లకు సంబంధించి ఒక్కో దరఖాస్తుకు ఫీజును రూ.లక్షగా నిర్ణయించారు. ఈ డబ్బు తిరిగి ఇవ్వరు. ఎవరైతే బార్ దక్కించుకుంటారో.. వారు ఏడాదికి ఒక్కో బార్‌కు రూ.40లక్షల నుంచి రూ.45లక్షల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలో కొత్త బార్ల ఏర్పాటుకు అనుమతి నిచ్చింది. వచ్చేది స్థానికసంస్థల ఎన్నికల సమయం కావడంతో మద్యం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని.. వాటిని దృష్టిలో పెట్టుకుని బార్ల ఏర్పాటుకు ఎక్కువ సంఖ్యలో ముందుకొస్తారని ఆబ్కారీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన చోట్ల లాటరీ పద్ధతిన ఎంపిక చేయాలని నిర్ణయించారు. వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా 40బార్లకు ఒకేసారి అనుమతులు ఇవ్వాలనుకున్నారు. అయితే.. జీహెచ్‌ఎంసీ పరిధిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో తాజాగా ఇవ్వబోయే నోటిఫికేషన్‌లో ఈ ప్రాంతాలను మినహాయించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జీహెచ్‌ఎంసీ పరిధిలో 15కొత్త బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

# ఆ 43 బ్రిడ్జిలకు మోక్షం!

- గడిచిన పదేళ్లుగా అసంపూర్తిగానే
- పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ నిర్ణయం
- 138 కోట్లు ఖర్చవుతుందని అంచనా

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పలు నియోజకవర్గాల్లో గడిచిన పదేళ్లలో 43 బ్రిడ్జిల నిర్మాణాలు మొదలు పెట్టినా.. వాటిని పూర్తి చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వాటికి అప్రోచ్ రోడ్లు సహా మరికొన్ని ఇతర పనులనూ చేయకపోవడంతో అవీ వినియోగానికి అనువుగా లేవు. ఇలా అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిలన్నింటినీ పూర్తి చేయడంతో పాటు, అప్రోచ్ రోడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని తాజాగా రోడ్లు, భవనాల శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఇదే అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 43 బ్రిడ్జిల నిర్మాణాల కోసం రూ.197.94 కోట్లను పలు దఫాలుగా కేటాయించారు. ఆ నిధులనూ పూర్తి స్థాయిలో మంజూరు చేయలేదని తెలిసింది. అయితే ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండడంతో నిర్మించిన బ్రిడ్జిలను పూర్తి చేయడంతో పాటు కొంతమేర మరమ్మతులు చేయాల్సి ఉందని శాఖ అధికారుల పరిశీలనలో తేలింది. అదే సమయంలో బ్రిడ్జిలపై రాకపోకలు సాగించేందుకు అనువుగా వేయాల్సిన అప్రోచ్ రోడ్ల కోసం కొన్ని చోట్ల భూ సేకరణ చేపట్టాల్సి ఉందని గుర్తించారు. మరమ్మతులు, అప్రోచ్‌రోడ్ల నిర్మాణాలకు అవసరమయ్యే భూముల సేకరణకు చెల్లించే పరిహారం నిధులు కలిపి మరో రూ.138కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వం కూడా దీనిపై సానుకూలంగా స్పందించడంతో, బ్రిడ్జిల పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్టు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ఈ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏయే ప్రాంతంలోని బ్రిడ్జిల దగ్గర ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలి, అప్రోచ్ రోడ్ల కోసం ఎంత మేర భూములను సేకరించాలనే వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

### అప్రోచ్‌రోడ్డు వేయాల్సిన 43 బ్రిడ్జిల్లో కొన్ని



ఖమ్మం జిల్లాలోని రాయపట్నం-ఇల్లూరు మధ్యలో అప్రోచ్ రోడ్ లేని బ్రిడ్జి

- ఖమ్మం జిల్లాలోని మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలో ఇల్లూరు- ఖమ్మంపాడు, దెందుకూరు-చిలుకూరు మధ్యలో నిర్మించదల్చిన బ్రిడ్జి పనుల పూర్తికి రూ.21కోట్లు అవసరమని అంచనా వేశారు.
- మెదక్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల పరిధిలోని మంజీరా నదిపై ధర్మారెడ్డి-ముద్దపూర్ హై లెవల్ బ్రిడ్జి పనులకు రూ.33.5 కోట్లు కావాల్సి ఉంటుందని అంచనా.
- చేవెళ్ల పరిధిలో వెలమాలతండా టూ తంగేడ్‌పల్లి క్రాస్‌రోడ్స్ వరకు హై లెవల్ బ్రిడ్జి పనులు ఆగిపోయాయి. పనుల నిర్వహణకు రూ.36కోట్లు కావాలని, భూసేకరణకు రూ.33కోట్లు కావాలని అంచనా.
- దేవరకొండ నియోజకవర్గం పరిధిలో బొల్లారం-అక్కారం గ్రామాలను కలిపేందుకు ఒక హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కూడా ఆగిపోయింది. ఇందుకు అదనంగా మరో రూ.2.6కోట్లు అవసరమని అంచనా.

# జీపీవోకు అర్హతలివే

- డిగ్రీ లేదా ఇంటర్మీడియట్ చదువు
- వీఆర్‌వో లేదా వీఆర్‌ఏగా ఐదేళ్ల సర్వీసు
- రాత పరీక్ష ఆధారంగా నియామకం
- గత సర్వీసు కాలం జీరోగా మార్పు
- గ్రామ పాలనాధికారి పోస్టుకు మార్గదర్శకాలు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రద్దు చేసిన వీఆర్‌వో, వీఆర్‌ఏల స్థానంలో గ్రామ పాలనాధికారి(జీపీవో) పోస్టును తేవాలని భావిస్తున్న ప్రభుత్వం అందుకు సంబంధించి కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగా జీపీవో నియామకానికి అవసరమైన మార్గదర్శకాలను విడుదల చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం జీవో జారీ చేశారు. దీని ప్రకారం గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ లేదా ఇంటర్ విద్యార్హత కలిగి ఉండి.. గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్‌వో)/ గ్రామ రెవెన్యూ సహాయకుడు(వీఆర్‌ఏ)గా కనీసం ఐదేళ్ల పాటు పనిచేసిన వారు జీపీవో పోస్టుకు అర్హులు. వీరి నుంచి ఆప్షన్లు తీసుకున్నాక.. రెవెన్యూ శాఖపై రాత పరీక్ష పెడతారు. ఆ ఫలితాల ఆధారంగా నియామకం చేస్తారు. నియామక అధికారం భూపరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ)/ లేదా సీసీఎల్‌ఏ ద్వారా అధికారాలు పొందిన వారికే ఉంటుంది. త్వరలోనే జీపీవో సర్వీసు రూల్స్‌ను ప్రభుత్వం విడుదల చేయనుంది. దాంతోపాటు ప్రస్తుతం పొందుతున్న వేతనానికి రక్షణ ఉంటుంది. ఇక, ఇంతకు ముందు రెవెన్యూ శాఖలో వీఆర్‌వో, వీఆర్‌ఏగా పని చేసిన సర్వీసు కాలాన్ని లెక్కలోకి తీసుకోరు.

### ఇవీ బాధ్యతలు

- గ్రామ రికార్డుల నిర్వహణ.
- సర్టిఫికెట్ల కోసం వచ్చే దరఖాస్తుల పరిశీలన, విచారణ.
- ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవడం. చెరువులు, నీటి కుంటల రక్షణ.
- భూములతో పాటు ముడిపడిన వివాదాలపై విచారణ. భూముల సర్వేకు వచ్చే సర్వేయర్లకు సహకారం అందించడం.
- విపత్తుల సమయంలో అత్యవసర సహాయ చర్యల్లో పాల్గొనడం.
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో లబ్ధిదారులను గుర్తించడం.
- ఎన్నికల విధులు, ప్రొటోకాల్ బాధ్యతలు నిర్వర్తించే వారికి సాయం అందించడం.
- గ్రామ, క్లస్టర్, మండల స్థాయిలో శాఖల అధికారులతో సమన్వయంచేసుకోవడం.
- సీసీఎల్‌ఏ లేదా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడం.

## ఆస్తి పన్ను వసూళ్లలో తెలంగాణ రికార్డు

- రూ.1000 కోట్లు దాటిన వసూళ్లు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో తెలంగాణ కీలక మైలురాయిని దాటింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రాష్ట్రంలోని పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలు రూ.1000 కోట్లకు పైగా ఆస్తి పన్ను వసూలు చేశాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.922 కోట్ల ఆస్తి పన్ను మాత్రమే వసూలైంది. కానీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ముగియడానికి రెండు రోజుల ముందే (శనివారంకల్లా) ఆస్తి పన్ను వసూళ్లలో కొత్త రికార్డు నమోదైంది. ఆస్తి పన్ను పాత బకాయిలపై అపరాధ రుసుములో కల్పించిన 90శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పురపాలకశాఖ కోరింది. ఈ నెల 30(ఆదివారం- ఉగాది), 31(సోమవారం-రంజాన్)సెలవు దినాలైనా.. పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిపింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు రోజులు మిగిలే ఉన్నందున ప్రజలు తమ ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని పురపాలకశాఖ విజ్ఞప్తి చేసింది.

## ఒక్క రోజే రూ.140 కోట్లు!

- రూ.1,163 కోట్లు దాటిన ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) కింద శనివారం సాయంత్రం 5 గంటల దాకా ప్రభుత్వానికి రూ.1,163కోట్ల ఆదాయం సమకూరింది. శనివారం ఒక్కరోజే రూ.140కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికార వర్గాల సమాచారం. ఎల్‌ఆర్‌ఎస్-2020 కింద 25.68లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 31దాకా రాయితీతో క్రమబద్ధీకరణకు అవకాశం ఉండటం, గడువు ముగియడానికి ముందు వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ప్రభుత్వం చొరవ తీసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సెలవు రద్దు చేసింది. ఎల్‌ఆర్‌ఎస్ కింద ప్రభుత్వం ఇచ్చిన రాయితీ గడువు ఈ నెల 31తో ముగుస్తోంది.

# రేపే రంజాన్

### నేడు పశ్చిమాసియా దేశాల్లో పండుగ

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్) సోమవారం జరగనుంది. శనివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో సౌదీ అరేబియాతో పాటు పలు పశ్చిమాసియా దేశాల్లో ఆదివారం పండుగను జరుపుకుంటున్నారు. దాంతో భారతదేశంలో సోమవారం పండుగను చేసుకోనున్నారు. ఈ నెల 2వ తేదీన రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. దాంతో ఆదివారం రోజున చివరి ఉపవాసదీక్ష ఉండనుంది. ఇక రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా హలీం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మాసంలో రూ.800 కోట్ల హలీమ్ విక్రయాలు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో ఒక్క పిస్తాహౌస్‌లోనే ప్రతిరోజు 2 వేల కిలోల హలీమ్‌ను విక్రయిస్తుండగా, మదీనాలోని షాదాబ్, మాసాబ్‌ట్యాంక్‌లోని 555, మెహదీపట్నం, బంజారాహిల్స్‌లోని సర్వి, పాతబస్తీ, టోలిచౌకి, లక్డీకాపూల్, గచ్చిబౌలీ ప్రాంతాల్లోని షాగౌస్, మెహఫిల్ వంటి రెస్టారెంట్లు సగటున రోజుకి 1000 నుంచి 1500 కిలోల దాకా హలీమ్ అమ్ముతున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో ఏప్రిల్ 6వ తేదీ దాకా హలీం విక్రయాలు జరగనున్నాయి. రంజాన్ మాసం ముగిసిన తర్వాత షవ్వాల్ మాసం ప్రారంభం కానుంది. ఆ మాసం ప్రారంభంలో ఆరు రోజుల పాటు చాలా మంది ఉపవాస దీక్షలు చేస్తారు. దాంతో వారి కోసం ఆరురోజుల పాటు ప్రత్యేకంగా హలీం తయారుకానుంది.

# ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే..

### కొన్ని నంబర్లు ఇచ్చి ట్యాపింగ్ చేయించా

### విచారణలో ఒప్పుకొన్న శ్రవణ్‌రావు

### 2న మళ్లీ విచారణకు రావాలన్న పోలీసులు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే డీఎస్పీ ప్రణీత్‌రావుతో టచ్‌లోకి వెళ్లానని, కొన్ని నంబర్లు ఇచ్చి ఫోన్ ట్యాపింగ్ చేయించానని ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, మీడియా ఛానల్ అధినేత శ్రవణ్‌రావు అంగీకరించినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైనప్పటి నుంచి విదేశాలకు పారిపోయిన శ్రవణ్‌రావు... సుప్రీంకోర్టు ఆదేశాలతో శనివారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ వెనుక గేటు నుంచి వెళ్లిన శ్రవణ్‌రావును ఏసీపీ ఆధ్వర్యంలోని పోలీసు బృందం ఆరు గంటల పాటు విచారించింది. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఎస్ఐబీతోపాటు సమాంతరంగా శ్రవణ్‌రావుకు చెందిన మీడియా కార్యాలయంలో ట్యాపింగ్ కోసం సర్వర్లను ఏర్పాటు చేశారని, ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ నుంచి పరికరాలను శ్రవణ్‌రావు కొనుగోలు చేసి పోలీసులకు ఇచ్చారని.. అభియోగాలున్నాయి. ఈ నేపథ్యంలో హ్యాకింగ్ పరికరాల కొనుగోలుకు డబ్బు ఎవరిచ్చారు? అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావును ఎవరు పరిచయం చేశారు? అప్పటి ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు మీ కార్యాలయానికి తరచు ఎందుకు వచ్చే వారు? మునుగోడు, దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో కొంతమంది కాంగ్రెస్ నేతలు, రియల్టర్లు, సెలబ్రిటీల ఫోన్ నంబర్లను మీరు ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్‌కు ఇచ్చారా? ఆ నంబర్లను మీ మీడియా ద్వారానే సేకరించారా.. లేక ఎవరైనా ఇచ్చారా? ప్రభుత్వంతో ప్రత్యక్షంగా మీకెలాంటి సంబంధం లేకపోయినా ఇంత సున్నిత వ్యవహారంలో ఎందుకు వేలు పెట్టారు?.. ఇలా అనేక ప్రశ్నలను పోలీసులు శ్రవణ్‌రావు ముందు ఉంచినట్లు తెలిసింది. అయితే, పోలీసులు సంధించిన ప్రశ్నలకు శ్రవణ్‌రావు సూటిగా సమాధానాలు చెప్పలేదని సమాచారం. ఆరు గంటల పాటు సాగిన విచారణలో పోలీసులకు పెద్దగా సహకరించలేదని తెలిసింది. ముఖ్యంగా రాజకీయ నేతలతో సంబంధాల గురించి ఏమాత్రం పెదవి విప్పలేదని తెలిసింది. ప్రణీత్‌రావుతో సంబంధాల విషయమై కొన్ని అంశాలు బయటపెట్టినా.. రాజకీయ నేతల గురించి ఏమాత్రం మాట్లాడలేదని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దలు అనే మాట మినహా ఎలాంటి వివరాలు బయటపెట్టలేదని వినికిడి. కాగా, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శ్రవణ్‌రావు వాంగ్మూలాన్ని వీడియో రికార్డు చేసినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీన మళ్లీ విచారణకు రావాలని శ్రవణ్‌రావును పోలీసులు ఆదేశించారు. శ్రవణ్‌రావు పూర్తి స్థాయిలో పెదవి విప్పితే.. బీఆర్ఎస్ హయాంలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరు మంత్రులకు చిక్కులు తప్పవనే వాదన వినిపిస్తోంది.

# రిజిస్ట్రేషన్ ఆదాయంలో లోటు!

- గత ఏడాదితో పోలిస్తే

### రూ.323.8 కోట్లు తక్కువ

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అనుకున్నట్టుగానే ఈ ఏడాది రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం కాస్త తగ్గింది. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నిర్దేశించిన రూ.18వేల కోట్ల లక్ష్యం చేరుకోవడం కష్టమని గుర్తించిన అధికారులు.. కనీసం గత ఏడాది వచ్చిన రూ.14588.06కోట్ల ఆదాయాన్నైనా దాటాలని విస్తృత ప్రయత్నాలు చేశారు. కానీ.. ఈ నెల 29వతేదీ నాటికి రూ.14264.19కోట్ల ఆదాయమే వచ్చింది. ఇది గత ఏడాది కన్నా రూ.323.87కోట్లు తక్కువ కావడం గమనార్హం. అయితే, ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు ఈ నెల 31న ముగియనుండగా.. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆది, సోమవారాల్లోనూ(సెలవు రోజుల్లోనూ)తెరిచి ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గత ఏడాది ఆదాయాన్ని కచ్చితంగా అధిగమిస్తామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా 1,302 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పెరుగుతుందని అధికారులు ఆశించినా.. మార్కెట్ అనుకూలించలేదన్న చర్చ జరుగుతోంది. మార్కెట్ ఒడిదుడుకులను అంచనా వేసేందుకు కొంత మంది వేచి చూసే ధోరణిలో ఉన్నారని, ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. భూముల విలువ పెంచుతారనే ప్రచారం జరగడంతో 2024 జూలైలో రిజిస్ట్రేషన్లు భారీగా జరిగాయి. ఆ నెలలో ఇచ్చిన లక్ష్యానికి మించి ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. ఆ తర్వాత మళ్లీ క్రయ విక్రయాలు తగ్గాయని అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా ఆదాయం వచ్చే రంగారెడ్డి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో హైడ్రా ప్రభావం పడిందనే చర్చ జరుగుతోంది. దీంతోపాటు ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ సుందరీకరణకు ప్రభుత్వం పూనుకున్నా పూర్తి స్థాయిలో స్పష్టత లేకపోవడం, కొత్త ప్రాజెక్టులు ఏ ప్రాంతం వైపు వెళ్తాయో అనే మీమాంస, ఎన్ఆర్ఐల కొనుగోళ్లు తగ్గడం వంటి కారణాలు ప్రభావం చూపాయన్న వాదన ఉంది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.